ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ప్రకాశం

జిల్లా వార్తలు

శనివారం 11, అక్టోబరు 2025

ఆ ఐదు పనులే!

వెలిగొండ తొలిదశ పూర్తికి అవే కీలకం



గ్యాంట్రీ విధానంలో జరుగుతున్న వెలిగొండ రెండో టన్నెల్ లైనింగ్ పనులు

వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పనులను ఎట్టిపరిస్థితుల్లో వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తి చేసి రిజర్వాయర్‌లోకి కృష్ణా నీటిని పంపాలన్న సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రాజెక్టు అధికారులు విస్తృత కసరత్తు చేస్తున్నారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. నీటిని నింపాలంటే ముంపు గ్రామాల నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, తరలింపు అత్యంత అవశ్యం. అది ప్రాజెక్టు పనులకు భిన్నమైన అంశం కావడంతో రెవెన్యూ యంత్రాంగం నేతృత్వంలో ప్రత్యేక అధికారులు ఆ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనుల్లో పెండింగ్‌లో ఉన్నవి పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

- ప్రాజెక్టు అధికారుల గుర్తింపు
- సీఎం ఆదేశాలతో వాటిపై ప్రత్యేక దృష్టి
- వివిధ దశల్లో రెండో టన్నెల్ లైనింగ్
- టెండర్ల దశలో ఫీడర్ కాలువ నవీకరణ
- నెలాఖరుకు కొలిక్కిరానున్న ప్రక్రియ
- పునరావాసం ప్రత్యేక అంశం

ఒంగోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ప్రాణాధారమైన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అందుకు సంబంధించి దాదాపు రెండు మాసాలుగా వివిధ స్థాయిల్లోని అధికారులు కసరత్తు చేసి ఐదు పనులు కీలకమైనవిగా గుర్తించారు. వాటి పూర్తికి ప్రణాళికాబద్ధ చర్యలపై దృష్టిసారించారు. అందులో రెండో టన్నెల్ లైనింగ్ పనులతోపాటు మరో మూడు వివిధ దశల్లో ఉన్నాయి. ఫీడర్ కాలువ ఆధునికీకరణ టెండర్ల దశలో ఉంది. కాగా నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని గొట్టిపడియ, సుంకేశుల, కాకర్ల వద్ద కొండల మధ్య గ్యాప్‌లలో డ్యాంల నిర్మాణం ద్వారా నల్లమల రిజర్వాయర్ ఏర్పడుతుంది. సుమారు 53.39 టీఎంసీల సామర్థ్యం ఉండే ఈ రిజర్వాయర్‌కు శ్రీశైలం ఎగువ ప్రాంతంలోని కొల్లం వాగు ప్రాంతం నుంచి కృష్ణానది

మిగతా 6వ పేజీలో

ప్రణాళికాబద్ధంగా పనులు

తీగలేరు కాలువకు రిజర్వాయర్ నుంచి నీరిచ్చేచోట గేట్లు అమర్చే పనులు కొనసాగుతున్నాయి. అలాగే అర్ధవీడు మండలంలో కాకర్లవైపు నుంచి వెలగలపాయలోయలోని గ్రామాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా కొండల మధ్యగా రూ.10 కోట్లతో శంకాపురం నుంచి మాగుటూరుకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. కచ్చారోడ్డు నిర్మాణం జరిగింది. తారు రోడ్డుగా పూర్తి నాణ్యతతో చేయాలి. మొత్తం ఐదు పనులు కీలకమైనవిగా గుర్తించి వాటిని నిర్దిష్ట కాల వ్యవధి ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రాజెక్టుల ఎస్ఈ అబుల్ ఆలీ తెలిపారు. ఇదిలా ఉండగా నిర్వాసితుల పునరావాసం, వారి తరలింపు అత్యంత ప్రధాన అంశం కాగా దీనిని ప్రభుత్వస్థాయిలో ప్రత్యేక అంశంగా గుర్తించి తగు చర్యలకు ఉన్నత స్థాయిలో దృష్టి సారించినట్లు సమాచారం.



రేషన్ స్మార్ట్ కార్డులు రెడీ

నేడు ఒంగోలులో పంపిణీ

- పాల్గొననున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్
- ఏర్పాట్లు చేసిన పౌరసరఫరాల శాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెల్లరేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. అందులో భాగంగా స్మార్ట్ కార్డులను తీసుకొచ్చింది. రేషన్ కార్డు అన్ని ప్రభుత్వ పథకాలకు కీలకమైంది. కొంతమంది లబ్ధిదారుల వేలిముద్రలు పడకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈనేపథ్యంలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్మార్ట్‌కార్డుల జారీకి ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వీటిని పంపిణీ చేశారు. మన జిల్లాలో శనివారం నుంచి ప్రారంభిస్తున్నారు.

జిల్లాకు వచ్చిన 6.51 లక్షల స్మార్ట్ కార్డులు

జిల్లాలో 6.61లక్షల తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నాయి. ప్రస్తుతం చెన్నై నుంచి జిల్లాకు 6.51 లక్షల స్మార్ట్ కార్డులు వచ్చాయి. వాటిని మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాలకు చేర్చారు. ఈ స్మార్ట్‌కార్డు క్యూఆర్ కోడ్ లేదా స్వైపింగ్ ద్వారానైనా రేషన్ తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. వీటిని జిల్లా కేంద్రమైన ఒంగోలులో శనివారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శాసనసభ్యుల సమక్షంలో పంపిణీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

షార్ట్ సర్క్యూటే కారణమా?



కంపెనీలోని ఓ బ్లాక్‌లో బూడిదైన పొగాకు

- కలికివాయి వద్ద పొగాకు కంపెనీలో భారీ అగ్నిప్రమాదం
- బూడిదైన పొగాకు బేళ్లు
- రూ.550కోట్ల నష్టం అంచనా
- మూడు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది
- ఆ రెండు బ్లాక్‌లలో ఎవ్వరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం
- వివిధ కోణాల్లో విచారిస్తున్న పోలీసులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

సింగరాయకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలో ఉన్న బీకేటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం వేకువజామున చోటుచేసుకున్న అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూటా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా (జీపీఐ) లిమిటెడ్ కంపెనీ అద్దె ప్రతిపాదికన తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ కంపెనీలో ఏ, బీ బ్లాక్‌లలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడి క్షణాల్లోనే ఒక కోటి పది లక్షల (11 మిలియన్) కేజీల పొగాకు బూడిదైంది. సుమారు రూ.550కోట్ల నష్టం వాటిల్లినట్లు జీపీఐ కంపెనీ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం చోటుచేసుకుని ఉంటుందని కంపెనీ జీఎం అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారీ ప్రమాదం కావడం, నష్టం కూడా పెద్దమొత్తంలో ఉండటంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు.



ఘటనా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఐదు ఫైర్ ఇంజన్లతో అదుపులోకి మంటలు

ప్రమాదం జరిగిన వెంటనే కంపెనీ సిబ్బంది తొలుత టంగుటూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి ఒక ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే భారీగా ఎగసిపడుతున్న మంటలను చూసి కొండపి, ఒంగోలు, కందుకూరు, కావలి నుంచి మరో నాలుగు ఫైర్ ఇంజన్లను తెప్పించారు. ఏ, బీ బ్లాకుల నుంచి అగ్ని కీలలు మిగతా బ్లాకులకు విస్తరించకుండా దాదాపు 3గంటలు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సాయంత్రం వరకు ఐదు ఫైర్ ఇంజన్‌లను అక్కడే

మిగతా 6వ పేజీలో

350 మంది సిబ్బంది సురక్షితం

కంపెనీలో రోజువారీ 900మంది సిబ్బంది పనిచేస్తుంటారు. ప్రమాదం జరిగిన సమయంలో రాత్రి షిఫ్టులో దాదాపు 350 మంది పనిచేస్తున్నారు. గోదాంల నుంచి ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడటంతో వారంతా భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన గోదాంల వెనుకవైపు పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు హుటాహుటినా బయటకు పంపించారు. ఏ, బీ బ్లాక్‌లలో కేవలం ఎగుమతికి సిద్ధంగా ఉన్న పొగాకు మాత్రమే ఉండటం, అందులో కార్మికులెవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

కాలువల్లో నీటి రీడింగ్ తేడాలను సరిచేస్తాం

- గేజింగ్ డివిజన్‌కు నివేదించాం
- ఎన్ఎస్పీ దర్శి ఇన్‌చార్జి ఈఈ సతీష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దర్శి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువల్లో నీటి కొలతల్లో తేడాలను సరిచేస్తామని ఎన్ఎస్పీ దర్శి ఇన్‌చార్జి ఈఈ సతీష్ తెలిపారు. ఈ విషయాన్ని గుంటూరులోని గేజింగ్ డివిజన్‌కు తెలియజేశామని చెప్పారు. 'నీటి కొలతల్లో మతలబు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు వద్ద (ప్రకాశం బార్డర్), దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద రీడింగ్‌లో తేడాతో కిందకు తక్కువ నీరు వస్తున్నా ఎక్కువ నీరు విడుదల అవుతున్నట్లు రీడింగ్ చూపుతోంది. దీనివల్ల చివరి భూములకు సక్రమంగా నీరందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో జిల్లా అధికారులు స్పందించి రీడింగ్ గేజ్‌లను తనిఖీలు చేసి సరిచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఈఈ తెలిపారు.

రెండో హత్య కేసులో మళ్లీ యావజ్జీవం

78 ఏళ్ల వయసులో ఆవేశం.. వాచ్‌మన్ హత్య

రెండోసారి కూడా నిందితుడికి అదే శిక్ష

కొండపి/ఒంగోలు క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని మద్దులూరు రోడ్డులో 2023 సంవత్సరంలో ఓ బ్రాందీ షాపు ముందు నిద్రిస్తున్న వాచ్‌మన్‌ను హత్య చేసిన కేసులో నిందితుడు కడియం హనుమంతరావుకు యావజ్జీవ శిక్ష పడింది. ఈమేరకు ఒంగోలు అదనపు జిల్లా న్యాయాధికారి టి.రాజావెంకటాద్రి శుక్రవారం తీర్పునిచ్చారు. అప్పట్లో కొండపిలో సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడికి తాజాగా పడిన యావజ్జీవ శిక్ష రెండోసారని తెలిసింది. టంగుటూరు మండలం పొందూరుకు చెందిన కడియం హనుమంతరావుకు దాదాపు 30ఏళ్ల క్రితం ఆ గ్రామంలో జరిగిన హత్య కేసులో యావజ్జీవ శిక్ష పడింది. ఆ కేసులో ముద్దాయిగా శిక్ష

మిగతా 6వ పేజీలో

ఆక్రమణలను తొలగిస్తాం

కాటేరు వాగు, జోమ్ కాలువకు కొలతలు వేయించి హద్దులు ఏర్పాటు చేస్తాం : ఇరిగేషన్ ఈఈ

దర్శి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దర్శి పట్టణంలోని కాటేరు వాగు, జోమ్‌కాలువ ఆక్రమణలను తొలగిస్తామని ఇరిగేషన్ ఈఈ ఎం.శివరాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 'కబ్జా కాటు' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రెవెన్యూ అధికారులతో చర్చించి కాటేరు వాగు, జోమ్ కాలువను కొలతలు వేయించి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. భూమి నిర్ధారణ జరిగిన తర్వాత ఆక్రమణలు తొలగిస్తామని స్పష్టం చేశారు.

మారనున్న దొనకొండ దశ

- ప్రజా ప్రభుత్వంలో చిగురిస్తున్న ఆశలు
- రక్షణ రంగానికి చెందిన భారీ పరిశ్రమ ఏర్పాటుకు మరో అడుగు
- రెండు నెలల క్రితం భూములను పరిశీలించిన డీఆర్‌డీవో ప్రతినిధులు

దొనకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించింది. అందుకు సంబంధించి అడుగులు చకచకా వేస్తోంది. అనంతపురం జిల్లాలోని మడకసిర, మన జిల్లాలోని దొనకొండ, కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేట ప్రాంతాల్లో డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థ దొనకొండలో రెండు దశలుగా రూ.1200 కోట్ల పెట్టుబడులతో ఆయుధ క్షిపణుల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అందుకు 1,400 ఎకరాల భూమి అవసరంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఆమేరకు భూమి కేటాయింపునకు మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,600 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులన్నీ సకాలంలో వస్తే ఏడాదిలో పనులు

మిగతా 6వ పేజీలో



దొనకొండలో భూములను పరిశీలిస్తున్న డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ బృందం (ఫైల్)

దొనకొండ సమీపంలో బీడీఎల్‌కు 1,400 ఎకరాలు

భూ కేటాయింపునకు మంత్రివర్గం ఆమోదం

రూ.1,200 కోట్లతో యూనిట్ ఏర్పాటు

ఒంగోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ప్లాంట్ ఏర్పాటుకు జిల్లాలోని దొనకొండ సమీపంలో ప్రభుత్వం భూమిని కేటాయించింది. మొత్తం 1,400 ఎకరాలను ఇస్తూ శుక్రవారం జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేసింది. దొనకొండ పరిసరాల్లో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించగా పలు కంపెనీలు తమ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన బీడీఎల్ రక్షణ రంగంలో

మిగతా 6వ పేజీలో



ఒంగోలు పప్పుబజారు శాఖలో పేరు మార్చిన గ్రామీణ బ్యాంక్

గ్రామీణ బ్యాంకులు విలీనం

- ఇకపై 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు'గా మార్పు
- 13వ తేదీ వరకూ నిలిచిపోనున్న సేవలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు గ్రామీణ బ్యాంకులు విలీనమవుతున్నాయి. ఇప్పటివరకు బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను కలిపి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్'గా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నాలుగు బ్యాంకుల ద్వారా అందిస్తున్న సేవలను ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చే ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు శుక్రవారం నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఈ బ్యాంకుల ద్వారా నిర్వహించే సేవలు నిలిచిపోనున్నాయి. దీంతోపాటుగా ఈ బ్యాంకుల పరిధిలో కొనసాగే ఏటీఎం, మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్ వంటి ఆన్‌లైన్ సేవలు కూడా అందవని బ్యాంకర్లు వెల్లడిస్తున్నారు. ఈనెల 11 రెండో శనివారం, 12 ఆదివారం బ్యాంకులకు సెలవులు అయినప్పటికీ సాధారణంగా సెలవు రోజుల్లో పనిచేసే ఆన్‌లైన్ సేవలు కూడా నిలిచిపోతాయని వారు చెప్పారు.



రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి
- కలెక్టర్ రాజాబాబు ఆదేశం

7

దొనకొండ సమీపంలో బీడీఎల్‌కు 1,400 ఎకరాలు

(5వ పేజీ తరువాయి)

ఆయుధ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. సుమారు రూ.1200 కోట్లతో నూతన ఆయుధ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించేందుకు 1,400 ఎకరాల భూమి అవసరంగా బీడీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రెండు దశల్లో ఈ ప్లాంట్ నిర్మించాలని భావిస్తుండగా దీని ద్వారా 1,600 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. కాగా బీడీఎల్ కోరిక మేరకు భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో ప్లాంట్ ఏర్పాటుకు 1,200 ఎకరాలు, టౌన్‌షిప్ నిర్మాణానికి 146.67 ఎకరాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చేతిలో ఉన్న భూమిని ఎకరా రూ.7.73 లక్షల వంతున ఇవ్వనుండగా.. మిగిలిన భూమికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కేటాయించాలని నిర్ణయించారు.

రెండో హత్య కేసులో మళ్లీ యావజ్జీవం

(5వ పేజీ తరువాయి)

అనుభవించాడు. అనంతరం తన స్వగ్రామం పొందూరు విడిచి కొండపికి వచ్చి గుడులు, పాడుబడిన, ఖాళీగా ఉండే ఇళ్లలో ఉంటున్నాడు. 2023 సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీ రాత్రి పది గంటల సమయంలో కొండపిలోని బ్రాందీ షాపులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మండలంలోని పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సంగన సుబ్బారెడ్డితో దుకాణం మూసేటప్పుడు గొడవ పడ్డాడు. ఆవేశంతో చంపుతానని బెదిరించి వెళ్లిపోయారు. అర్ధరాత్రి తన నివాసం నుంచి గడ్డపారతో వెళ్లి బ్రాందీ షాపు ముందు నిద్రిస్తున్న సుబ్బారెడ్డి తలపై కొట్టి చంపాడు. ఈమేరకు మృతుడి భార్య సంగ సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాలో రికార్డయిన దృశ్యాలు, పోలీసు జాగిలాలు కూడా నేరుగా నిందితుడి ఇంటికి వెళ్లాయి. ఈ కేసులో తిరిగి హనుమంతరావుకు యావజ్జీవ శిక్ష పడింది. ఒకే వ్యక్తికి రెండుసార్లు హత్య కేసుల్లో యావజ్జీవ శిక్ష పడటం అరుదు. మొదటిసారి శిక్ష పడ్డాక సహజంగా పశ్చాత్తాపం ఉంటుంది. అటువంటిది తిరిగి రెండోసారి హత్య చేయడం విచిత్రంగా ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలు వినిపించారు. సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టిన పోలీసులను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండమంజులూరు గ్రామంలో శనివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. 11వ తేదీ ఉదయం 10గంటలకు కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు. 11 గంటలకు బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు, ఒంటి గంటకు సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

అద్దంకిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం పొందవచ్చని అద్దంకి ఏడీఏ బి. ఎప్రాయిమ్ చెప్పారు. శుక్రవారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో గో-ఆధారిత వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హుస్సేన్ హాజరై మాట్లాడారు. రైతులకు అందుబాటులో అన్ని రకాల కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం రైతులకు అందుబాటులో ఉంచి, తక్కువ ధరకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు స్వంతగా కూరగాయలు పండించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవా లన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా కషాయాలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఆదర్శ రైతు నరిశెట్టి రమేష్, షాపు యజమాని నరేంద్ర, అశోక్, కోకిల, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు గ్రామంలో శుక్రవారం ఒంగోలు ఆత్మవారి సహకారంతో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో అవసరమైన వివిధ కషాయాల తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలి

జిల్లా పోలీసుల పనితీరుపై సమీక్షించిన ఐజీ



సమీక్షిస్తున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జవాబుదారీతనం, పారదర్శకత పెరగాలని గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి చెప్పారు. శుక్రవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఐజీ జిల్లా పోలీసు పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ పలు సూచనలు చేశారు. రాత్రి పగలు డ్రోన్‌లతో పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియా వేదికలపై ఇష్టానుసారంగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలుతీసుకోవాలని చెప్పారు. దీపావళి సందర్భంగా వ్యాపారులు నిబంధలను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, సైబర్‌నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అదే విధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ హర్షవర్ధనరాజు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు. సమావేశంలో డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయిఈశ్వర్ యశ్వత్, రమణకుమార్, సీఐలు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఫ్యాక్టరీల యజమానులు

చీమకుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో విస్తరించిన గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 2,500 గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు పదిరోజుల నుంచి సమ్మె చేస్తున్నా పట్టించుకొనేవారే కరవయ్యారని, ఫ్యాక్టరీలు మూతపడటంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని వినతిపత్రంలో తెలిపారు. రాయల్టీ వసూలు గతంలో వలే ప్రభుత్వమే వసూలు చేయాలని, ఏఎంఆర్ సంస్థకు ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలని కోరారు. పెంచిన రాయల్టీని తగ్గించి పరిశ్రమను కాపాడాలని కోరారు. వెంటనే ఫ్యాక్టరీ ఓనర్లతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మాకినేని అమరసింహం, పుత్తూరి శ్రీనివాసరావు, జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాధవ్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు

నేడు ఫ్యాక్టరీ ఓనర్ల అత్యవసర సమావేశం

పదిరోజుల నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసివేసి సమ్మె చేస్తున్న ఓనర్లు శనివారం వీటీసీలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కొనసాగిస్తున్న సమ్మెపై సమీక్ష, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తోనూ, ఏఎంఆర్ సంస్థతోనూ రెండువిడతలపాటు అసోసియేషన్ నాయకులు జరిపిన చర్చల సారాంశాన్ని ఓనర్ల అందరికీ వివరించి తదుపరి కార్యాచరణను రూపొందించనున్నారు. సీనరేజి వసూలు హక్కులను టెండర్ ద్వారా పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రభుత్వంతో ఇంకా ఒప్పందం కుదుర్చుకోలేదు. ఈనెల 3న అని మొదట అనుకున్నా ఫ్యాక్టరీ ఓనర్ల సమ్మె నేపథ్యంలో వ్యూహాత్మకంగా ఒప్పందం కుదుర్చుకోవటంలో వాయిదాలు వేస్తూ వస్తున్నారు. తాజాగా 24వ తేదీ వరకూ గడువు కోరటం, ప్రభుత్వం మంజూరు చేయటం జరిగింది. దీంతో ఫ్యాక్టరీ ఓనర్లు పునరాలోచనలో పడ్డారు. సమ్మెకు తాత్కాలికంగా విరామం ఇచ్చి ఏఎంఆర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకొన్న తర్వాత వారి పోకడలు చూసి తిరిగి సమ్మె చేద్దామా లేదా ప్రస్తుతం నిర్వహిస్తున్న సమ్మెను కొనసాగిద్దామా అనే విషయాన్ని నేడు జరగనున్న ఓనర్ల సమావేశంలో నిర్ణయించనున్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి

రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి

మండల రైతు సంఘం మహాసభల్లో కృష్ణయ్య



మాట్లాడుతున్నరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

మార్టూరు, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వైఖరిని వ్యతిరేకించాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పోరాటం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారమిక్కడ మండల రైతుసంఘం 3 మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో బహిరంగసభ నిర్వహించారు. సభకు మండల శాఖ అధ్యక్షుడు పాలెపు సాంబయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు భూములను దారాధత్తం చేస్తున్నారని, తద్వారా వ్యవసాయ రంగాన్ని నీరుగారుస్తున్నారని చెప్పారు. వ్యవసాయంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తూ వాటిని కార్పొరేట్ సంస్థలకు అండగా ఉంటున్నాన్నారు. సభలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, పేర్ని నాగేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, నాగబోయిన సాంబయ్య, గాడిపర్తి నాగేశ్వరరావు, వెల్లలచెరువు సుబ్బారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మండల రైతు సంఘం నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. మండల గౌరవ అధ్యక్షుడిగా పాలెపు సాంబయ్య, అధ్యక్షుడిగా పేర్ని నాగేశ్వరరావు, కార్యదర్శిగా వీరవల్లి కృష్ణమూర్తి, సభ్యులుగా గోనుగుంట్ల మోహనరావు, దూళ్లిపాళ్ల శ్రీనివాసరావు తదితరులను సభ్యులుగా ఎంపిక చేశారు.

ఆ ఐదు పనులే!

(5వ పేజీ తరువాయి)

నీటిని 18.80 కి.మీ రెండు టన్నెళ్ల ద్వారా దోర్నాల మండలం కొత్తూరు దగ్గరకు తెస్తారు. అక్కడి నుంచి 21.80 కి.మీ ఫీడర్ కాలువ ద్వారా రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. తూర్పు ప్రధాన కాలువ, గొట్టిపడియ కాలువ, తీగలేరు కాలువల ద్వారా 4.34 లక్షల ఎకరాలకు సాగునీరు, 15లక్షల మందికి తాగునీరు ఇస్తారు. తొలిదశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 8 లక్షల మందికి తాగునీరు ఇవ్వాలన్నది లక్ష్యం. తొలిదశ పూర్తిచేసి నీరు ఇవ్వాలంటే డ్యామ్‌లు నిర్మించి రిజర్వాయర్ ఏర్పాటు, ఫీడర్ కాలువ, టన్నెల్ పనులు పూర్తి చేయాలి. రిజర్వాయర్ నుంచి మూడు కాలువలకు నీరు తీసుకునే పాయింట్ వద్ద గేట్లు, ఇతర ఏర్పాట్లు పూర్తిచేయాలి.

నిధుల విడుదలకు భరోసా

ప్రాజెక్టు పూర్తికి సుమారు రూ.10 వేల కోట్ల వ్యయం అంచనా వేయగా ఇప్పటివరకు రూ.6వేల కోట్లు ఖర్చుచేశారు. తొలిదశ పూర్తికి రూ.2,050 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆ నిధులకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చి వచ్చే ఏడాది ఆగస్టుకు తొలిదశ పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. దీంతో పెండింగ్ పనులపై ప్రాజెక్టు అధికారులు దృష్టి సారించారు. మూడు చోట్ల డ్యామ్‌ల నిర్మాణం ద్వారా రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. టన్నెల్ తవ్వకాలు, హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం, ఫీడర్ కాలువ తవ్వకాలు కూడా పూర్తయ్యాయి. అయితే దశాబ్దన్నర క్రితం తవ్విన ఫీడర్ కాలువ ప్రస్తుతం దెబ్బతింది.. దానిని ఆధునికీకరించాలని అధికారులు నివేదించడంతో ఆ పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే టన్నెళ్ల తవ్వకం పూర్తయినా రెండో సొరంగంలో సుమారు 4.50 కి.మీ లైనింగ్ చేయాల్సి ఉంది. అలా ఫీడర్ కాలువ బాగు, రెండో టన్నెల్ లైనింగ్‌తో పాటు కాకర్ల గ్యాప్ నుంచి లోయలోకి వెళ్లే గ్రామాల రోడ్డు మూసివేయడంతో ఆ ప్రాంతంలో ఉండే పది గ్రామాల వారు బయటకు వచ్చేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించాల్సి ఉంది. వీటితోపాటు తూర్పు ప్రధాన కాలువ కోసం రిజర్వాయర్ వద్ద 40మీటర్ల ఎత్తులో హెడ్ రెగ్యులేటరీ, తీగలేరు కాలువకు నీరిచ్చేందుకు రిజర్వాయర్ వద్ద గేట్ల నిర్మాణం చేయాలి. ఇలా ఐదు పనులను తొలిదశ ప్రాజెక్టు పూర్తిలో కీలకమైన పెండింగ్ పనులుగా అధికారులు గుర్తించారు.

ఫీడర్ కాలువ బాగుకు టెండర్లు

ఐదు కీలక పనులలో ఒకటైన ఫీడర్ కాలువ ఆధునికీకరణకు రూ.370 కోట్లతో టెండర్లను పిలిచారు. ఈ నెలాఖరులోపు ఆ ప్రక్రియ పూర్తయి అనంతరం పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇందులో 21.80 కి.మీ లైనింగ్, మూడు చోట్ల 5.32 కి.మీ కాంక్రీటు గోడల పనులు ప్రధానం. కాంక్రీటు గోడలు సకాలంలో పూర్తిచేస్తే లైనింగ్ పని మిగిలి ఉన్నప్పటికీ నీటిని ఇవ్వవచ్చని సమాచారం. రెండో టన్నెల్ లైనింగ్ పనులు 4.50 కి.మీ చేయాల్సి ఉండగా గ్యాంట్రీ విధానంలో వాటిని చేపడుతున్నారు. ప్రస్తుతం రెండు చోట్ల విడివిడిగా యంత్రాలతో పెడుతుండగా.. మరో రెండు చోట్ల కూడా యంత్రాలు పెట్టి త్వరితగతిన పూర్తికి చర్యలు చేపడుతున్నారు. తూర్పు ప్రధాన కాలువకు రిజర్వాయర్ నుంచి నీటిని ఇచ్చే హెడ్ రెగ్యులేటరీని సుమారు 40 మీటర్ల ఎత్తులో నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం 10 మీటర్ల ఎత్తు నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. ప్రతి పది మీటర్లకు ఒకసారి కాంక్రీటు వేసేలా చర్యలు చేపట్టారు.

మారనున్న దొనకొండ దశ

(5వ పేజీ తరువాయి)

ప్రారంభించి రెండేళ్లకు పూర్తి చేసేలా ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. రెండు నెలల క్రితం డీఆర్‌డీవో సంస్థకు చెందిన ప్రతినిధులు దొనకొండకు వచ్చి ఈ ప్రాంతంలోని భూములను, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు.

అనేక అనుకూల అంశాలు

ఆపరేషన్ సిందూర్ అనంతరం బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తిని పెద్దఎత్తున పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా దొనకొండలో రక్షణశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక రక్షణ రంగ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పేందుకు ఇటీవల ప్రభుత్వానికి బీపీఎల్ సంస్థ డీపీఆర్‌ను అందించినట్లు తెలుస్తోంది. దొనకొండలో బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం, గుంటూరు-బెంగళూరు ప్రధాన రైలు మార్గం ఉండటం భారీ పరిశ్రమల ఏర్పాటుకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దొనకొండ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ప్రకటించారు. అందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.

గత టీడీపీ ప్రభుత్వంలోనే భూముల గుర్తింపు

రాష్ట్ర విభజన అనంతరం దొనకొండ ప్రాంతంలో అధికంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేస్తామని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందులోభాగంగా మండలంలోని భూములను రెవెన్యూ అధికారులచే సమగ్ర సర్వే చేయించి పట్టా భూమి 4,407.62 ఎకరాలు, ప్రభుత్వ భూమి 12,367.95 ఎకరాలు, అసైన్‌మెంట్ భూమి 8,287.28 ఎకరాలు.. మొత్తం 25,061.85 ఎకరాల భూమి ఉన్నట్లు తేల్చారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ ప్రాంతాలకు చెందిన ఎందరో ప్రతినిధులు దొనకొండ వచ్చి భూములను పరిశీలించారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు పరిశ్రమల ఏర్పాటుపై ఎటువంటి దృష్టి సారించకపోవడంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే పరిశ్రమల ఏర్పాటుకు చూపుతున్న చొరవతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నారు. మున్ముందు దొనకొండ దశ మారుతుందని అందరూ భావిస్తున్నారు.

షార్ట్ సర్క్యూటే కారణమా?

(5వ పేజీ తరువాయి)

ఉంచారు. అప్పుడప్పుడూ అక్కడక్కడా వస్తున్న మంటలను అదుపు చేశారు. డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షించారు. భారీ అగ్నిజ్వాలల ధాటికి ప్రమాదం జరిగిన రెండు గోదాంల పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్ని చోట్ల గోదాం గోడలు కుప్పకూలాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ బృందం, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రమాదానికి గల కారణాలను వెల్లడిస్తామన్నారు. ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరావు, బత్తుల మహేంద్ర ఉన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రమాదం చోటుచేసుకున్న బీకేటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని పరిశీలించారు.



కంపెనీని పరిశీలిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

కల్తీ మద్యంపై ఆకస్మిక తనిఖీలు

అవీఇవీ



తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ సుకన్య

చీమకుర్తి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి ఎక్సైజ్ పరిధిలో ఉన్న 18 మద్యం దుకాణాల్లో కల్తీ మద్యంపై శుక్రవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. అంతేగాక అనుమానితుల దుకాణాలల్లో కూడా తనిఖీలు చేశారు. ఎటువంటి కల్తీ మద్యం లభించలేదని సీఐ సుకన్య చెప్పారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టిసారించాలి



మేదరమెట్లలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో గంగాధరరావు

మేదరమెట్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని చీరాల డివిజన్ డిప్యూటీ ఈవో డి.గంగాధరరావు తెలిపారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మేదరమేట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర రావు మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఆ రోగ్య ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు తెలియజేయా లన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ వేణుగోపాలరావు విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలిశమ్మ, హెచ్‌ఎం అంజనీదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బల్లికురవ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు శుక్రవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై మరియు మాదక ద్రవ్యాల వలన కలుగు నష్టాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో రమేష్‌బాబు మాట్లాడుతు విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికాకుండా ప్రభుత్వం పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. విద్యార్థులు కూడా ఎంతో జాగ్రత్తగా చెడు స్నేహాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఎవరైన ఎక్కడైన ర్యాగింగ్ వంటి కార్యకలపాలకు గురి చేస్తే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబి, ఇన్‌చార్జి హెచ్‌ఎం డేవిడ్ పాల్, మహిళ పోలీసు హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రాజకుమారి, రాణి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే లోపాలను సరిదిద్దరే..?

రెవెన్యూ సిబ్బందిపై ధ్వజమెత్తిన సర్పంచులు



మాట్లాడుతున్న ఎంఈవో వస్త్రంనాయక్

మార్టూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రీసర్వే చేయడం ద్వారా నమోదైన లోపాలను ఇంతవరకు రెవెన్యూ అధికారులు సరిచేయలేకపోయారంటూ పలు గ్రామాల సర్పంచులు రెవెన్యూ అధికారులపై ధ్వజమెత్తారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో కోలలపూడి సర్పంచ్ ఎం సతీష్ కుమార్, బొల్లాపల్లి సర్పంచ్ నార్నె సింగారావు, చిమ్మిరిబండ సర్పంచ్ జంపని వీరయ్యలు రీసర్వేలో జరిగిన పొరబాట్లను సరిచేయలేదని, రైతులకు ఇంతవరకు పాస్‌బుక్‌లను ఇవ్వలేదని సమావేశానికి హాజరైన ఆర్ఐ అశోక్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన వారికి సమాధానం చెబుతూ ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకువెళతానన్నారు. అదేవిధంగా పలుగ్రామాలలో విద్యుత్ స్తంభాలు శిథిలదశలో ఉన్నాయని, కరెంటు తీగలు కిందకు వేలాడుతున్నాయని, వాటి గురించి విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 25 లోపు రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. అధికంగా యూరియాను వినియోగించకుండా రైతులకు అవగాహన కలిగించాలని ప్రజాప్రతినిధులను ఏవో లావణ్య కోరారు. తమ గ్రామంలో బోర్లు మరమ్మతులు చేయడంలేదని బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు సమావేశంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ప్రభుత్వం సహకారంతో ఇళ్లు నిర్మించుకునేందుకు మండలంలో 827 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మరో రెండు నెలల్లో కొత్తగా ఇళ్లు మంజూరయ్యే అవకాశం ఉందని హౌసింగ్ ఏఈ రాహుల్ తెలిపారు. అదేవిధంగా మండలంలో ద్రోణాదుల, వలపర్ల హైస్కూల్స్‌లో స్కూల్‌కు అనుసంధానంగా ఇంటర్ ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో విద్యార్థుల ప్రవేశాలు జరగలేదని ఎంఈవో వస్త్రాంనాయక్ తెలిపారు. గ్రామాలలో గాలి కుంటువ్యాధులకు పశువులకు టీకాలు వేస్తున్నట్లు మార్టూరు ఏడీఏ తెలిపారు. గ్రామాలలో రెండవ విడత ఎన్ఆర్ఈజీఎస్ కింద రెండవ విడత నిధులు మంజూరయ్యాయని, వాటితో సిమెంటురోడ్లు, సైడు కాల్వలు నిర్మాణం చేపడతామని పీఆర్ ఏఈ శాస్త్రి తెలిపారు. మండలంలో చెరువులన్నీ నిండాయని, నీటి కొరత లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య తెలిపారు. మహాపోషణ కార్యక్రమం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఉద్యానాధికారి హనుమంతనాయక్, ఏపీఎం లక్ష్మీనారాయణ, మార్టూరు ఈవో తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వక్తృత్వపు పోటీలో విద్యార్థిని ప్రతిభ

పంగులూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి వక్తృత్వపు పోటీలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని మణిదీపిక ప్రతిభచాటి తృతీయ స్థానం సాధించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాపట్లలో సేవ్‌దిగర్ల్ అండ్ చైల్డ్ అనే అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలో మణిదీపిక పాల్గొని ప్రతిభచాటారు. మణిదీపికను శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం గిరిజ అభినందించారు.

బాలికపై లైంగిక దాడి

● పోక్సో కేసు నమోదు

ఈపూరుపాలెం (చీరాల), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అభం శుభం తెలియని ఎనిమిదేళ్ల బాలికపై ఓ వ్యక్తి(45) లైంగిక దాడి చేసిన ఘటన ఈపూరుపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకొంది. ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యానికి బానిసైన సదరు వ్యక్తి జులాయిగా తిరుగుతుండే వాడు. ఆ వ్యక్తి ఇంటి సమీపంలోని బాలిక పాఠశాల నుంచి ఇంటికి రాగా, తినుబండరాలు కొనిపిస్తానని చెప్పి వెంట తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. పని నుంచి ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాలికను వైద్యపరీక్షల నిమిత్తం వైద్యశాలలో చేర్చారు. చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

మాతృమరణాలను నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాతృమరణాలు జరగకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో చాంబర్‌లో శుక్రవారం మాతృమరణాల సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను నమోదు చేసి వారికి అందించే సేవలను సకాలంలో అందించాలన్నారు. ఆ వివరాలను ఆర్సీహెచ్ యాప్, ఎంసీపీ కార్డులో నమోదు చేయాలని తెలిపారు. ప్రమాద సంకేతాలు ఉన్న గర్భిణులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారి బర్త్ ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులను ప్రతినెలా 10వ తేదీన జరిగే ప్రధానమంత్రి మాతృవందన యువజన కార్యక్రమానికి ఆహ్వానించి వారికి అక్కడ అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ సర్వజన ఆస్పత్రి రెఫర్ చేసే గర్భిణులకు ప్రాథమిక స్థాయిలో ఐరన్ లోపం లేకుండా తగిన పౌష్టికాహారం అందిస్తే మాతృమరణాలను నివారించేందుకు సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ మణిబాబు, డాక్టర్ కమల, డాక్టర్ కమలశ్రీ, డాక్టర్ కాశీ చైతన్య, సీడీపీవో వరమ్మ, మాస్‌మీడియా అధికారి దాసరి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నేడు పీవీఆర్ పాఠశాల
శతాబ్ది సన్నాహక ర్యాలీ

● పూర్వ విద్యార్థులు పాల్గొనాలని పిలుపు


విలేకర్ల సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ మునిసిపల్ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలు 2026 జనవరిలో నిర్వహించనుండగా అందుకు సన్నాహకంగా శనివారం ఉదయం నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం స్థానిక పీవీఆర్ మునిసిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ పీవీఆర్ మునిసిపల్ పాఠశాల ప్రారంభించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సారథ్యంలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందుకు అనుగుణంగా వివిధ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. కమిటీ కార్యదర్శి ఆరిగ వీరప్రతాప్ మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ నగరంలోని ప్రధాన రహదారులలో కొనసాగి పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ముగుస్తుందన్నారు. అనంతరం మాంటిస్సోరి పి.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ర్యాలీలో నగరంలో ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో తమ వాహనాలతో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బేతంశెట్టి హరిబాబు, గడియారం సుబ్బయ్యశర్మ, అక్కిరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారు, పాల ట్యాంకర్ ఢీకొని
ముగ్గురికి గాయాలు

● రోడ్డుకు అడ్డంగా పడిన ట్యాంకర్ ● నేలపాలైన 9500 లీటర్ల పాలు


రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న పాల ట్యాంకర్


గాయపడిన వంశీ, భాను

అద్దంకి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కారు, పాల ట్యాంకర్ ఎదురెదురుగా ఢీ కొనడంతో కారులో ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు శుక్రవారం రాత్రి రేణంగివరం వైపు నుంచి అద్దంకి వస్తున్న కారు కనిగిరి నుంచి వడ్లమూడి వెళ్తున్న పాల ట్యాంకర్ మండలంలోని జార్లపాలెం సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వంశీ, భాను, ఉ షాలకు తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని ప్రైవేట్ వాహనంలో అద్దంకి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. పాల ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ట్యాంకర్‌లో ఉన్న 9500 లీటర్ల పాలు నేల పాలు అయ్యాయి. సుమారు గంట పాటు అద్దంకి -రేణంగివరం రోడ్డులో ట్రాఫిక్ నిలిచిపోయింది. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను తొలగింపజేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఉద్యాన సాగు.. ఆదాయం బాగు

● సాగుకు చేయూతనిస్తున్న కూటమి ప్రభుత్వం
● సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా మేలు
● బాపట్ల జిల్లా వ్యాప్తంగా 524 ఎకరాల్లో సాగు


డ్రాగన్ ఫ్రూట్ తోట (ఇన్‌సెట్‌లో) డ్రాగన్ ఫ్రూట్

అంతర పంటల సాగుపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఎన్ఆర్ఈజీఈఎస్ (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) ద్వారా ఉద్యాన పంటలకు ఊతమిస్తోంది. ఖాళీగా ఉన్న భూముల్లో ఉచితంగా పండ్ల తోటల పెంపకం చేపట్టి ఏడాదంతా ఆదాయ మార్గాలు ఉండేలా ప్రోత్సాహకాలు కల్పిస్తోంది. వీటికి తోడు రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంతో పండ్ల తోటల పెంపకాలకు మొగ్గు చూపుతుండడంతో ఒకవైపు పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజలకు ఆరోగ్యకరమైన పండ్లు అందేలా మార్గాలు కనిపిస్తున్నాయి.

చీరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 624 ఎకరాల సాగు లక్ష్యంతో ఆదేశాలిచ్చారు. అయితే అధికారులు ప్రస్తుతం 540 ఎకరాల వరకు డ్రాగన్, మామిడి, జామ, గులాబీ, బత్తాయి, జీడి మామిడి సాగుకు ప్రోత్సాహం అందించారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా మిగిలిన లక్ష్యానికి అంతరాయం ఏర్పడింది. మరికొద్ది రోజుల్లో మిగిలిన లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాగు చేసేందుకు మార్గాలు సులభం

ఒక్కో రైతు వద్ద ఖాళీగా ఉన్న ఐదెకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డులు అందిస్తున్నారు. రైతు ఇష్టాయిష్టాలు బేరీజు వేసుకొని అవసరం మేరకు మొక్కలు ఉచితంగా అందిస్తున్నారు. మొక్కల పరిరక్షణ నిమిత్తం విడతల వారీగా మూడేళ్ల పాటు నిధులు అందజేస్తున్నారు. తద్వారా రైతుకు ప్రభుత్వం నుండి భరోసాతో పాటు ఆదాయ మార్గాలు సులభంగా ఉంటున్నాయి. ఈక్రమంలో వేటపాలెం మండల పరిధిలోని రామన్నపేటకు చెందిన షేక్ జిలానీ ఇప్పటికే డ్రాగన్ తోట సాగు చేస్తున్నారు. వృత్తిరీత్యా అతను బేల్దారీ అయినా కూడా సేంద్రియ వ్యవసాయంపై మక్కువతో ప్రస్తుతం డ్రాగన్ పండ్లతోటను సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏటా దాదాపుగా ఆరు మాసాలు ఆదాయం పొందుతున్నారు.

ఇటీవల చీరాల మండల పరిధిలో ఎమ్మెల్యే కొండయ్య చేతుల మీదుగా ఓ యజమానికి చెందిన ఖాళీ భూమిలో మామిడి మొక్కలు నాటారు. అందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మొక్కల సంరక్షణకు ఆర్థికంగా చేయూతను అందించింది. ఈక్రమంలో అధికారులు సైతం సచివాలయాల ద్వారా ఖాళీ భూములను నమోదు చేసుకుని పండ్ల తోటల పెంపకంతో ఏడాదిలో ఎక్కువ పనిదినాలు ఆదాయం ఉండేలా చూసుకోవాలని అధికారులు పిలుపునిస్తున్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి ● కలెక్టర్ రాజాబాబు ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. రెవెన్యూ సమస్యలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు సమస్యలపై వచ్చే అర్జీలను సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా రెవెన్యూ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆయా అంశాలపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యలపై వచ్చే అర్జీల్లో 70 నుంచి 80 శాతం వరకు అర్జీలు రెవెన్యూ సంబంధ అంశాలపైనే వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో రెవెన్యూ అధికారులు ఆయా అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులు తమ దృక్పథాన్ని మార్చుకొని సానుకూల దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కనిగిరిలో నిర్వహించిన మీ కోసంలో 814 అర్జీలు రాగా అందులో 587 అర్జీలు రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే వచ్చాయన్నారు. సమస్యల వారీగా బ్రేక్ ఆఫ్ చేసి వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఒంగోలు ఆర్డీవో కళావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జాన్సన్, సత్యనారాయణ, శివరామిరెడ్డి, సర్వేశాఖ ఏడీ గౌస్‌బాషా ఉన్నారు.

కలెక్టరేట్‌లో ఆకస్మిక తనిఖీలు


మీకోసం ఆడిట్ టీం సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజాబాబు కలెక్టరేట్‌లోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ముందుగా పీజీఆర్ఎస్(మీకోసం) ఆడిట్ బృందం సభ్యులతో మాట్లాడారు. అక్కడ అర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ- సూపర్‌సేవింగ్స్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్న సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆర్టీజీఎస్ మాదిరిగా కలెక్టరేట్‌లోనూ సమీకృత కమాండ్ కంట్రోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, వివిధ సెక్షన్ల సూపరిటెండెంట్లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

బురద బురదే..!

● తహసీల్దార్ కార్యాలయం తీరిదీ..





ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఒంగోలులోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణం బురదమయంగా మారింది. గురువారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి తహసీల్దార్ కార్యాలయం లోపలికి వెళ్ళే మార్గంలో నిలిచిపోవడంతో ఉద్యోగులతో పాటు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోనే ఒంగోలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం, మండల వ్యవసాయశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాలకు నిత్యం ప్రజలు వివిధ పనుల కోసం వచ్చిపోతుంటారు. అయితే శుక్రవారం ఆ కార్యాలయ ముందు భాగంలో లోతట్టు ఉండటంతో వర్షపు నీరు అక్కడ నిల్వ చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ ఆవరణలో వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నాయుడుపాలెంలో నిండిన కుంట
చిన్న పీఆర్‌పీ లాండాలో పొంగిప్రవహిస్తున్న చెక్‌డ్యాం

వర్షంతో జలకళ

ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో సాధారణ వర్షపాతాన్ని మించి కురిసిన వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో జలకళ సంతరించుకుంది. కుంటలు, చెక్‌డ్యాంలు నిండి కళకళలాడుతున్నాయి. గురువారం రాత్రి ఎర్రగొండపాలెంలో అత్యధికంగా 74.0 మి.మీ వర్షపాతం నమోదుకాగా పెద్దారవీడులో 36.8, పుల్లలచెరువు 14.6, త్రిపురాంతకం 7.2, దోర్నాల మండలంలో 8.6 మి.మీ వర్షం కురిసింది. దీంతో గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు కూడా పెరిగాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో వైద్య చికిత్సలు చేయించుకున్న 37మంది లబ్ధిదారులకు రూ.17.20లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు వాటిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందుల్లోనైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనకు అండగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌కే.నారాయణ్ జయంతి



నివాళులర్పిస్తున్న సిబ్బంది, అతిథులు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంగ్ల రచయిత ఆర్‌కే.నారాయణ్ 119వ జయంతిని శుక్రవారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ ఆధ్వర్యంలో ముందుగా నారాయణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంపూర్ణ మాట్లాడుతూ ఆర్‌కే.నారాయణ్ గొప్ప ఆంగ్ల రచయిత అని, ఆయన రచనలు ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పారు. వేదిక ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు షేక్ సిద్దాంబి మాట్లాడుతూ నారాయణ్ స్వాతంత్ర సమరంలో అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్.ఆదినారాయణ, పొత్తూరి బాలకృష్ణ, డాక్టర్ మధురశ్రీ, బంతికట్ల నాగేశ్వరరెడ్డి, జి.శాంసన్, టి.కృష్ణవేణి, మృదుల్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

సంతనూతలపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడులో ఈనెల 12వ తేదీన సేవాసంకల్ప్ చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఛైర్మన్ శనగల వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా రెండో ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో గల సేవాసంకల్ప్ చారిటబల్ ట్రస్ట్ కార్యాలయంలో వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ, డాక్టర్ చాపల వంశీక్రిష్ణ బృందంతో ఆర్థోపెడిక్, షుగర్, బీపీ, థైరాయిడ్ తదితర వ్యాధులకు చికిత్సలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ట్రస్ట్‌ఫౌండర్ పాతూరు సంపత్ తండ్రి గోవిందయ్య జ్ఞాపకార్థం ఈ శిబిరం ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మంచినీటి సరఫరా పరిశీలన



మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో, కార్పొరేషన్ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో సరఫరా చేస్తున్న మంచినీటి ట్యాంకులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. స్థానిక రామనగర్, సంతపేట, అన్నవరప్పాడు తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతున్న ఎస్ఎస్-2 ట్యాంకును ఎంఈ ఏసయ్యతో కలిసి సందర్శించారు. అక్కడి నుంచి సరఫరా చేస్తున్న నీటిని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న నీరు శుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. నగర కమిషనర్ సహాయంతో నగరంలో ఎక్కడైనా పైపులు లీకులు ఉంటే వాటిని రిపేరు చేసి ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏటా పంట మార్పిడి చేయాలి : ఆర్ఎం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం రామారావు

కొండపి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని బోర్డు ఒంగోలు ఆర్ఎం శీలం రామారావు సూచించారు. శుక్రవారం స్థానిక వేలం కేంద్రం ఆవరణలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు ఇచ్చారు. ఏటా పంట మార్పిడి చేయడం లాభదాయకమన్నారు. దర్శి కేవీకే శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులు పొగాకుకి బదులు మొక్కజొన్న, మిర్చి, శనగ, మినుము, పెసర సాగు చేసుకోవాలన్నారు. వాటిలోని వంగడాలు, విత్తన శుద్ధి, దిగుబడుల గురించి వివరించారు. ఏవో ఎం.మాల్యాద్రి మాట్లాడుతూ పంటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల గురించి వివరించారు. నల్లబర్లీ పొగాకుపై నిషేధం ఉన్నందున సాగు చేయవద్దని సూచించారు. సమావేశంలో వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు నరసింహారావు, శివాజీ

చీమకుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో శుక్రవారం ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు నరసింహారావు, శివాజీలు ఈ పోటీలను ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు. ఎంపిక చేసిన విద్యార్థులు డివిజన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారు. హెచ్ఎం కుమార్, సురేంద్ర, మండల కోఆర్డినేటర్ స్వరూపవాణి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రూ. 2కోట్లతో ఓవీరోడ్డు అభివృద్ధి

● మంత్రి స్వామి చొరవతో నిర్మాణం పూర్తి



నూతనంగా అభివృద్ధి చేసిన ఓవీరోడ్డు, గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు (పక్కన)

సింగరాయకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలో గుంతలు, గోతులతో అధ్వానంగా ఉన్న ఓవీరోడ్డుకి విముక్తి లభించింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో కొత్తరోడ్లను నిర్మించడం దేవుడెరుగు. కనీసం రోడ్ల మరమ్మత్తులకు నోచుకోలేదు. దీంతో గుంతలమయంగా ఉన్న ఓవీ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. ఈరోడ్డుపై వాహనదారులు ప్రయాణించాలంటే హడలిపోయేవారు. ఎన్నికల ముందు స్వయంగా అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అడుకో గుంత.. గజానికికో గొయ్యగా ఉన్న ఓవీ రోడ్డును పరిశీలించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత నూతన రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం రాగానే రోడ్డు నిర్మాణంపై దృష్టిసారించారు. సుమారు 1.85 కిమీ ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ.2కోట్ల ఎన్డీబీ నిధులు మంజూరు చేయించారు. దీంతో స్థానిక కందుకూరు రోడ్డు ఫ్లైవోవర్ నుంచి కటింగ్ వద్ద వరకు ఉన్న గుంతల రోడ్డుపై ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన తారురోడ్డును నిర్మాణం చేశారు. దీంతో వాహనదారులకు ఇక్కట్ల నుంచి విముక్తి లభించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఒకటిన్నర ఏడాదిలోపే చెప్పిన హామీమేరకు రోడ్డు నిర్మాణం పూర్తిచేయటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పలు పనులను త్వరలోనే పూర్తిచేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ మాధవరావు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత ప్రయోజనం

● ఎమ్మెల్యే దామచర్ల



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 తగ్గింపు ప్రజలందరికీ మరింత ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వస్తువుల అమ్మకాల ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వివిధ వస్తువులు కొనుగోళ్లపై జీఎస్టీ భారం నుంచి కేంద్రం విముక్తి కల్పించిందన్నారు. గత నెల 22వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి వారే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. వైద్యం, మందులు, కొన్ని రకాల నిత్యావసర సరుకులు, అలాగే ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, కార్లు, బైక్‌లపై జీఎస్టీ తగ్గడం సంతోషంగా ఉందని చెప్పారు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వ్యాపారులు కూడా జీఎస్టీ తగ్గింపుపై కొనుగోలుదారులకు అవగాహన కల్పించాలన్నారు కార్యక్రమంలో రాష్ట్ర జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, జిల్లా నోడల్ అధికారి ఎం.సత్యప్రకాష్, అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ పాల్గొని పోస్టర్‌లను ప్రదర్శించారు. కొండపిలోని దుకాణదారులను పిలిపించి వారితో విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

జరుగుమల్లిలో...

జరుగుమల్లిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో రమణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ఎవరూ హాజరుకాలేదు. ఎంపీడీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై స్థానిక సచివాలయంలో శుక్రవారం ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పన్ను తగ్గింపు వలన ఒనగూరే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏపీవో సుధాకర్, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్, నాయకుడు మండవ మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, శివరామ్‌ప్రసాద్, వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం మానవ హక్కు



మాట్లాడుతున్న న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్



నాగులుప్పలపాడులో విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

● న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ సమానమైన హక్కు అని, మానవీయ సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ ఇబ్రహీంషరీఫ్ కోరారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలులోని సిరి హాస్పటల్‌లో జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానసిక ఆరోగ్యం అందరికీ సమానమైన హక్కు అన్నారు. మానసిక వ్యాధిగ్రస్తులకు న్యాయసేవాధికార సంస్థ ప్రత్యేకంగా పథకాలు రూపొందించినట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో వృత్తిపరంగా ఒత్తిడిని ఎదుర్కొనే మార్గాలు అన్వేషించాలన్నారు. మానసిక సమస్యలు ఉన్న వారికి కుటుంబపరంగా, సామాజికంగా మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో సిరి హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్‌రెడ్డి, వైద్యురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం న్యాయాధికారి ఇబ్రహీంషరీఫ్ వైద్యశాలలోని ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించారు.

మనసు ప్రశాంతతో జీవితం ఆనందం

నాగులుప్పలపాడు: మనసు ప్రశాంతంగా ఉంటే జీవితం ఆనందంగా ఉంటుందని ఎంఈవో తిరుమలశెట్టి రవి పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాగులుప్పలపాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఎం మందా కుమారి, సమగ్రశిక్ష కౌన్సిలర్ పెదపూడి గ్రేస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవాలన్నారు. క్లిష్ట పరిస్థితులు ఎదురైనా సరే కుంగిపోకుండా ధైర్యంగా నిలబడడం అలవర్చుకోవాలని సూచించారు. మనసు ప్రశాంతంగా ఉంటేనే చదువులోనూ ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. ప్రతిరోజు యోగా, వ్యాయామం, క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మనసు ప్రశాంతంగా ఉంటేనే జీవితం సాఫీగా సాగిపోతుందని తెలిపారు. విద్యార్థులతో ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ముండ్లమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపాలెం, పూరిమెట్ల గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు కౌంటర్ సంతకం లేకుండా డ్రా చేయటంతో ఒంగోలు డీఎల్‌పీవో ఆర్.పద్మ శుక్రవారం విచారణ చేపట్టారు. సింగనపాలెంలో రూ.3.98 లక్షలు, పూరిమెట్లలో రూ.1.37 లక్షలు నిధులను సర్పంచ్‌లు ఫోర్జరీ సంతకాలు చేసి నిధులు డ్రా చేశారు. సింగనపాలెం సర్పంచ్ గీతాంజలి నేరుగా బ్యాంక్ సెల్ఫ్ చెక్కు ద్వారా నిధులు డ్రా చేశారు. పూరిమెట్ల సర్పంచ్ రామాంజనేయులు పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండా రెండు వేలిముద్రలు సర్పంచే వేసి నిధులు డ్రా చేశారు. సింగనపాలెం మాజీ సర్పంచ్ మానం నరసింహారావు, పూరిమెట్లకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి వేణు ఫిర్యాదు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో డీఎల్‌పీవోను నియమించి విచారణ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శుల బి.కృష్ణారావు, వేణు, చంద్రమౌళి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు-పొదిలి రోడ్డులో
ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● మండల సమావేశంలో ఎంపీపీ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

మర్రిపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతాంజలి పాఠశాల నుంచి రేగలగడ్డ బస్టాండ్ వరకు రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆయన చెప్పారు. మర్రిపూడి చెరువుకట్ట కింద కోనేరుల వద్ద రక్షణ గోడలు పడిపోవడంతో పెనుప్రమాదాలు చోటుచేసుకొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ ఏఈ దీప్తిని కోరారు. రీసర్వే కారణంగా పలు గ్రామాలలో ఈక్రాప్ నమోదుకు ఏర్పడుతున్న అవరోధాలను తొలగించాలని మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు యద్రమోతు శ్రీనివాసులు కోరారు. మర్రిపూడి పశువైద్యశాలలో సిబ్బంది కొరత కారణంగా వైద్యసేవలు అందడం లేదని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రైవేటు వ్యక్తుల హవా వైద్యశాలలో కొనసాగడంపై ఫొటోలతో సహా ఆధారాలను చూపించారు. పశువైద్యాధికారి సభకు హాజరు కాకపోవడంపై ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోలార్ విద్యుత్ యూనిట్‌ల ఏర్పాటులో మర్రిపూడి బ్యాంక్ మేనేజర్ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్.జగదీష్, డీటీ నాగరాజు, వైద్యాధికారి వీరబాబు, కాకర్ల వైద్యాధికారి పేరయ్య, ఏఈ ప్రసాదరావు, వైస్ ఎంపీపీ మాధవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అక్రమ క్వారీపై దాడి

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వైట్‌క్వార్ట్జ్‌ను వెలికితీస్తున్న అక్రమ క్వారీపై మైనింగ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. మురుగుమ్మి గ్రామ సమీపంలో అక్రమంగా వైట్‌క్వార్ట్జ్‌ను వెలికితీస్తున్నారని సమాచారం మేరకు మైనింగ్ అధికారి బాలరాజు దాడి చేసి వెలికితీసిన క్వార్ట్జ్‌ను, లారీని పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై వివరాలు తెలుసుకునేందుకు మైనింగ్ అధికారి ఫోన్‌లో స్పందించలేదు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంగోలు క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ పాండురంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని రాజపానగల్‌రోడ్ 11 కేవీ ఫీడర్, గొడుగుపాలెం 11కేవీ ఫీడర్‌ల కింది ఉన్న విద్యుత్ లైన్లకు అడ్డువచ్చిన చెట్లకొమ్మలు తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో కోర్టుసెంటర్, సెంట్రల్‌కేఫ్, శ్రీగిరికొండ, రాజపానగల్‌రోడ్, లేబర్ ఆఫీస్, జమ్మిచెట్టు బజారు, సాయిబాబా టెంపుల్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, గద్దలగుంట తదితర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని డీఈ కోరారు.

కొండపి మండలంలో..

కొండపి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండపి, పెట్లూరు, కె.ఉప్పలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పువ్వాడి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సబ్‌స్టేషన్‌ల పరిధిలో మెయింటెనెన్స్ పనులు చేస్తున్నామన్నారు. వినియోగదారులు అంతరాయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న వేలం కేంద్రం అధికారి తులసి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 అధికారి జె.తులసి కోరారు. స్థానిక వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బోర్డు అనుమతించిన మేరకే పొగాకు పంటను సాగు చేసుకోవాలని, రిజిస్టర్ అయిన వారి నుంచే పొగాకు కొనుగోలు ఉంటుందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రైతులు పొగాకు ఉత్పత్తిని నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వెంకటేశ్వరరావు, జీపీఐ మేనేజర్ కిషోర్, పీఎస్ఎస్ మేనేజర్ ఆదిత్య, రైతు నాయకులు, రైతులు, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

కల్తీ మద్యం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని నియంత్రించాలని వైసీపీ మహిళా నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని అంబేడ్కర్ భవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో మహిళా విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడిగా కల్తీ మద్యం తయారు చేస్తూ విక్రయిస్తున్నారని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్‌శాఖ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంగసాని లక్ష్మి, గాయం సావిత్రి, భూమిరెడ్డి రవణమ్మ, గోనెల మేరికుమారి, వాకా అరుణ, సయ్యద్‌అఫ్సర్, పులి శాంతి, వడ్లమూడి వాణి, కాకర్లమూడి రజిని, జమీలబేగం, నవరం రత్తమ్మ, మహేశ్వరి, కె.లక్ష్మి, పార్వతి, రాచూరి పుష్ప, రాచూరి సుస్మిత, బత్తుల కోటమ్మ, తన్నీరు రాగమ్మ పాల్గొన్నారు.

ఐద్వా మహాసభలను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న ఆదిలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి కోరారు. స్థానిక భగత్‌సింగ్‌కాలనీలో శుక్రవారం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.విజయలక్ష్మి, కె.రాజేశ్వరమ్మ, కె.గుర వమ్మ, కె.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌కు అనుమతి ఇవ్వొద్దు..!

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మారెళ్ల గ్రామ సమీపంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వద్దంటూ గ్రామస్థులు తీర్మానం చేశారు. సర్వే నెంబరు 195లో మైనింగ్ కోసం ఓ కంపెనీ దరఖాస్తు చేసుకుంది. దీంతో రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయం వద్ద నోటీసులను ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సదరు నెంబరులో గతంలో తమ పూర్వీకులకు డిపట్టాలు ఇచ్చి ఉన్నారని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యకు తెలిపారు. మైనింగ్‌కు అనుమతి ఇస్తే పంటలు దెబ్బతినడంతో పాటు గ్రామానికి పర్యావరణ ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. మైనింగ్‌కు అనుమతి ఇవ్వొద్దంటూ శుక్రవారం గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి చెప్పారు.

అవీ..ఇవీ

మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులివ్వండి

● అమరావతిలో సీఎంను కలిసి కోరిన ఏఎంసీ చైర్మన్



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఏఎంసీ చైర్మన్ సుబ్బారావు

ఎర్రగొండపాలెం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అమరావతి సీఎంవో ఆఫీసులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని శుక్రవారం కలసి ఎర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. వెనుక బడిన ఎర్రగొండపాలెం ప్రాంతంలో మార్కెట్టు యార్డు అభివృద్ధి చేయడం వలన రైతులకు ఉపయోగపడుతుందని సీఎంకు వివరించారు. అర్జీ పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకరిస్తానని చెప్పారని చైర్మన్ చేకూరి సుబ్బారావు తెలిపారు. నియోజకవర్గంలో రైతుల సమస్యలు సీఎంకు వివరించినట్లు తెలిపారు.



మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ కోమల్

సమస్యలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి

రాచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలని కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సీహెచ్ కోమల్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న బాలికలకు మానసిక ఆరోగ్యం, దాని ప్రాముఖ్యతపై ఆయన అవగాహన కల్పించారు. ఒత్తిడి, ఆందోళన వలన అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కోవాలంటే ప్రశాంతత, ఆత్మస్థైర్యం అవసరం అన్నారు. బాలికల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు సమగ్ర శిక్ష ఒంగోలు వారు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి డి. మాల కొండమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డాక్ సేవకులు

డాక్ సేవకుల నిరసన

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోస్ట్ ఎంప్లాయీస్ యూనియన్, గ్రామీణ డాక్ సేవక్ ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీసు ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ జనరల్ సెక్రటరీ మహాదేవను ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదని నోటీసు ఇచ్చారని అందుకు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా పోస్టల్ ఉద్యోగులందరూ సమైక్యంగా నిరసన గళం వినిపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, ప్రసాద్, రమణ, నారాయణరెడ్డి, యేసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసియున్న శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అంజనేయశర్మ, వరుణ్ తేజ శర్మలు జగదాంబ మాత మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన, అలంకరణ నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యక్రమాలను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో జగదాంబ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కార్యక్రమంలో సీఐ



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వేమన

పొదిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సైబర్‌నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, యువత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఐ వెంకటేశర్లు అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కాలేజి ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఏమాత్రం ఏమరపాటుగా వ్యవహరిస్తే సైబర్‌నేరగాళ్ల ఉచ్చులో పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఫోన్ వినియోగంలోజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో వస్తున్న అపరిచిత ఫోన్‌కాల్స్‌ను ప్రతిస్పందించవద్దని సూచించారు. ఫోన్ నుంచి వచ్చే ఏపీకే లింక్‌లను, కాల్స్‌లను ఓపెన్ చేయవద్దని గట్టిగా హెచ్చరించారు. తెలియక చేస్తే తమ ఖాతలనుంచి నగదు కొట్టేసే అవకాశం ఉంటుందన్నారు మాదకద్రవ్యాల మత్తులో పడి యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. ఏమాత్రం తప్పటడుగులు వేస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్ల నడవడికపై నిత్యం ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మహిళలకోసం ఏర్పాటు చేసిన ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ అప్లికేషన్ వినియోగం గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈయాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనుకోని పరిస్థితుల్లో సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వేమన, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి గుంతలు



ఏలూరు - సల్లూరు రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

పొదిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏలూరు గ్రామానికి వెళ్లాలంటే నరకం కనిపిస్తుందని ఏలూరు, సల్లూరు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏలూరు గ్రామ రహదారి నుంచి మరోమూడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి ఇదే. ఈప్రాంతంలో పదుల సంఖ్యలో గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఏలూరు, సల్లూరు, నల్లారెడ్డిపాలెం, చిలంకూరు గ్రామాలకు వెళ్లే రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో భారీవాహనాలు తిరుగుతుండటం వలన పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిత్యం ప్రమాదాలకు గురి కావలసి వస్తుందని ఆయాగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో గమనించని ద్విచక్రవాహనదారులు గుంతలోపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత అధికారులు ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయాగ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఎంఈవో శ్రీనివాసరెడ్డికి మెమోరాండం అందజేస్తున్న ఫ్యాప్టో డివిజన్ నాయకులు

ఉపాధ్యాయులు విధుల బహిష్కరణ

పొదిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులు బహిష్కరించినట్లు డివిజన్ చైర్మన్ బాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయులపై మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన సమయం హరించుకుపోతుందన్నారు. అందుకు నిరసనగా శుక్రవారం విధులు బహిష్కరించినట్లు తెలిపారు. అనంతరం ఎంఈవో శ్రీనివాసరెడ్డికి మెమోరాండం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు బుజ్జిబాబు, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, రామ్‌గోపాల్‌రెడ్డి, ఎం.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల గురుకుల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

● విద్యార్థినులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం తగదు
● ఎమ్మెల్యే ముత్తుముల



తనిఖీ అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

రాచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రాచర్ల గురుకుల బాలికల వసతి గృహాన్ని గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని తరగతి గదులను పరిశీలించి అక్కడి విద్యార్థినీలతో ఎమ్మెల్యే మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలోని గదులలో లైటింగ్, ఫ్యాన్‌లు సరిగ్గా పని చేయడం లేదని గమనించిన ఎమ్మెల్యే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అదే విధంగా విద్యార్థుల నివాస గదులను, మరుగుదొడ్లు, దోబీలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వచ్చిన సమయంలో తీసుకునే జాగ్రత్తలు, వైద్య పరీక్షలు వంటి అంశాలను, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం తగదని, విద్యార్థులు ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకుని రావచ్చునన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని, నాణ్యమైన విద్య, నాణ్యమైన ఆహారం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వసతిగృహంలో నెలకొన్న తాగునీటి సమస్య, పలు సమస్యల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే ఆయన వసతి గృహనికి రూ.5లక్షలతో ఆర్వో ప్లాంటును మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కటికె యోగానంద్, సొసైటీ బ్యాంకు చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ డి. మేరీ మంజుల, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌కు అనుమతి ఇవ్వొద్దు!

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామ సమీపంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వద్దంటూ గ్రామస్థులు తీర్మాణం చేశారు. గ్రామ సమీపంలోని సర్వేనెంబరు 195లో మైనింగ్ నిర్వహించేందుకు అనుమతులు కోరుతూ ఓకంపెనీ సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుంది.

దీంతో ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఆ ప్రాంతాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పంచాయతీ కార్యాలయం వద్ద నోటీసులను ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సదరు నెంబరులోని భూములు గతంలో తమ పూర్వీకుల పేరిట డిపట్టాలు ఇచ్చి ఉన్నారని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యకు తెలిపారు. మైనింగ్‌కు అనుమతి ఇస్తే పంటలు దెబ్బతినడంతో పాటు గ్రామానికి పర్యావరణ ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. మైనింగ్‌కు అనుమతి ఇవ్వొద్దంటూ శుక్రవారం గ్రామస్థులు తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యకు తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ముండ్లమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపాలెం, పూరిమెట్ల గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు కౌంటర్ సంతకం లేకుండా డ్రా చేయటంతో ఒంగోలు డీఎల్‌పీవో ఆర్.పద్మ శుక్రవారం విచారణ చేపట్టారు. సింగనపాలెంలో రూ.3.98 లక్షలు, పూరిమెట్లలో రూ.1.37 లక్షలు నిధులను సర్పంచ్‌లు సంతకాలు ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేశారు. సింగనపాలెం సర్పంచ్ కందిమళ్ళ గీతాంజలి నేరుగా బ్యాంక్ సెల్ఫ్ చెక్కు ద్వారా నిధులు డ్రా చేశారు. పూరిమెట్ల సర్పంచ్ ఒగులూరి రామాంజనేయులు పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండా రెండు వేలి ముద్రలు సర్పంచే వేసి నిధులు డ్రా చేశారు. సింగనపాలెంకు సంబంధించి మాజీ సర్పంచ్ మానం నరసింహారావు ఫిర్యాదు చేయగా, పూరిమెట్లకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి వేణు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదులు చేరాయి.

దీంతో ఆయన విచారణ అధికారిగా డీఎల్‌పీవోను నియమించి విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల బి. కృష్ణారావు, వేణు, పీడీసీసీ మాజీ డైరెక్టర్ చంద్రమౌళి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడెల మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

పెద్ద దోర్నాల,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సావిత్రి అధ్యక్షతన వ్యాస రచన, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

తాళ్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో శుక్రవారం వేకువజామున పిడుగుపడి కోటశ్రీనివాసరెడ్డి డాబా పిట్టగోడ పాక్షికంగా దెబ్బతింది. శబ్ధంతో నిద్రలో ఉన్న కుటుంబీకులు ఒక్కఉదుటన నిద్రలేచారు. ఇంటిలోని గృహోపకరణాలు, ఇన్వర్టర్, నివాసపు వైర్లు, టీవీ, తదితర పరికరాలు కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షలమేర నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

నేడు కంభంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

కంభం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి శనివారం ఉదయం 10గంటల నుంచి కంభం పట్టణంలో నూతన రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కంభం పట్టణంలోని రామాలయం వీధి, గచ్చుకాలువ, తిప్ప వీధుల్లో ఇంటింటికీ వెళ్లి రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తారని తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

గిద్దలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవిని అనాథ వృద్ధాశ్రమానికి రిక్రియేషన్ క్లబ్ ప్రతినిధులు 3వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గత 14 నెలలుగా ప్రతి నెలా 3వేల రూపాయల వంతున ఆశ్రమానికి విరాళం ఇస్తున్నట్లు రిక్రియేషన్ క్లబ్ కోశాధికారి పి.త్రిమూర్తిరెడ్డి తెలిపారు. అలాగే స్ఫూర్తి వికలాంగుల పాఠశాలకు 2వేల రూపాయల సహాయాన్ని అందించారు. ఈకార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, విక్టర్‌పాల్, ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్, వికలాంగుల పాఠశాల నిర్వాహకులు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరు అరెస్ట్

రాచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రాచర్ల ఎస్సై పి. కోటేశ్వరరావు తెలిపారు. అనుములవీడు గంగంపల్లి చౌరస్తా ఇటుకల బట్టీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, వారిద్దరిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

సచివాలయాల తనిఖీ

గిద్దలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ సచివాలయాలను ఎంపీడీవో సీతారామయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాలకు వచ్చే ప్రజలను గౌరవంగా పలుకరించాలని, వారి సమస్యలు ఏమిటో తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ చూపాలని సిబ్బందికి సూచించారు. గ్రీవెన్స్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. సచివాలయంలోని రికార్డులను, సిబ్బంది హాజరుపట్టీలను పరిశీలించారు.



గురిజేపల్లిలో మిరపతోటలో నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షంతో ఊరట

● వై.పాలెంలో 74 మీమీ వర్షపాతం

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో ఊరటచెందారు. మండలంలోని బోయలపల్లి, గురిజేపల్లి తదితర గ్రామాలలో వర్షం కురిసింది. వై పాలెంలో 74 మీల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ వర్షంతో ఉద్యాన పంటలకు మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. అయితే ఇటీవల సాగు చేసిన కొన్ని పంటల్లో నీరు నిల్వ ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బీఫార్మసీకి ఉజ్వల భవిష్యత్తు

మార్కాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఫార్మసీకి ఉజ్వల భవిష్యత్తు ఉందని జార్జి ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ప్రసన్నకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బైపీసీ స్ట్రీమ్ విద్యార్థులకు బీఫార్మసీలో ప్రవేశాలకు వెబ్ కౌన్సెలింగ్ తేదీలను అధికారికంగా విడుదల చేసిందన్నారు. అక్టోబరు 12న అభ్యర్థుల రిజిస్ట్రేషన్, 13, 14 తేదీల్లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ సెలక్షన్ అవకాశం, 18న సీటు కేటాయింపు ఫలితాల విడుదల, 21న కాలేజీలలో రిపోర్టింగ్, అడ్మిషన్ పూర్తి ఉంటాయన్నారు. బీఫార్మసీకి మంచి ఉపాధి అవకాశాలు ఉన్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



హరిబాబును సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కష్టపడితేనే అవార్డులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేస్తేనే అవార్డులు వస్తాయని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, సీపీఐ నాయకులు అందె నాసరయ్య అన్నారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో రాష్ట్ర బెస్ట్ మున్సిపల్ వర్కర్ అవార్డు గ్రహిత టి.హరిబాబును మార్కాపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కాశీం మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్‌గా తన విధులు నిర్వహిస్తూ తోటి వర్కర్ల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేసి అవార్డు దక్కించుకోవటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాశయ్య, రత్నం, కేశవ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

● ఆరోగ్య వైద్య నిపుణురాలు పద్మావతి

పెద్దదోర్నాల,అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):యోగాతో మానసిక ఆరోగ్యం చేకూరుతుందని ఆరోగ్య వైద్య నిపుణురాలు పద్మావతి అన్నారు.స్థానిక ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు.ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో పద్మావతి మాట్లాడుతూ ధ్యానం, యోగా, సానుకూల ఆలోచనలతో క్రమశిక్షణగా ఉండేవారికి మానసిక ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, తద్వారా చదువు కూడా బాగా వస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, ప్రశాంతతోనే కష్టమైన సమస్యలు కూడా అధిగమించవచ్చన్నారు.పరీక్షల్లో నూటికి నూరు శాతం మార్కులు పొందేందుకు చక్కటి మార్గమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మార్కాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోరారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మీర్జా షంసీర్ అలీ బేగ్, రమణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, శ్రీశైలం ట్రస్ట్ బోర్డు మాజీ ధర్మకర్త డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ సలీం, నల్లబోతుల కొండయ్య, నారు బాపనరెడ్డి పాల్గొన్నారు.

13 నుంచి శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్

గిద్దలూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతుసేవా కేంద్రాలలో సబ్సిడీ శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఈనెల 13 నుంచి నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 25శాతం సబ్సిడీపై శనగ విత్తనాలను ఇస్తామని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ నెంబరు తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఎకరాకు 40 కిలోల చొప్పున 5 ఎకరాల వరకు విత్తనాలు అందిస్తామన్నారు. ప్రస్తుతం జేజీ11 రకం, కాక్-2 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి పూర్తి ఖరీదు క్వింటాకు రూ.7,800 కాగా 1,950 రూపాయల సబ్సిడీ పోను 5,850 రూపాయలు క్వింటాకు రైతు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనుములవీడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని గిద్దలూరు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవై శేషగిరి రావు తెలిపారు.

నూతన చర్చి ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాధాకృష్ణ థియేటర్ వద్ద తెలుగు బాప్టిస్టు పాలెం చర్చిని చర్చి అధ్యక్షుడు బూదల కృష్ణవర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యదర్శి విల్సన్, కోశాధికారి శామ్యూల్ జాన్, పాస్టర్ జార్జ్ బాబు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుపల్లి చెత్తసంపద కేంద్రాన్ని ఎంపీడీవో జీవీ కృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. సర్పంచ్ పల్లా మల్లికార్జున్‌తో కలిసి పారిశుధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

పామూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులు మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలని పామూరు, సీఎస్‌పురం కేజీబీవీ ప్రిన్సిపాల్‌లు కటకం సజన, షేక్ రేష్మా పేర్కొన్నారు. ఆయా విద్యాలయాల్లో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్షల పట్ల భయం లేకుండా సన్నద్ధం కావాలని సూచించారు.

బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయు లకు మినహాయింపు ఇవ్వాలని ఆయాసంఘాల నాయకులు వి.సాంబశివరావు, షేక్ నాయబ్‌రసూల్ డిమాండ్ చేవారు. ఈమేరకు స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ దీప్తికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్, ఎన్.వెంకటరామయ్య, డి.సుబ్బరాయుడు, ఇర్ల కొండయ్య, కె.చెన్నయ్య, జి.లక్ష్మీనారాయణ, ఎన్.గాంధి, కె.వెంకటేశ్వర్లు, అహమ్మద్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

పామూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు రోడ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రూ.2 కోట్ల 80 లక్షల నిధులు మంజూరు చేయించడం పట్ల ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బైరెడ్డి జయరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలి

పామూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎన్. వెంకట్రామయ్య, షేక్ పాదుషా డిమాండ్ చేశారు. మండలంలో 36 సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం మూడు పోస్టులు మాత్రమే చూపించారన్నారు. అలాగే, ఖాళీగా ఉన్న హిందీ పోస్టులను చూయించలేదన్నారు. ఏడు పీఈటీ పోస్టులకుగాను డీఎస్సీలో రెండు మాత్రమే చూపించారన్నారు.

ఈపంట నమోదు తనిఖీ

దొనకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమరవెంకటాపురం, ఆరవల్లిపాడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల పరిధిలో ఖరీఫ్ పంట సాగుకు సంబంధించిన ఈపంట నమోదును మండల వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి వెంకటరావు, వ్యవసాయ సహాయకులు నవీన్, లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి ఉరుములతో భారీ వర్షం కురిసింది. గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పసుపుగల్లు, పెదఉల్లగల్లు, రెడ్డినగర్, పులిపాడు, కెల్లంపల్లి, చింతలపూడి గ్రామాల్లో భారీ వర్షం పడింది. పంట పొలాల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మారనున్న కనిగిరి పట్టణ ముఖచిత్రం

- 20 నుంచి 28వార్డులకు పెంపు
- పునర్వ్యవస్థీకరణలో మారిన ప్రాంతాలు



ఇటీవల జరిగిన మున్సిపల్ సమావేశంలో వార్డుల పునర్వ్యవస్థీకరణపై వివరిస్తున్న టీపీవో సువర్ణకుమార్(ఫైల్)

కనిగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కనిగిరి మున్సిపాల్టీ ముఖచిత్రం మారనుంది. ఇప్పటివరకు ఉన్న 20 వార్డులు పునర్వ్యవస్థీకరణలో భాగంగా 28 వార్డులకు పెంచారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లనే ప్రాంతాలవారీగా మున్సిపల్ అధికారులు విభజించి వార్డులను పెంచారు. దీంతో పాలనా సౌలభ్యంతో పాటు ప్రాంతాలు మారాయి. ఇప్పటివరకు కనిగిరి మున్సిపాల్టీలో 20 మంది ఉన్న కౌన్సిల్ సభ్యులు రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 28 మంది బరిలో పోటీ చేయనున్నారు. ప్రస్తుతం పట్టణంలో 34,319 ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు నిర్వహించిన వార్డుల పునర్వ్యవస్థీకరణ 28 వార్డులకు సంబంధించి ప్రదేశాలు, ప్రాంతాలు ఇలా ఉన్నాయి.

1వ వార్డు: బొగ్గులగొంది కాలనీ, బీసీ కాలనీ, రాజీవ్ కాలనీ, మోడల్‌స్కూల్ ప్రాంతం

2వ వార్డు: శంఖవరం, చింతలపాలెం

3వ వార్డు: చింతలపాలెంలోని మరో రెండు ప్రాంతాలు

4వ వార్డు: చింతలపాలెంలోని ఎస్సీ కాలనీ, గడ్డమీదపల్లి

5వ వార్డు: కేసీరెడ్డి నగర్, పవిత్ర కల్యాణ మండపం వీధి, కపిలా లాడ్జి వెనుక బజార్, కనకపట్నం, పాత శంఖవరం, పాలకేంద్రం, ఫైర్ స్టేషన్ ఎదురు లైను

6వ వార్డు: మాచవరం

7వ వార్డు: కొత్తూరు

8వ వార్డు: పాతకూచిపూడిపల్లి, తాళ్లూరి కల్యాణ మండపం వీధి

9వ వార్డు: బాదుల్లావారి వీధి, తూర్పు ప్రక్క మిల్లు లైన్

10వ వార్డు: పడమర ప్రక్క మిల్లు లైను, దర్గాలైను, బోయపాలెం, ముగ్గుబావివీధి

11వ వార్డు: రామసుబ్బారెడ్డివీధి, మంగళిబజార్, పఠాన్‌బజార్, మదరసాబజార్, పెట్రోల్‌బంకు వెనుక వీధి, సూర్యబలిజ బజార్, బొడ్డురాయి వీధి, చాకలిబజార్, బోయపాలెంలో కొంత ప్రాంతం

12వ వార్డు: మదీనా, మంగలిమాన్యం బజార్ వెనుక వీధి, కందిపప్పు మిల్లు లైను, ఇంకొల్లువారి వీధి, చెరువకట్ట, పాతూరు మెయిన్‌రోడ్డు, కొల్లువారిస్ట్రీట్, పీర్లచావిడి, బొడ్డురాయి వీధి, రామసుబ్బారెడ్డివీధి, అర్బన్ కాలనీ, చింతంవారి స్ట్రీట్, చర్చిలైను, ఎస్సీ కాలనీ

13వ వార్డు: కాశీపురం, కాశిరెడ్డికాలనీ, సూరా పాపిరెడ్డి కాలనీ

14వవార్డు: దేవాంగనగర్, టకారిపాలెం

15వ వార్డు: పడమర మంగలిమాన్యంవీధి, స్కూల్ లైను, అంగన్‌వాడీ స్కూల్ లైను, ఎంపీపీ స్కూల్‌లైను, సాల్మన్‌లైను, ఎస్సీ పాలెం, తూర్పు ప్రక్క మంగలిమాన్యం వీధి, ఎస్సీపాలెం చర్చిలైను, ఎస్సీపాలెం హాస్పిటల్ ఎదురు లైను

16వ వార్డు: మున్సిపల్ ఆఫీస్ వెనుకవీధి, కొండపైన, పాతకమూరివారి వీధి, మహమ్మద్ వీధి, మదీనా మసీద్‌రోడ్డు, దొరువుబజార్

17వ వార్డు: దొరువుబజార్‌లోని మరోవీధి, బొడ్డుచావిడి, కొట్లబజార్, అద్దంకి బజార్

18వ వార్డు: రజకబజార్, ఓపీ రోడ్డు, ఆంజనేయస్వామి దేవాలయంవీధి, కృష్ణుడి దేవాలయం ప్రక్క వీధి, రామాలయం వీధి, మహాలక్ష్మమ్మ చెట్టువీధి, లాడేసాహెబ్ వీధి, చెప్పులబజార్, కొలిమి బజార్, కొట్లబజార్‌లోని మరో వీధి

19వ వార్డు: పోలిరెడ్డి బజార్, ఏబీఎం కాంపౌండ్, కృపానందం వీధి, నక్కలతిప్ప, జూనియర్ కాలేజి ఎదురు, జీపుస్టాండు, కత్తిజాన్‌వీధి, కపిలలాడ్జి ఎదురు వీధి, మందిరంబజార్, వంకాయలపాటివారి వీధి,

20వ వార్డు: నక్కలతిప్ప, మందిరంబజార్, కాసిరెడ్డి బజార్, ఎమ్మెస్సార్‌రోడ్డు, వడ్డెపాలెం

21వ వార్డు: అప్పయ్యవారి వీధి, కేసీ కాలేజి లైను, బీసీ హాస్టల్ లైను, గోమతి స్కూల్ లైను, రెడ్డినగర్, పాతకాశిరెడ్డి బజార్, బిజిలీ పాచ్చు వీధి, కరణం బజార్, జవహర్‌లాల్ స్ట్రీట్, కాశినాయన గుడి ఏరియా

22వ వార్డు: శివనగర్‌కాలనీ

23వ వార్డు: సాయినగర్, నాయబ్‌బజార్, ఎన్జీఓ కాల నీ, బేకరీ బజార్

24వ వార్డు: పరాశరభారతి స్ట్రీట్, జవహర్‌లాల్‌వీధి, దుత్తలూరివారి వీధి, సుభాష్ రోడ్డు, జవహర్‌లాల్ స్ట్రీట్, బోధిధర్మ స్కూల్‌లైను

25వ వార్డు: ఎమ్మెస్సార్ రోడ్డు, ఆంధ్రాబ్యాంకు స్ట్రీట్, గునుపూడివారి వీధి, అరవోళ్ళ బజార్‌తో పాటు (దొరువుబజార్,బొడ్డుచావిడి వీధి, ఎమ్మెస్సార్‌కాలేజి రోడ్డులోని కొన్ని ఓటర్లు)

26వ వార్డు: నీలకంఠంవారి వీధి, సాయి బాబాగుడి వీధి, పెరుమాళ్ళవారి వీధి, సుభాష్‌రోడ్డు, పాత పోస్టాఫీసు రోడ్డు

27వ వార్డు: ఇందిరాకాలనీ స్థూపం లైను, ఇందిరాకాలనీ, ఇందిరాకాలనీ 1, 2వ లైన్లు

28వ వార్డు: ఎంఎస్‌ఎం కాలేజి రోడ్డు, దొరువుబజార్, గార్లపేటరోడ్డు, ఆల్ఫాస్కూల్ లైను, బొడ్డుచావిడి వీధి, ఇందిరాకాలనీ 1వ లైనులో కొంతభాగం, అంకాలమ్మ దేవాలయం స్ట్రీట్, దొరువుబజార్‌లోని కొంతభాగం, గార్లపేట రోడ్డులోని కొంతభాగం

కాగా 28 వార్డుల్లో అత్యధికంగా 6వ వార్డులో 1455 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా 11వ వార్డులో 1110 ఓటర్లు ఉన్నారు. అయితే వార్డుల విభజనలో ప్రజల్లో గందరగోళ పరిస్థితి నెలకొందని ప్రచారం జరుగుతుంది.

దీనిపై మున్సిపాల్టీ టౌన్ ప్లానింగ్ అధికారి సువర్ణ కుమార్ వివరణ కోరగా.. ఒక్కో వార్డులో సరాసరిన 1100 మంది ఓటర్లు నుంచి 1350 మంది ఓటర్లు మధ్యన పది శాతం తక్కువగా, ఎక్కువగా ఉన్న ప్రకారంగా వార్డు విభజన చేపట్టినట్లు తెలిపారు. ప్రతి వార్డుకు ప్రాంతాలు, ప్రదేశాల వారీగా హద్దులు నిర్ణయించినట్టు చెప్పారు. ఇప్పటికే మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్ల అభిప్రాయాన్ని సేకరించగా వారు సంపూర్ణ అంగీకారం, ఆమోదం తెలిపారన్నారు. ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో 28వార్డుల జాబితా సిద్ధం చేశామని తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 98 మంది లబ్ధిదారులకు రూ.54.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అడిగిందే తడువుగా పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు దయార్ధ హృదయంతో సీఎం సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్ సాగర్, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, దర్శి, ముండ్లమూరు తాళ్లూరు, దొనకొండ మండలాల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, మోడి ఆంజనేయులు, దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీలో సంస్కరణలు పేదలకు ఎంతోమేలు

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన సంస్కరణలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శిలో శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రయోజనాలను వివరించే కరపత్రాలను ఆమె విడుదల చేశారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన సంస్కరణలతో 300 రకాల వస్తువులపై సుంకం తగ్గించటం జరిగిందన్నారు. పేద ప్రజలకు అవసరమైన నిత్యావసర వస్తువులు, మందులు, దుస్తులు తదితర వస్తువులపై భారీగా సుంకాలు తగ్గించటంతో అన్నివర్గాల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ప్రజలు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన పెంపొందించుకొని తగ్గిన వస్తువులను కొనుగోలు చేసుకొని లబ్ధిపొందాలన్నారు.

కార్యక్రమంలో నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె.సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో పి.కల్పన, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, ఆడిటర్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం

- సీఐ ఖాజావలి



ఆర్టీసీ డిపోలో తనిఖీలు చేస్తున్న డాగ్‌స్క్వాడ్ తో సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం

కనిగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపినట్లు సీఐ ఖాజావలి అన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో డీఎస్పీ ఆధ్వర్యంలో కనిగిరి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కొండప్రాంతంలోని వివిధ ప్రదేశాల్లో డాగ్ స్క్వాడ్ పరిశీలించింది. దొరువుకట్టపై ఉన్న నివాసాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ డిపో, పార్శిల్ స్థావరాలు వద్ద, శివారు కాలనీల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.

ఈసందర్భంగా సీఐ ఖాజావలి మాట్లాడుతూ గంజాయి అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి సేవించే వారిపై కూడా నిఘా ఉంచినట్లు చెప్పారు. యువత గంజాయి సేవించి పెడద్రోవ పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల రోజువారీ దినచర్యలపై గమనిస్తుండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. మైనర్లు వాహనం నడిపితే వారితోపాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి స్థావరాలు, అమ్మకాలపై సమాచారం అందించినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. తనిఖీల్లో ఎస్ఐ టి.శ్రీరాం, డాగ్‌స్క్వాడ్ బృందం పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఎంతోమేలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, కమర్షియల్ టాక్స్ అధికారులు

తాళ్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పేద, మధ్యతరగతి వర్గా ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందని కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తాళ్లూరు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా ఎన్డీఏ ప్రభుత్వం పన్నుల వ్యవస్థను సులభతరంగా, పారదర్శకంగా చెల్లించే చర్యలు చేపట్టిందన్నారు. ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ వ్యాపారస్తులు తగ్గిన జీఎస్టీ ప్రకారం కాకుండా అధికంగా వసూళ్లు చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం, ఐ.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీపై మైనింగ్ అధికారుల దాడులు

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా వైట్‌క్వార్ట్జ్‌ను వెలికితీస్తున్న అక్రమ క్వారీపై మార్కాపురం మైనింగ్ అధికారులు శుక్రవారం దాడిచేశారు. అందిన వివరాల మేరకు మండలంలోని మురుగుమ్మి గ్రామ సమీపంలో అక్రమంగా వైట్‌క్వార్ట్జ్‌ను వెలికితీస్తున్నారని అందిన సమాచారం మేరకు మైనింగ్ అధికారి బాలరాజు అధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం క్వారీపై దాడిచేశారు.

అక్రమంగా వెలికితీసిన క్వార్ట్జ్‌ను సీజ్ చేశారు. క్వార్ట్జ్‌ను తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీని స్వాధీనం చేసుకుని పీసీపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈవిషయమై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు మైనింగ్ అధికారి బాలరాజుకు ఫోన్‌చేయగా ఆయన స్పందించలేదు.

దొనకొండలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టండి



చంద్రబాబును కలిసిన బత్తుల బ్రహ్మయ్య

దొనకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దొనకొండ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టి ఈప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బత్తుల బ్రహ్మయ్య ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సీఎంను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం దొనకొండలో పరిశ్రమల ఏర్పాటులో తీవ్ర నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వం పాలన లోనే పరిశ్రమల ఏర్పాటుజరిగి పేదలకు ఉపాధి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయనే నమ్మకంతో ఈప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారని సీఎంకు విన్నవించారు. అందుకు సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు దొనకొండ ప్రాంతంలో రక్షణ శాఖ ఆధ్వర్యంలో భారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలతో ముందుకు సాగుతుందని తెలిపారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

కురిచేడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో పడమరవీరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫణి సత్యనారాయణ అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథులుగా మండల విద్యాశాఖాధికారులు వస్రాం నాయక్, సుబ్బారావు హాజరయ్యారు. బదిలీ అయిన రామచంద్రరావు, విజయమేరీ, కె.ఆదినారాయణ, షేక్ ఖాదర్‌వలిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హిమజా కుమారి, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ నాయకులు ఖాజారహంతుల్లా, శివరామకృష్ణ, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌కు అనుమతి ఇవ్వొద్దు!

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామ సమీపంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వద్దంటూ గ్రామస్తులు తీర్మాణం చేశారు. గ్రామ సమీపంలోని సర్వేనెంబరు 195లో మైనింగ్ నిర్వహించేందుకు అనుమతులు కోరుతూ ఓకంపెనీ సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుంది. దీంతో ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఆ ప్రాంతాన్ని పరిశీలించిన రెవెన్యూ అధికారులు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పంచాయతీ కార్యాలయం వద్ద నోటీసులను ప్రదర్శించారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సదరు నెంబరులోని భూములు గతంలో తమ పూర్వీకుల పేరిట డిపట్టాలు ఇచ్చి ఉన్నారని పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యకు తెలిపారు. మైనింగ్‌కు అనుమతి ఇస్తే పంటలు దెబ్బతినడంతో పాటు గ్రామానికి పర్యావరణ ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. మైనింగ్‌కు అనుమతి ఇవ్వొద్దంటూ శుక్రవారం గ్రామస్థులు తీర్మానం చేసి పంచాయతీ కార్యదర్శి బ్రహ్మయ్యకు తెలిపారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ముండ్లమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపాలెం, పూరిమెట్ల గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు కౌంటర్ సంతకం లేకుండా డ్రా చేయటంతో ఒంగోలు డీఎల్‌పీవో ఆర్.పద్మ శుక్రవారం విచారణ చేపట్టారు. సింగనపాలెంలో రూ.3.98 లక్షలు, పూరిమెట్లలో రూ.1.37 లక్షలు నిధులను సర్పంచ్‌లు సంతకాలు ఫోర్జరీ చేసి నిధులు డ్రా చేశారు. సింగనపాలెం సర్పంచ్ కందిమళ్ల గీతాంజలి నేరుగా బ్యాంక్ సెల్ఫ్ చెక్కు ద్వారా నిధులు డ్రా చేశారు. పూరిమెట్ల సర్పంచ్ ఒగులూరి రామాంజనేయులు పంచాయతీ కార్యదర్శి ప్రమేయం లేకుండా రెండు వేలి ముద్రలు సర్పంచే వేసి నిధులు డ్రా చేశారు. సింగనపాలెంకు సంబంధించి మాజీ సర్పంచ్ మానం నరసింహారావు ఫిర్యాదు చేయగా, పూరిమెట్లకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి వేణు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ ఎంపీడీవో జనార్దన్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదులు చేరాయి. దీంతో ఆయన విచారణ అధికారిగా డీఎల్‌పీవోను నియమించి విచారణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల బి. కృష్ణారావు, వేణు, పీడీసీసీ మాజీ డైరెక్టర్ చంద్రమౌళి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కోడెల మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ద్వారా పంటలు సాగుచేయాలి

ముండ్లమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకొని తదనుగుణంగా పంటలు సాగు చేసినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఒంగోలు వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి వి.శేషమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని వేములలో భూసార పరీక్షా ఫలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పంటల్లో ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువులు వాడకం గురించి వివరించారు. ముండ్లమూరులోని ఏపీ మోడల్ స్కూల్‌లో 8, 9 తరగతి విద్యార్థులకు స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, వీఏఏ తిప్పస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగిఉండాలి

ముండ్లమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ కమిషనర్ కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ముండ్లమూరులో మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ మార్కెట్‌లో వస్తువులుకొనే ప్రతిఒక్కరూ గతంలో కంటే వస్తువులు తగ్గిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. షాపుల వద్దకు వెళ్ళి తగ్గింపు విషయం తెలుసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కె.సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో ఎం.శ్రీదేవి, ఏవో అబ్దుల్ కరీం, పంచాయతీ కార్యదర్శి పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

తాళ్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామంలో శుక్రవారం వేకువజామున పిడుగుపడి కోటశ్రీనివాసరెడ్డి డాబా పిట్టగోడ పాక్షికంగా దెబ్బతింది. శబ్ధంతో నిద్రలో ఉన్న కుటుంబీకులు ఒక్కఉదుటున నిద్రలేచారు. ఇంటిలోని గృహోపకరణాలు, ఇన్వర్టర్, నివాసపు వైర్లు, టీవీ, తదితర పరికరాలు కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

సైబర్ నేరగాళ్ళ ఉచ్చులోపడి మోసపోవద్దు

ముండ్లమూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల పలుగ్రామాల్లో సైబర్ నేరగాళ్ళ చేతిలో పలువురు మోస పోతున్నారని, అలాంటి వారి మాయలో పడి మోసపోవద్దని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మారెళ్ళ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటీపీలు చెప్పాలని, ఆధార్ కార్డు నెంబరు చెప్పాలని ఇతరులు ఫోన్ చేసినప్పుడు ఎవ్వరూ చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

పీసీపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య అన్నారు. శుక్రవారం పీసీపల్లిలో పార్టీ కేఎస్‌ఎస్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు, మద్దతుదారుల విజయం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి పటిష్ఠతకు కృషిచేయాలన్నారు. సమావేశంలో కోమటిగుంట్ల వీరయ్య, పరిమి ఈశ్వరయ్య, వడ్డెంపూడి వెంకట్, చెన్నుపాటి అంజయ్య, ఉప్పుగుండ్ల శివరామయ్య, ములకా నాగేశ్వరరావు, చెన్నుపాటి అంజయ్య, గుర్రం మాల్యాద్రి, పువ్వాడి నాగరాజు, పెద్దిరెడ్డి క్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె-గంగడిపాలెం డబుల్ రోడ్డుకి రూ.49 కోట్లు

● తీరంలో రహదారుల అభివృద్ధికి నిధులు: మంత్రి అనగాని



రేపల్లె, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో పట్టించుకోకుండా పాడుపెట్టిన రోడ్ల అభివృద్ధికి తాము నిధులు మంజూరు చేస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రేపల్లె వయా తుమ్మల, గంగడిపాలెం వరకు రోడ్డును డబుల్‌లైన్‌గా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సీఆర్ఐఎఫ్ కింద రూ.49 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా డబుల్ లైన్ రహదారిగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వందేళ్లకుపైగా రోడ్డు సౌకర్యం లేని బండికాయలమోతు గ్రామ ప్రజల ఇబ్బందులను గమనించి రోడ్డు నిర్మాణానికి ఏఐఐబీ గ్రాంటు నుంచి రూ.3.50 లక్షలు మంజూరు చేయించినట్లు మంత్రి తెలిపారు. పోటుమెరకగౌడపాలేనికి డీఎంఎఫ్ ద్వారా రూ.కోటి మంజూరు చేయించామన్నారు. గుంతల రోడ్లతో నియోజకవర్గ ప్రజల ఇబ్బందుల గురించి వివరించగానే నిధులు మంజూరు చేసినందుకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రి అనగాని కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

- అవినీతికి చెక్ పెట్టేలా ఈ-కేవైసీ
- బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట
- శ్రామికులకు రెండు సార్లు ముఖ హాజరు
- నవంబరు నుంచి నూతన విధానం అమలు

ఉపాధి హామీ పనుల్లో మస్టర్ల మాయాజాలం సర్వసాధారణమైపోయింది. హాజరు విధానంలో ఉన్న లొసుగులకు తోడు కొంతమంది ఉద్యోగుల అండదండలతో నిధులను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు. సోషల్ ఆడిట్ నివేదికల్లో పలుమార్లు అవినీతి బాగోతాలు బట్టబయలైనప్పటికీ మస్టర్ల కనికట్టు మాత్రం ఆగడం లేదు. ఉపాధి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకట్ట పడాలనే కృతనిశ్చయానికి కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు వచ్చాయి. దానిలో భాగంగానే పనులకు హాజరయ్యే ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ చేపట్టి ముఖ హాజరును తప్పనిసరి చేయనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను గడచిన నెలలోనే ప్రభుత్వం విడుదల చేసింది. శ్రామికుల జాబ్ కార్డును ఆధార్‌కు అనుసంధానం చేయడంతో పాటు, ఈ-కేవైసీ ప్రక్రియను కూడా ముమ్మరం చేసింది.



కర్లపాలెం మండలంలో జరుగుతున్న ఈ-కేవైసీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి(ఫైల్ ఫొటో)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్న శ్రామికులందరినీ ఈ కేవైసీ గొడుగు కిందకు తేవడం కోసం ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించింది. నవంబరు మొదటి వారం నుంచి శ్రామికుల ముఖ హాజరు విధానాన్ని పక్కాగా అమలు చేసి ఉపాధి అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బాపట్ల జిల్లాలో మొత్తం 4,85,408 శ్రామికులు నమోదై ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేవైసీని 1,61,399 మంది శ్రామికులు పూర్తి చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 2,14,450 మంది ఉపాధి హామీ శ్రామికులు ఉండగా 66,561 మంది ఈ కేవైసీ గొడుగు కిందకు చేరారు. అదే విధంగా పల్నాడు జిల్లాలో అత్యధికంగా 6,04,740 మంది శ్రామికులు ఉండగా, ఇందులో 1,66,763 మంది ఈ కేవైసీ పూర్తయింది. శాతాల వారీగా పరిశీలిస్తే బాపట్ల జిల్లాలో 33.53, గుంటూరు జిల్లాలో 31.72, పల్నాడు జిల్లాలో 28.12 శాతం ఈ కేవైసీ మాత్రమే ఇప్పటి వరకు పూర్తయింది. ప్రభుత్వం ఇచ్చిన గడువుకు ఇంకా మూడు వారాలే మిగిలి ఉండడంతో (మిగతా 6లో)

బాధ్యతల నుంచి తప్పించుకోలేరు

ఇకపై దొంగ మస్టర్ల విషయంలో సంబంధిత సిబ్బంది తమ బాధ్యతల నుంచి తప్పించుకోలేని విధంగా యాప్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజైన్ చేశాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశాల్లో తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు క్రమం తప్పకుండా పరిశీలించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలకు వెనకాడవద్దనే ఆదేశాలను కూడా కేంద్రం స్పష్టంగా ఇచ్చింది. సోషల్ ఆడిట్‌లో భాగంగా గతంలో ఏవైనా అక్రమాలు వెలుగుచూస్తే సంబంధిత విభాగాలన్నీ కూడా ఒకదానిపై ఒకటి నెపం వేసుకుని కాలం గడిపేవి. కానీ, నూతన ఆదేశాల ప్రకారం అక్రమాలకు ఆయా విభాగాల సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

ఎన్టీఆర్‌కు ఎవరూ సరిరాలేరు

- విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే చింతమనేని
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రజలకు అభివాదం చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్, ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భవిష్యత్తులో కూడా ఎవరూ సరిరాలేరని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని క్రాప గ్రామంలో తలశిల పవన్ చేపట్టిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో చింతమనేని పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ 30 ఏళ్లలో చేయలేని ఎన్నో మంచి పనులతో పాటు అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు ఎన్టీఆర్ అందించారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతి గృహాలను ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆ మహనీయుడు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోతారని చెప్పారు. టీడీపీ స్థాపనతో రాజకీయంగా ఎదిగామని, తమకు లాగా ఎందరికో పార్టీలో చోటు దక్కిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో చంద్రబాబు నాయుడు, లోకేశ్ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. పార్టీ శాశ్వతమని, అధికారంలో ఉన్నా లేకపోయినా నాయకులు, కార్యకర్తలు పార్టీని కాపాడుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లే వైసీపీ నాయకుల ప్రయత్నాలను టీడీపీ శ్రేణులు, ప్రజలు గుర్తించాలన్నారు.

భారీ ర్యాలీతో సందడి..

గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. చింతమనేని, ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లకు నాయకులు, కార్యకర్తలు క్రాప అడ్డరోడ్డు నుంచి కనకతప్పెట్లు, డీజే సౌండ్లు, బాణసంచాతో ఘనంగా స్వాగతం పలికారు. నేతలను భారీ గజమాలలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి ప్రదర్శనగా విగ్రహం వరకు వచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ పరిశీలకుడు వంగా సాంబిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఘనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, నాయకులు కనపర్తి శ్రీనివాసరావు, తూనుగుంట్ల సాయిబాబా, కొల్లూరు నాగశ్రీధర్, తమ్మా శివారెడ్డి, తుమాటి శ్యాంబాబు, కొత్తపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. విద్యుత్‌కు అంతరాయం

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణంలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీవర్షం కురిసింది. వర్షానికి ఈదురు గాలులు తోడయ్యాయి. దీంతో ముందుజాగ్రత్తగా అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కర్లపాలెం రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి చీలురోడ్డు సెంటర్ వరకు గంటలకొద్దీ విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఒకవైపు వర్షం, మరోవైపు అంధకారంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వర్షం వచ్చిన ప్రతిసారి విద్యుత్ కష్టాలు తప్పడం లేదని పలువురు వాపోయారు.

బాపట్లను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలి

- జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ శాఖలపై సమీక్షలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్


బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోల్‌మోడల్‌గా బాపట్లను తీర్చిదిద్దాలని దిశ కమిటీ చైర్మన్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పథకాల అమలు తీరుపై దిశ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో 21 ప్రభుత్వ శాఖల పురోగతిపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పురోభివృద్ధికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. పేదరిక నిర్మూలన, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మాతృ, శిశు మరణాలు, నిరక్షరాస్యత తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి వారి ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా ఉపాధి చూపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. జిల్లాలోని లక్షమందికి ఉపాధి కల్పించటమే లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా నుంచి తొలుత మొదలైన పీ-4పై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. పక్కాగృహాల లేఅవుట్లలో రూ.94.26 కోట్లతో రోడ్ల నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఎంపీ అధికారులను ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఇళ్లు పూర్తి చేసుకునేలా అదనంగా ఆర్థికసాయం అందించాలన్నారు. ఉపాధి పనుల్లో అక్రమాలు జరినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సూర్యఘర్ ద్వారా అర్హులైన వారికి సౌర విద్యుత్ వెలుగులు కల్పించాలన్నారు. బిందు, తుంపర సేద్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చేనేతపార్కు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు సహకరించాలి : కలెక్టర్

జిల్లా అభివృద్ధికి అధికారులంతా సహకరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. పథకాలు అమలులో పురోగతి కనిపించాలన్నారు. పేదరిక నిర్మూలన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, ప్రకాశం, గుంటూరు జడ్పీ సీఈవోలు చిరంజీవి, జ్యోతిబసు పాల్గొన్నారు.

అమరావతిలో ప్రభుత్వ భవనాలకు రూ.212.22 కోట్లు

- రాజధానిలో 4 స్టార్ హోటళ్ల నిర్మాణానికి అనుమతి
- పరిపాలనా ఆమోదం తెలిపిన మంత్రి మండలి



అమరావతి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు అవసరమైన రూ.212.22 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మిస్తున్న గవర్నర్ నివాస సముదాయంలోని గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నారు. వీటికి సంబంధించి ఎంఈపీ మాత్రమే ఉండే ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో టెండర్లను పర్సంటేజ్ విధానంలో పిలవాలని నిర్ణయించారు. గవర్నర్ నివాస సముదాయ నిర్మాణం పరిపాలనా సామర్థ్యం, రాజ్యాంగ గౌరవాన్ని పెంచుతుందని మంత్రి మండలి అభిప్రాయపడింది. విజయవంతమైన బిడ్డర్లను ఆమోదించి, సంవత్సరం గడువులోపు సంబంధిత ప్రదేశాల్లో కన్వెన్షన్ సెంటర్ల అభివృద్ధికి ఒక్కొక్కరికి 2.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం ఇచ్చింది. ఈ క్రమంలో ఒప్పంద తేదీ నుంచి అవసరమైన అన్ని చర్యలు, పత్రాలు జారీ చేసేందుకు ఈ నెల 8న ఏపీసీఆర్డీఏ అథారిటీ చేసిన తీర్మానం నెం.589/2025కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాజధానిలో నాలుగు స్టార్ హోటళ్ల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అమరావతిలో సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ 4 స్టార్ హోటల్స్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.176.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నది. 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతోపాటు దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా అమరావతిలో 4 స్టార్ హోటల్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ హోటల్లో 400 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

కన్వెన్షన్ సెంటర్లకు టెండర్లు

క్వాలిటీ బేస్డ్ సెలక్షన్(క్యూబీఎస్) విధానం ద్వారా నాలుగు ప్రదేశాలలో(ప్రతి దానికి 2.5 ఎకరాలు) కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా విజయవంతమైన బిడ్డర్లుగా లొకేషన్ 1లో జీ.వీ.హోటల్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియం, లొకేషన్ 2లో మహాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, లొకేషన్ 3లో ఓం శ్రీభవనసాయి అసోసియేట్స్ ఎల్ఎల్‌పీ, లొకేషన్ 4లో వరుణ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లను ఎంపిక చేశారు. ఈ కన్వెన్షన్ సెంటర్లు అమరావతిలో అంతర్జాతీయ సదుపాయాలను అందిస్తాయని మంత్రి మండలి ప్రకటించింది.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు

● పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
● నేర సమీక్షలో ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాలు



బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై తీసుకున్న చర్యలు, కేసుల పురోగతి, మహిళల అదృశ్యం, గంజాయి, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, చోరీ కేసుల దర్యాప్తుపై ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, శక్తియాప్, మహిళా సంబంధిత చట్టాలు గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ మద్యపానం, రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సముద్రతీరప్రాంతాల్లో యాత్రికుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి డ్రోన్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విచారణలను వేగవంతం చేసి పెండింగ్ కేసులు తగ్గించాలన్నారు. కేసుల దర్యాప్తులో జాప్యం వహిస్తే సాక్ష్యాధారాలు కనుమరగయ్యే అవకాశం ఉందన్నారు. దీపావళి మందుగుండు విక్రయాలు, నిల్వలపై చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచి ఇతరుల మనోభావాలకు భంగం కలిగించే విధంగా కథనాలు వ్యాప్తి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ గ్రామంలో సిబ్బందిని నియమించి వారు తరుచు ఆయా గ్రామాలను సందర్శిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించేలా చూడాలన్నారు. నైట్‌బీట్, పెట్రోలింగ్ పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ఎ.శ్రీనివాసరావు, జి.రామాంజనేయులు, ఎండీ మోయిన్, పి.జగదీష్‌నాయక్, బాలమురళి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సార్లొస్తున్నారు

- 13 నుంచి విధుల్లోకి ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో తీరనున్న టీచర్ల కొరత
- మెగా డీఎస్సీ అభ్యర్థులకు ముగిసిన శిక్షణ
- నూతన ఉపాధ్యాయులకు పల్నాడు, గుంటూరు డీఈవోల దిశానిర్దేశం

గుంటూరు(విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ముగిశాయి. దీంతో సోమవారం నుంచి ఆయా ఉపాధ్యాయులు విధులకు హాజరుకానున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నది. ఇప్పటివరకు ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటుతో పాఠశాలలకు కేటాయించారు. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో 13 నుంచి నూతన ఉపాధ్యాయులు బడులకు రానుండటంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోన్ 3 పరిధిలోని గుంటూరు ప్రకాశం నెల్లూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 1600 ఉపాధ్యాయ పోస్టులను ఇటీవల డీఎస్సీలో ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్ తదితర విభాగాల్లో దాదాపు 1200 మందికిపైగా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఆయా క్యాడర్లలోని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఈ నెల 2 నుంచి నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించింది. ఈ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. వీరంతా ఆయా పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నదని ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు రేణుక, చంద్రకళ శుక్రవారం దిశానిర్దేశం చేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

పోస్టింగ్‌ల్లో పల్నాడుకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని బొల్లాపల్లి, మాచవరం, వెల్దుర్తి, మాచర్ల నియోజకవర్గాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయా ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు వచ్చారు. దీంతో అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వెలవెలబోతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల పోస్టింగ్‌లో పల్నాడు జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో జిల్లాలో ఇంతకాలం ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు అత్యధికంగా పోస్టులు కేటాయించారు. దీంతో ఆయా పాఠశాలలు తిరిగి పూర్వ వైభవం సంతరించుకోనున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది కూడా డీఎస్సీ నిర్వహించి భారీ సంఖ్యలో పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత అంటూ ఉండే అవకాశం లేదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించాలి

● జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ మురళీకృష్ణ

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : సూపర్ జీఎస్టీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ జి.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం వివిధ వ్యాపార సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సదస్సులో గృహోపకరణాల మీద తగ్గిన జీఎస్టీ గురించి అవగాహన కల్పించారు. కమిషనర్ రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని జీఎస్టీలో వచ్చిన మార్పులు గురించి వివరించారు. తగ్గించిన జీఎస్టీ ద్వారా కొనుగోలుదారుల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందనే విషయాన్ని తెలియజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డిప్యూటీ ఏసీ కనికిరెడ్డి, వ్యాపార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

(5వ పేజీ తరువాయి)

ఆలోగా మొత్తం ప్రక్రియను ఓ కొలిక్కి తేవడానికి డ్వామా విభాగం కసరత్తు చేస్తోంది.

నేరుగా యాప్‌లో నమోదు

నరేగా యాప్‌లోనే ఈ కేవైసీ ఆప్షన్‌ను ప్రభుత్వం ఇచ్చింది. దీని ప్రకారం ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉంటున్న ప్రతి శ్రామికుడి వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయడంతో పాటు ఈ కేవైసీ అంకాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఇకపై పని ప్రదేశంలో శ్రామికుల హాజరు పక్కాగా ఉండడంతో పాటు బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడనుంది. ఇక మీదట పనివేళల్లో రోజుకు రెండు సార్లు ఫేస్ బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. ఒకరికి బదులుగా వేరొకరు హాజరు వేసే ప్రయత్నం చేస్తే ఈ కేవైసీ అమలవుతుండడం వల్ల వెంటనే బయటపడనుంది. దీంతో వారికి ఇచ్చే వేతనాన్ని కూడా నిలుపుదల చేయనున్నారు

పాత విధానంలో అనేక అక్రమాలు

ఉపాధి హామీ శ్రామికుల హాజరు విధానంలో ఉన్న లొసుగులు లోపభూయిష్టంగా ఉండడంతో ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏళ్ల తరబడి ఈ మస్టర్ల మాయాజాలం నడుస్తూనే ఉంది. యాప్‌లో గ్రూప్ ఫొటో అప్‌లోడ్ చేయడం వరకే పరిమితమయ్యేది. సంతకాన్ని కూడా ప్రామాణికంగా తీసుకునే వారు. దీంతో మస్టర్ల విషయంలో అనేక ఆరోపణలు వెలుగుచూసేవి. ఉదయం హాజరు వేయించుకుని పని ప్రదేశం నుంచి వెళ్లిపోవడం మొదలుకుని, అర్హత లేని వారికి కూడా రాజకీయ సిఫారసులతో జాబ్ కార్డులు ఇప్పించుకుని ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించేవారు. నవంబరు నుంచి అమలవబోతున్న నూతన విధానంలో రోజుకు రెండు సార్లు ముఖ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో మస్టర్ల విషయంలో ఇకపై ఎలాంటి అక్రమాలకు తావుండదని, అర్హతే ప్రామాణికంగా జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పనిచేసిన వారికే వేతనం పక్కాగా అమలు కానుందని అధికారులు చెబుతున్నారు

స్మార్ట్‌కార్డుల పంపిణీకి శ్రీకారం

నేడు ఒంగోలులో ప్రారంభించనున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే జనార్దన్, కలెక్టర్

ఏర్పాట్లు పూర్తి చేసిన పౌరసరఫరాల శాఖ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తెల్లరేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ పంపిణీలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ రేషన్ కార్డు చౌకధరల సరుకులతోపాటు అన్ని ప్రభుత్వ పథకాలకు కీలకమైంది. కొంతమంది లబ్ధిదారుల వేలిముద్రలు పడకపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెల్లరేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులను జారీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేయగా ప్రకాశం జిల్లాలో శనివారం నుంచి పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 6.61లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా ప్రస్తుతం చెన్నై నుంచి జిల్లాకు 6.51 లక్షల స్మార్ట్ కార్డులు వచ్చాయి. ఆయా కార్డులను మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాలకు చేర్చారు. ఈ స్మార్ట్‌కార్డు క్యూఆర్ కోడ్ లేదా స్కైపింగ్ ద్వారానైనా రేషన్ తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. వయోపరిమితి ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, వేలిముద్రలు పడని వారందరూ క్యూఆర్ కోడ్ లేదా స్కైపింగ్ ద్వారా రేషన్ తీసుకున్నారు. జిల్లాలో ఈ స్మార్ట్‌కార్డుల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో శనివారం సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, కలెక్టర్ రాజాబాబు చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు చేశారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో శాసనసభ్యుల సమక్షంలో స్మార్ట్‌కార్డులను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

కాటేరు వాగు, జోమ్ కాలువ ఆక్రమణలను తొలగిస్తాం

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దర్శిలోని కాటేరువాగు, జోమ్‌కాలువ ఆక్రమణలను తొలగిస్తామని ఇరిగేషన్ అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆంధ్రజ్యోతి ప్రకాశంలో గురువారం కబ్జా కాటు శీర్షికన ప్రచురితమైన కథనంకు వారు స్పందించారు. కాటేరువాగు, జోమ్ కాలువలు ఎంత మేరకు విస్తరించి ఉన్నాయో కొలతలు వేయించి హద్దులు వేయిస్తామన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలి

రాజకీయాలకు అతీతంగా పోరాటం చేయాలి

మండల రైతు సంఘం మహాసభల్లో కృష్ణయ్య



మాట్లాడుతున్నరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య

మార్టూరు, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వైఖరిని వ్యతిరేకించాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పోరాటం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వలేటి కృష్ణయ్య పిలుపునిచ్చారు.ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారమిక్కడ మండల రైతుసంఘం 3 మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులతో బహిరంగసభ నిర్వహించారు. సభకు మండల శాఖ అధ్యక్షుడు పాలెపు సాంబయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థలకు భూములను దారాదత్తం చేస్తున్నారని, తద్వారా వ్యవసాయ రంగాన్ని నీరుగారుస్తున్నారని చెప్పారు. వ్యవసాయంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ చేస్తూ వాటిని కార్పొరేట్ సంస్థలకు అండగా ఉంటున్నాన్నారు. సభలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, పేర్ని నాగేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, నాగబోయిన సాంబయ్య, గాడిపర్తి నాగేశ్వరరావు, వెల్లలచెరువు సుబ్బారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

విశ్రాంత ఉద్యోగుల భవనంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మండల రైతు సంఘం నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. మండల గౌరవ అధ్యక్షుడిగా పాలెపు సాంబయ్య, అధ్యక్షుడిగా పేర్ని నాగేశ్వరరావు, కార్యదర్శిగా వీరవల్లి కృష్ణమూర్తి, సభ్యులుగా గోనుగుంట్ల మోహనరావు, దూళ్లిపాళ్ల శ్రీనివాసరావు తదితరులను సభ్యులుగా ఎంపిక చేశారు.

షార్ట్ సర్క్యూటే కారణమా?

కలికివాయి వద్ద పొగాకు కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

బూడిదైన పొగాకు బేళ్లు.. రూ.557 కోట్ల నష్టం

మూడుగంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ అధికారులు

ఆ రెండు బ్లాక్‌లలో సిబ్బంది లేకపోవడంతో తప్పిన పెను ప్రభావం

వివిధ కోణాల్లో విచారిస్తున్న పోలీసులు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



గోదాం నుంచి ఎగిసి పడుతున్న అగ్నిజ్వాలలు

సింగరాయకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలో ఉన్న టీకేటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శుక్రవారం వేకువజామున చోటుచేసుకున్న అగ్నిప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటా? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా (జీపీఐ) లిమిటెడ్ కంపెనీ అద్దె ప్రతిపాదికన తీసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ కంపెనీలో ఏ, బీ బ్లాక్‌లలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడి క్షణాల్లోనే ఒక కోటి పది లక్షల (11 మిలియన్) కేజీల పొగాకు బూడిదైంది. సుమారు రూ.557 కోట్ల నష్టం వాటిల్లినట్లు జీపీఐ కంపెనీ ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం చోటుచేసుకుని ఉంటుందని కంపెనీ జీఎం అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారీ ప్రమాదం కావడం, నష్టం కూడా పెద్దమొత్తంలో ఉండటంతో పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు.

ఐదు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి..

ప్రమాదం జరిగిన వెంటనే కంపెనీ సిబ్బంది తొలుత టంగుటూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి ఒక ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే భారీగా ఎగసిపడుతున్న మంటలను చూసి కొండపి, ఒంగోలు, కందుకూరు, కావలి నుంచి మరో నాలుగు ఫైర్ ఇంజన్లను తెప్పించారు. ఏ, బీ బ్లాకుల నుంచి అగ్ని కీలలు మిగతా బ్లాకులకు విస్తరించకుండా దాదాపు 3గంటలు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సాయంత్రం వరకు ఐదు ఫైర్ ఇంజన్‌లను అక్కడే ఉంచారు. అప్పుడప్పుడూ అక్కడక్కడా వస్తున్న మంటలను అదుపు చేశారు. డీఎఫ్‌వో శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షించారు. భారీ అగ్నిజ్వాలల ధాటికి ప్రమాదం జరిగిన రెండు గోదాంల పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్నిచోట్ల గోడలు కుప్పకూలాయి.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు శుక్రవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదృష్టవశాత్తూ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ బృందం, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రమాదానికి గల కారణాలను వెల్లడిస్తామన్నారు.

ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, వీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఎస్సైలు బి.మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, బత్తుల మహేంద్ర ఉన్నారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రమాదం చోటుచేసుకున్న టీకేటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని పరిశీలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

350 మంది సిబ్బంది సురక్షితం

కంపెనీలో రోజువారీ 900మంది సిబ్బంది పనిచేస్తుంటారు. ప్రమాదం జరిగిన సమయంలో రాత్రి షిఫ్టులో దాదాపు 350 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. గోదాంల నుంచి ఉవ్వెత్తున మంటలు ఎగిసిపడటంతో వారంతా భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన గోదాంల వెనుకవైపు పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు హుటాహుటినా బయటకు పంపించారు. ఏ, బీ బ్లాక్‌లలో కేవలం ఎగుమతికి సిద్ధంగా ఉన్న పొగాకు మాత్రమే ఉండటం, అందులో కార్మికులెవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

మారనున్న దొనకొండ దశ

ప్రజా ప్రభుత్వంలో చిగురిస్తున్న ఆశలు

రక్షణ రంగానికి చెందిన భారీ పరిశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు

రెండు నెలల క్రితం భూములను పరిశీలించిన డీఆర్‌డీవో సంస్థ ప్రతినిధులు



భూములను పరిశీలిస్తున్న డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ బృందం, పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, ఏపీఐఐసీ జడ్ఎం మదన్‌మోహన్, తహసీల్దార్ రమాదేవి(ఫైల్)

దొనకొండ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలో సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు అనుగుణంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. అనంతపురం జిల్లాలోని మడకసిర, ప్రకాశం జిల్లాలోని దొనకొండ, కృష్ణ జిల్లాలోని జగ్గయ్యపేట ప్రాంతాల్లో డిఫెన్స్ పరిశ్రమల అభివృద్ధి జరిగేలా చర్యలు చేపట్టింది. అందులోభాగంగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) సంస్థ ఒక అడుగు ముందుకేసి దొనకొండలో రెండు దశలుగా రూ.1200 కోట్ల పెట్టుబడులతో ఆయుధ క్షిపణుల తయారు పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అందుకు 1400 ఎకరాల భూమి అవసరంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈ పరిశ్రమ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 1600 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులన్నీ సకాలంలో వస్తే ఏడాదిలో పరిశ్రమ ప్రారంభ ఏర్పాట్లు చేపట్టి, రెండేళ్లకు పూర్తి చేసేలా ఆ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు తెలిసింది.

దొనకొండలో ఈ పరిశ్రమ ఏర్పాటు జరిగితే ఇటు రాష్ట్ర రాజదాని అమరావతి, అటు నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోట రాకెట్ కేంద్రానికి చేరువగా ఉంటుందనేది సమాచారం. ఇక్కడ తయారుచేసే వస్తువులు రాబోయే రోజుల్లో విదేశాలకు ఎగుమతులు చేసే అవసరంగా ఉండవచ్చని అత్యధిక ఉత్పాదక కేంద్రంగా నెలకొల్పేందుకు బీడీఎల్ సంస్థ ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. అందులోభాగంగా రెండు నెలల క్రితం డీఆర్‌డీవో సంస్థకు చెందిన ప్రతినిధులు దొనకొండకు విచ్చేసి ఈ ప్రాంతంలోని భూములను, మౌలిక సౌకర్యాలను పరిశీలించారు. భూములకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కనిగిరి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్ ద్వారా తెలుసుకున్నారు.

ఆపరేషన్ సింధూర్ అనంతరం బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తిని పెద్దఎత్తున పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుందని విశ్వసనీయ సమాచారం. అందునిమిత్తం దొనకొండలో రక్షణశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక రక్షణరంగ పరికరాల తయారీ యూనిట్ నెలకొల్పేందుకు ఇటీవల ప్రభుత్వానికి బీపీఎల్ సంస్థ డీపీఆర్‌ను అందించినట్లు ప్రచారం. దొనకొండలో బ్రిటీష్ కాలంనాటి విమానాశ్రయం, గుంటూరు-బెంగుళూరు ప్రధాన రైలుమార్గం ఉండటం భారీ పరిశ్రమల ఏర్పాటుకు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దొనకొండ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ప్రకటించటం జరిగింది. అందుకు అధికారులు కార్యాచరణ చేపట్టి వడివడిగా అడుగులు ముందుకు వేస్తున్నారు.

రాష్ట్ర విభజన అనంతరం దొనకొండ ప్రాంతంలో అధికంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల కారిడార్ ఏర్పాటుకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. అందులోభాగంగా మండలంలోని భూములను రెవెన్యూ అధికారులచే సమగ్ర సర్వే చేయించి పట్టాభూమి 4407-62 ఎకరాలు, ప్రభుత్వ భూమి 12367-95 ఎకరాలు, అసైన్‌మెంట్ భూమి 8287-28 ఎకరాలు, మొత్తం 25061-85 ఎకరాల భూమిని నిర్ధారించారు. 2014 నుండి 2019 మధ్య కాలంలో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ ప్రాంతాలకు చెందిన ఎందరో ప్రతినిధులు ఈ భూములను పరిశీలించారు. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళపాటు పరిశ్రమల ఏర్పాటుపై ఎటువంటి దృష్టి సారించకపోవటంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. ఏడాదిన్నర కాలంలో పరిశ్రమల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం చూపుతున్న చొరవతో దొనకొండ ప్రాంతం అభివృద్ధిలో బాగంగా పరిశ్రమలు ఏర్పాటయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దొనకొండ దశ మారనుందని ప్రజలు భావిస్తున్నారు.

దొనకొండ సమీపంలో బీడీఎల్‌కు 1400 ఎకరాలు

భూకేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం

రూ.1200 కోట్లతో యూనిట్ ఏర్పాటు

ఒంగోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ప్లాంట్ ఏర్పాటుకు జిల్లాలోని దొనకొండ సమీపంలో ప్రభుత్వం భూకేటాయింపు చేసింది. ఇందుకోసం 1,400 ఎకరాలను కేటాయింపు చేస్తూ శుక్రవారం జరిగిన రాష్ట్రమంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దొనకొండ పరిసరాల్లో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించగా పలు కంపెనీలు తమ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన బీడీఎల్ రక్షణ రంగంలో ఆయుధ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. సుమారు రూ.1200 కోట్లతో నూతన ఆయుధ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించేందుకు 1,400 ఎకరాల భూమి అవసరంగా బీడీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. రెండు దశల్లో ఈ ప్లాంట్ నిర్మించాలని భావిస్తుండగా దీని ద్వారా 1400 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. కాగా బీడీఎల్ కోరిక మేరకు భూమిని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో ప్లాంట్ ఏర్పాటుకు 1200 ఎకరాలు, టౌన్‌షిప్ నిర్మాణానికి 146.67 ఎకరాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చేతిలో ఉన్న భూమిని ఎకరా రూ.7.73 లక్షల వంతున కేటాయించనుండగా మిగిలిన భూమికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం కేటాయించాలని నిర్ణయించారు.

రెండో హత్య కేసులో మళ్లీ యావజ్జీవం

అవీఇవీ

వాచ్‌మన్‌ను హత్య చేసిన 78 ఏళ్ల వయస్సు ఉన్న నిందితుడు

రెండోసారి కూడా అదే శిక్ష

కొండపి/ఒంగోలు క్రైం, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని మద్దులూరు రోడ్డులో 2023 సంవత్సరంలో ఓ బ్రాందీ షాపు ముందు నిద్రిస్తున్న వాచ్‌మన్‌తో గొడవపడి గడ్డపారతో హత్య చేసిన కేసులో నిందితుడికి శుక్రవారం యావజ్జీవ శిక్ష పడింది. ఆ మేరకు శుక్రవారం జిల్లా కోర్టులో కొండపికి చెందిన కడియం హనుమంతరావుకు జీవిత ఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధిస్తు ఒంగోలు అదనపు జిల్లా న్యాయాధికారి టి.రాజావెంకటాద్రి తీర్పు నిచ్చారు. అప్పట్లో కొండపిలో సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితునికి తాజాగా పడిన యావజ్జీవ శిక్ష రెండోసారని తెలిసింది. టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన కడియం హనుమంతరావుకు దాదాపు 30ఏళ్ల క్రితం గ్రామంలో జరిగిన హత్య కేసులో యావజ్జీవ శిక్ష పడింది. ఆ కేసులో ముద్దాయి శిక్ష అనుభవించాడు. అనంతరం తన స్వగ్రామం పొందూరు విడిచి కొండపికి వచ్చి గుడులు, పాడుబడిన, ఖాళీగా ఉండే ఇళ్లలో ఉంటున్నాడు. 2023 సంవత్సరం ఏప్రిల్ 13వ తేదీ రాత్రి పది గంటల సమయంలో బ్రాందీ షాపులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మండలంలోని పోలిరెడ్డిపాలేనికి చెందిన సంగన సుబ్బారెడ్డితో దుకాణం మూసేటప్పుడు గొడవపడ్డాడు. ఆవేశంతో చంపుతానని బెదిరించి, అర్ధరాత్రి తన నివాసం నుంచి గడ్డపారతో వెళ్లి సుబ్బారెడ్డి తలపై కొట్టి చంపాడు. ఈమేరకు మృతుని భార్య సంగ సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పట్లో ఈ హత్య కొండపిలో సంచలనంగా మారింది. సీసీ కెమెరాలో రికార్డైన దృశ్యాలు, పోలీసు జాగిలాలు కూడా నేరుగా నిందితుడి ఇంటికి వెళ్లాయి. ఈ కేసులో తిరిగి నిందితుడికి యావజ్జీవ శిక్ష పడింది. ఒకే వ్యక్తికి రెండుసార్లు హత్య కేసుల్లో యావజ్జీవ శిక్ష పడటం అరుదు. మొదటిసారి శిక్ష పడ్డాక సహజంగా పశ్చాత్తాపం ఉంటుంది. అటువంటిది తిరిగి రెండోసారి హత్య చేయడం విచిత్రంగా ఉందని అప్పట్లో స్థానికుల్లో చర్చనీయాంశమైంది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతికుమారి వాదనలు వినిపించారు. ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టిన పోలీసులను ఎస్పీ హర్షవర్ధనరాజు అభినందిచారు.

కాలువల రీడింగ్స్ సరిచేసేందుకు గేజింగ్ డివిజన్‌కు నివేదించాం

దర్శి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువల్లో నీటి కొలతల్లో తేడాలను సరిచేసేందుకు గేజింగ్ డివిజన్‌కు తెలిపినట్లు ఇరిగేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సాగర్ కాలువల్లో నీటి కొలతల్లో మతలబు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు వద్ద (ప్రకాశం బార్డర్), దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద రీడింగ్‌లో తేడాతో కిందకు తక్కువ నీరు వస్తున్నా ఎక్కువ నీరు విడుదల అవుతున్నట్లు రీడింగ్‌లు చూపుతున్నాయి. దీనివల్ల చివరి భూములకు సక్రమంగా నీరందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా అధికారులు స్పందించి రీడింగ్ గేజ్‌లను తనిఖీలు చేసి సరిచేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

గ్రామీణ బ్యాంకుల విలీనం

ఇకపై 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు'గా మార్పు

సోమవారం వరకు నిలిచిపోనున్న సేవలు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు గ్రామీణ బ్యాంకులను విలీనమవుతున్నాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను కలిపి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్'గా ఏర్పాటుచేస్తున్నారు. ఇకపై ఈ నాలుగు బ్యాంకుల ద్వారా అందిస్తున్న సేవలను ఒకే ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చే ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు శుక్రవారం నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు ఈ బ్యాంకుల ద్వారా నిర్వహించే సేవలను నిలిచిపోనున్నాయి. దాంతోపాటుగా ఈ బ్యాంకుల పరిధిలో కొనసాగే ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్ వంటి ఆన్‌లైన సేవలు కూడా పనిచేయవని బ్యాంకర్లు వెల్లడిస్తున్నారు. కాగా అక్టోబరు 11 రెండవ శనివారం, 12 ఆదివారం బ్యాంకులకు సెలవులు అయినప్పటికీ సాధారణంగా సెలవు రోజుల్లో పనిచేసే ఆన్‌లైన్ సేవలు కూడా నిలిచిపోయాయి.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఫ్యాక్టరీల యజమానులు


చీమకుర్తి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో విస్తరించిన గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గుండా శ్రీనివాసరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 2,500 గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలు పదిరోజుల నుంచి సమ్మె చేస్తున్నా పట్టించుకొనేవారే కరవయ్యారని, ఫ్యాక్టరీలు మూతపడటంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని వినతిపత్రంలో తెలిపారు. రాయల్టీ వసూలు గతంలో వలే ప్రభుత్వమే వసూలు చేయాలని, ఏఎంఆర్ సంస్థకు ఇచ్చిన అనుమతులు రద్దుచేయాలని కోరారు. పెంచిన రాయల్టీని తగ్గించి పరిశ్రమను కాపాడాలని కోరారు. వెంటనే ఫ్యాక్టరీ ఓనర్లతో చర్చలు జరిపి సమస్య పరిష్కారం అయ్యేలా చొరవచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్య దర్శి మాకినేని అమరసింహం, పుత్తూరి శ్రీనివాసరావు, జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు ఫ్యాక్టరీ ఓనర్ల అత్యవసర సమావేశం

పదిరోజుల నుంచి గ్రానైట్ ఫ్యాక్టరీలను మూసివేసి సమ్మె చేస్తున్న ఓనర్లు శనివారం వీటీసీలో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. కొనసాగిస్తున్న సమ్మెపై సమీక్ష, ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తోనూ, ఏఎంఆర్ సంస్థతోనూ రెండువిడతలపాటు అసోసియేషన్ నాయకులు జరిపిన చర్చల సారాంశాన్ని ఓనర్ల అందరికీ వివరించి తదుపరి కార్యాచరణను రూపొందించనున్నారు. సీనరేజి వసూలు హక్కులను టెండర్ ద్వారా పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రభుత్వంతో ఇంకా ఒప్పందం కుదుర్చుకోలేదు. ఈనెల 3న అని మొదట అనుకున్నా ఫ్యాక్టరీ ఓనర్ల సమ్మె నేపథ్యంలో వ్యూహాత్మకంగా ఒప్పందం కుదుర్చుకోవటంలో వాయిదాలు వేస్తూ వస్తున్నారు. తాజాగా 24వ తేదీ వరకూ గడువు కోరటం, ప్రభుత్వం మంజూరు చేయటం జరిగింది. దీంతో ఫ్యాక్టరీ ఓనర్లు పునరాలోచనలో పడ్డారు. సమ్మెకు తాత్కాలికంగా విరామం ఇచ్చి ఏఎంఆర్ సంస్థ ఒప్పందం కుదుర్చుకొన్న తర్వాత వారి పోకడలు చూసి తిరిగి సమ్మె చేద్దామా లేదా ప్రస్తుతం నిర్వహిస్తున్న సమ్మెను కొనసాగిద్దామా అనే విషయాన్ని నేడు జరగనున్న ఓనర్ల సమావేశంలో నిర్ణయించనున్నారు.

స్వచ్ఛందంగా స్పందించారు

● రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్ల తొలగింపు



సమీక్షిస్తున్న ఐజీ త్రిపాఠి

పర్చూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు - యద్దనపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో ఈ మార్గం ప్రమాదాలకు నిలయంగా మారింది. చిల్లచెట్ల మధ్య ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ మార్గంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన కొల్లా చంద్రం, పర్చూరు గ్రామానికి చెందిన ఒగ్గిశెట్టి నరసింహం నేతృత్వంలో స్వచ్ఛంద సేవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి చిల్లచెట్లను తొలగించారు. ప్రజా సమస్యలపై స్వచ్ఛందంగా స్పందించి సేవానిరతిని చాటుకున్న వారిని వాహనదారులు, ప్రజలు కొనియాడుతున్నారు.

అవీ..ఇవీ..

అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు



ఇందిరా కాలనీలో రూపుదిద్దుకున్న అంతర్గత సీసీ రోడ్డు

పర్చూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో తొలివిడతగా రూ.6.25 కోట్లతో 67 పనులు మంజూరయ్యాయి. అలాగే రెండో విడతలో రూ.11.75 కోట్ల వ్యయంతో 94 పనులు మంజూరయ్యాయి. గ్రామాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో మొత్తం రూ.80 లక్షల వ్యయంతో 10 పనులకు నిధులు మంజూరయ్యాయి. వీరన్నపాలెం రూ.1.13 కోట్లు, పోతుకట్ల గ్రామంలో రూ.70లక్షలు, చెరుకూరులో రూ.1.50 కోట్లు, భూషాయపాలెం రూ.30లక్షలు, గొల్లపూడి రూ.30లక్షలు, చిన్ననందిపాడు రూ.30 లక్షలు, అన్నంబొట్లవారిపాలెం రూ.60లక్షలు, గర్నెపూడి రూ.25లక్షలు, తిమ్మరాజుపాలెం రూ.75లక్షలు, నూతలపాడు రూ.1.25 కోట్లు, కొల్లవారిపాలెం రూ.25లక్షలు, నాగులపాలెం రూ.1.50 కోట్లు, దేవరపల్లి రూ.కోటి, పర్చూరు రూ.2.50 కోట్లు, బోడవాడ రూ.40 లక్షలు, అడుసుమల్లి రూ.1.90 కోట్లు, ఇనగల్లు రూ.55లక్షలు, కొమర్నేనివారిపాలెం రూ.20లక్షలు, తన్నీరువారిపాలెం రూ.20లక్షలు, రమణాయపాలెం రూ.15లక్షలు, ఏదుబాడు రూ.30లక్షలు, పెద్దివారిపాలెం రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

వెయిట్ లిఫ్టింగ్‌లో కారంచేడు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో గంగాధర్

కారంచేడు(పర్చూరు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని భారత వ్యాయామ కళాశాలలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి పోటీల్లో కారంచేడు గ్రామంలోని యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థులు ప్రతిభ చూపారు. 55 కిలోల విభాగంలో కె.దుర్గా, 60 కిలోల విభాగంలో భవ్యశ్రీ, బాలుర విభాగంలో బి.సుధీర్ కుమార్‌లు ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో డిప్యూటీ డీఈవో గంగాధర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం(చీరాల), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలుప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొత్తపేట, ప్రసాదనగర్, చల్లారెడ్డిపాలెం, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం, కఠారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. మరమ్మతుల అనంతరం సరఫరా యథావిధిగా కొనసాగుతోందన్నారు.

చినగంజాం : మండలంలోని చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ ఎల్.బ్రహ్మం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మున్నం వారిపాలెం, సోపిరాల, పూలవారిపాలెం, కడవకుదురు, చింతగుంపల్లె, గొనసపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోటరీలో నేడు బీజేపీ కార్యశాల

చీరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతం, పార్టీ కార్యక్రమాలకు సంబంధించి నేడు రోటరీ క్లబ్ కమ్యూనిటీ భవనంలో జిల్లా కార్యశాల నిర్వహించనున్నట్లు ప్రతినిధులు ఒక ప్రకనటలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం



దుకాణాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

అద్దంకిటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక ఆదాయం పొందవచ్చని అద్దంకి ఏడీఏ బి. ఎప్రాయిమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో గో-ఆధారిత వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హస్సేన్ హాజరై మాట్లాడారు. రైతులకు అందుబాటులో అన్ని రకాల కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతం రైతులకు అందుబాటులో ఉంచి, తక్కువ ధరకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు స్వంతగా కూరగాయలు పండించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా కషాయాలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కొత్రపాటి వెంకటకృష్ణ , ఆదర్శ రైతు నరిశెట్టి రమేష్, షాపు యజమాని నరేంద్ర, అశోక్, కోకిల, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు పద్ధతులపై అవగాహన



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని రామకూరు గ్రామంలో శుక్రవారం ఒంగోలు ఆత్మవారి సహకారంతో ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులపై ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంలో అవసరమైన వివిధ కషాయాల తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు వివిధ కషాయాలను తయారు చేసుకుని నిల్వ చేసుకోవడం ద్వారా అవసరమైన సమయంలో చీడపీడల నివారణకు పంటలపై పిచికారీ చేసుకోవచ్చన్నారు. బీజామృతం, ద్రవజీవామృతం, దశపర్ణికషాయం, అగ్నిస్త్రం కషాయాల తయారీ పద్ధతులను రైతులకు చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సీ.హెచ్.హరి, ఆత్మ ఏటీఎం అక్షరరాణి, సీఆర్‌పీలు రమేష్, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో మానసిక ఆరోగ్యం బాగు

● మానసిక వైద్యనిపుణురాలు నాగలక్ష్మి ● వారోత్సవాల్లో భాగంగా పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

బల్లికురవ, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో ఉంటే మానసిక ఆరోగ్యం బాగుటుందని, అందరు ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, కెరియర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ జి.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని వైదన గ్రామంలో శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతి విద్యార్థి చదువుపై ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. చెడు ఆలోచనల గురించి మరిచి పోవాలన్నారు. ఒంటరిగా ఉన్న సమయంలో ధ్యానం చేయాలన్నారు. చదువులో ఇది ఎంతో ఉపయెగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టిసారించాలి

మేదరమెట్ల, : విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని చీరాల డివిజన్ డిప్యూటీ ఈవో డి.గంగాధరరావు తెలిపారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మేదరమేట్ల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర రావు మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఆ రోగ్య ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు తెలియజేయా లన్నారు. కార్యక్రమంలో జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ వేణుగోపాలరావు విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలిశమ్మ, హెచ్ఎం అంజనీదేవి, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.





మేదరమెట్లలో మాట్లాడుతున్న గంగాధరరావు, అద్దంకిలో మాట్లాడుతున్న హనుమంతరావు

చక్కటి స్నేహ సంబంధాలతో సమస్యలు దూరం

అద్దంకిటౌన్ : కుటుంబంలో, స్నేహితుల మధ్య మంచి సంబంధాలు ఉండాలని ప్రజావైద్యశాల వైద్యులు డాక్టర్ యలగాల హనుమంతరావు అన్నారు. శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రస్తుతం సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలు-నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ పిల్లల్ని సత్ప్రవర్తనతో పెంచాలన్నారు. ఒత్తిడి తగ్గించుకోవాలని, మంచి ఆహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యన్ని కాపాడుకుంటే మానసిక సమస్యలకు దూరం గా ఉంటామన్నారు. కార్యక్రమం లో రోటరీ అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, అలహరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, దేవపాలన, చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, లేవి ప్రసాద్ శ్రీలక్ష్మి, శివకుమారి, భువనేశ్వరి, ఖాజావలి తదితరులు ఉన్నారు.



వైదనలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భూముల రీసర్వే లోపాలను సరిదిద్దరే..?

రెవెన్యూ సిబ్బందిపై ధ్వజమెత్తిన సర్పంచులు

మార్టూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రీసర్వే చేయడం ద్వారా నమోదైన లోపాలను ఇంతవరకు రెవెన్యూ అధికారులు సరిచేయలేక పోయారంటూ పలు గ్రామాల సర్పంచులు రెవెన్యూ అధికారులపై ధ్వజమెత్తారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. సమావేశంలో కోలలపూడి సర్పంచ్ ఎం సతీష్ కుమార్, బొల్లాపల్లి సర్పంచ్ నార్ని సింగారావు, చిమ్మిరిబండ సర్పంచ్ జంపని వీరయ్యలు రీసర్వేలో జరిగిన పొరబాట్లును సరిచేయలేదని, రైతులకు ఇంతవరకు పాస్‌బుక్‌లను ఇవ్వలేదని సమావేశానికి హాజరైన ఆర్‌ఐ అశోక్‌ను ప్రశ్నించారు. దీంతో ఆయన వారికి సమాధానం చెబుతూ ఈ విషయాన్ని తహసీల్దారు దృష్టికి తీసుకువెళతానన్నారు. అదేవిధంగా పలుగ్రామాలలో విద్యుత్ స్తంభాలు శిథిలదశలో ఉన్నాయని, కరెంటు తీగలు కిందకు వేలాడుతున్నాయని, వాటి గురించి విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 25 లోపు రైతులు ఈ-పంట నమోదు చేయించుకోవాలని, అధికంగా యూరియాను వినియోగించకుండా రైతులకు అవగాహన కలిగించాలని ప్రజా ప్రతినిధులను ఏవో లావణ్య కోరారు. తమ గ్రామంలో బోర్లు మరమ్మతులు చేయడంలేదని బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు సమావేశంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కొత్తగా ప్రభుత్వం సహకారంతో ఇళ్ల నిర్మించుకునేందుకు మండలంలో 827 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మరో రెండు నెలల్లో కొత్తగా ఇళ్లు మంజూరు అయ్యే అవకాశం ఉందని హౌసింగ్ ఏఈ రాహుల్ తెలిపారు. అదేవిదంగా మండలంలో ద్రోణాదుల, వలపర్ల హైస్కూల్స్‌లో స్కూల్‌కు అనుసంధానంగా ఇంటర్ ఏర్పాటు చేసినప్పటికీ వాటిలో విద్యార్థుల ప్రవేశాలు జరగలేదని ఎంఈవో వస్రాంనాయక్ తెలిపారు. గ్రామాలలో గాలి కుంటువ్యాధులకు పశువులకు టీకాలు వేస్తున్నట్లు మార్టూరు ఏడీఏ తెలిపారు. గ్రామాలలో రెండవ విడత ఎన్ఆర్ఈజీఎస్ కింద రెండవ విడత నిధులు మంజూరయ్యాయని, వాటితో సిమెంటురోడ్లు, సైడు కాల్వలు నిర్మాణం చేపడతామని పీఆర్ ఏఈ శాస్త్రి తెలిపారు. మండలంలో చెరువులు అన్నీ నిండాయని, నీటి కొరత లేదని, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ బ్రహ్మయ్య తెలిపారు. మహాపోషణ కార్యక్రమం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, ఉద్యానాధికారి బి హనుమంతనాయక్, ఏపీఎం లక్ష్మీనారాయణ,మార్టూరు ఈవో తన్నీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో వస్త్రంనాయక్

విద్యార్థులకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై అవగాహన

బల్లికురవ, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం బల్లికురవ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'పై మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో రమేష్‌బాబు మాట్లాడుతు విద్యార్థులు చెడు వ్యసనాలకు గురికాకుండా ప్రభుత్వం పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థులు కూడా ఎంతో జాగ్రత్తగా చెడు స్నేహాల బారిన పడకుండా ఉండాలన్నారు. ఎవరైన ఎక్కడైన ర్యాగింగ్ వంటి కార్యకలపాలకు గురిచేస్తే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబి, ఇన్‌చార్జ్ హెచ్ఎం డేవిడ్‌పాల్, మహిళ పోలీసు హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, రాజకుమారి, రాణి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

చినగంజాం : బాలికలను తప్పనిసరిగా చదవించాలని ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీవో జి.సులోచ నా రాణి , కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.సువ ాంజ లి లు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం అడవీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, స్థానిక కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని సీడీపీవో అన్నారు. ఆయా పాఠశాలలోని బాలికలకు బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవణా, వ్యక్తిగత పరిశుభ్రత, సైబర్ నేరాలు, లింగ సమానత్వం, పోషకాహారం తదితర విషయాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు అవగాహన కల్పించారు. బాలికా దిపోత్సవం సందర్భంగా బాలికలకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్.ఎం. ఆర్.శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కె.వాణిశ్రీ, ఎస్.సమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

బాలకృష్ణ కుంటలో అక్రమంగా మట్టి తవ్వకం

అధికారులు చూస్తుండగానే పట్టపగలు యథేచ్ఛగా తరలింపు

మార్టూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): అధికారులు అందరూ చూస్తుండగానే, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాల మీదగా చెరువు మట్టిని అక్రమంగా తరలించిన వైనం ఇది. మండల కాంప్లెక్స్ వద్ద ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు వెనుక ప్రాంతంలో బాలకృష్ణ కుంట ఉంది. అక్కడ నుంచి శుక్రవారం మధ్యాహ్నం అక్రమంగా చెరువు మట్టినితవ్వి తీసి అమ్ముకుంటున్నారు. చెరువులో ఏర్పాటు చేసిన ఎక్స్‌కవేటర్ ద్వారా మట్టిని ట్రాక్టర్లుకు లోడింగ్ చేసి గ్రామంలోకి తరలిస్తున్నారు. గ్రామంలోని పడమర బజారుకు చెందిన ఒకవ్యక్తి చెరువు నుంచి మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్నట్లు తెలిసింది. ఖాళీగా ఉన్న స్థలాలకు మేరవగా చెరువు మట్టిని వినియోగిస్తుంటారు. గ్రావెల్‌కు డిమాండు పెరగడంతో, తక్కువ ఖర్చుతో చెరువు మట్టితో ఖాళీ స్థలాలను నింపుతున్నారు.అయితే వర్షాలు కురుస్తుండటంతో చెరువు నుండి మట్టిని తరలించడం ఇబ్బందిగా మారింది. అందువలన బాలకృష్ణ కుంటలో ఖాళీగా ఉన్న ప్రదేశంలోని మట్టిని తీసి సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ చెరువునుండి అక్రమంగా మట్టిని తవ్వి అమ్ముకున్న వ్యక్తులు ఉన్నారు. వారిని ఆదర్శంగా తీసుకున్నారో ఏమో గాని ప్రస్తుతం కూడా అదే విధంగా ట్రాక్టర్ల యథేచ్ఛగా మట్టి విక్రయాలు సాగుతున్నాయి.



మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

నూతన జీఎస్‌టీ విధానంతో దేశ ప్రగతికి ఊతం

చినగంజాం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ 2.0 తగ్గించిన నేపథ్యంలో వస్తువుల కొనుగోలు శక్తి పెరగడంతో దేశం కూడా ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని జీఎస్టీ నోడల్ అధికారి, చీరాల డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కె.ధనలక్ష్మి అధ్యక్షతన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు మాటాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరికరాలు, ఫిషింగ్ నట్స్ కిరాణా ప్రొవిజన్స్, కంప్యూటర్లు, టీవీలు తదితర వస్తువులను ప్రదర్శనగా పెట్టి, వాటిపై జీఎస్టీ తగ్గిన విధానాన్ని ఆయా శాఖల అధికారులు వ్యాపారులు, రైతులు, డ్వాక్రా మహిళలకు వివరించారు. కార్యక్రమంలో చింతగుంపల్లె, సంతరావూరు పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు, యార్లగడ్డ లక్ష్మి, చినగంజాం, చింతగుంపల్లె, నీలాయపాలెం గ్రామ సర్పంచులు రాయని ఆత్మారావు, వై.సత్యనారాయణ, తూమాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కావూరి శారద, ఎఫ్‌డీవో ఎం.రవీంద్ర, ఏవో ఆర్.చంద్రశేఖర్, ఏపీఎం గడ్డె పెదసుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మీదేవి, టీడీపీ మండల నాయకులు, అంగాన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

అద్దంకిటౌన్ : వస్తువులపై జీఎస్టీ తగ్గింపు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వాణిజ్య పనులు శాఖ అధికారులు ఎం.వరలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు ఎస్‌జీఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తగ్గిన జీఎస్‌టీ తద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు భాగ్యరాజు, వి.దీప్తి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ ఉపకరణాల ధరల తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వక్తృత్వ పోటీలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని మణిదీపికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పంగులూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వక్తృత్వపు పోటీలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని మణిదీపిక ప్రతిభచాటి తృతీయ స్థానం సాధించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన బాపట్లలో 'సేవ్‌దిగర్ల్ అండ్ చైల్డ్' అనే అంశంపై జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీలో మణిదీపిక పాల్గొని ప్రతిభచాటారు. కలెక్టర్ చేతులమీదుగా బహుమతి అందుకున్న మణిదీపికను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు అభినందించారు.

రేషన్ పంపిణీలో సమస్యలను పరిష్కరించాలి

● ప్రజాప్రతినిధులు, డీలర్లతో అధికారుల సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్, పక్కన చైర్మన్ సాంబశివరావు

చీరాల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ సరుకుల పంపిణీలో ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. శుక్రవారం వార్డు ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా స్మార్ట్‌కార్డుల పంపిణీ, కార్డుదారుల మ్యాపింగ్ వంటి వాటిపై చర్చించారు. సాంకేతిక పరమైన సమస్యల్లో జాప్యత లేకుండా సాధ్యమైనంత మేరకు సకాలంలో పంపిణీలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

బాలికల రక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

● ఘనంగా అంతర్జాతీయ బాలికాదినోత్సవం



విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న హెచ్ఎం

ఈపూరుపాలెం(చీరాల), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికల రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీవో ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పోటీపరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ హనోరా, సూపర్‌వైజర్ ప్రసన్న కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు గ్రామంలో శనివారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. 11వ తేదీ ఉదయం 10గంటలకు కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి రవికుమార్ పాల్గొననున్నారు. 11 గంటలకు బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు, ఒంటిగంటకు సంతమాగులూరు మండలంలోని అడవిపాలెం గ్రామంలో మంత్రి గొట్టిపాటి పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నేడు అడవిపాలెంలో మంత్రి పర్యటన


సంతమాగులూరు : మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షులు గాడిపర్తి వెంకటరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన జరిగిన సమయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ అందుబాటులో లేకపోవడంతో వెంకట్రావు కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు. శుక్రవారం విదేశాల నుండి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అడివిపాలెం గ్రామంలోని గాడిపర్తి వెంకటరావు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు..

పంగులూరులో భారీ వర్షం

పంగులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పంగులూరు పరిసర గ్రామాలలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం 6 గంటల నుండి ఎడతెరపి లేకుండా ఉరుములతో కూడిన వర్షంతో రోడ్లన్ని జలమయమయ్యాయి. దీంతో కొద్ది గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. భారీ ఉరుముల మోతలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సంతనూతలపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో వైద్య చికిత్సలు చేయించుకున్న 37మంది లబ్ధిదారులకు రూ.17.20లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.



10 ఆసుపత్రుల్లో ఆగిన ఎన్టీఆర్ వైద్య సేవలు

నెల్లూరు (వైద్యం) అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ (ఆశా) పిలుపు మేరకు ఎన్టీఆర్ వైద్యసేవ కింద జిల్లాలోని ఎన్టీఆర్ నెట్‌వర్క్ ఆసుపత్రులలో శుక్రవారం వైద్య చికిత్సలు ఆగిపోయాయి. జిల్లాలో 32 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా 10 ఆసుపత్రులలో ఎన్టీఆర్ వైద్య సేవలు పూర్తిగా ఆగిపోయాయి. కాగా, ఎన్టీఆర్ వైద్య సేవలు ఆపేసిన ఆసుపత్రులకు వచ్చే రోగులను ఆ పథకం మిత్రాలు అందుబాటులో ఉన్న మరో నెట్‌వర్క్ ఆసుపత్రులకు వెళ్లేలా ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ సుధీర్‌కుమార్ చర్యలు తీసుకున్నారు.



గోశాలలో ఎడ్లను పరిశీలిస్తున్న చంద్రబాబు



సరస్వతీ నమస్తుభ్యం.. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో సీఎం





ప్లాంట్‌లో కార్మికులకు అభివాదం చేస్తూ..




ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

ఇప్పుడు కొన్ని త్వరలో మరిని..

- భారీగా నెల్లూరుకు ప్రాజెక్టులు
- వరంగా మూడు పోర్టులు, మూడు ఎయిర్‌పోర్టులు
- భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా నీటి నిల్వలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విశ్వ సముద్ర బయో ఇథనాల్ ప్లాంటు ప్రారంభించిన సీఎం
- విద్యార్థులతో ఆహ్లాదకరంగా ముచ్చటింపు





నెల్లూరు/వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి దిశగా నెల్లూరు జిల్లా దూసుకెళుతోందని, ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులతోపాటు త్వరలో అనేక ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేశారు. వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామంలో నిర్మించిన విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌తో పాటు చింతా శశిధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన నందగోకులం లైఫ్ స్కూల్, నంది పవర్ బుల్ (గోశాల) ప్రాజెక్టులను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు ప్రసగించారు. 'అద్భుతమైన సోమశిల, కండలేరు జలాశయాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. కండలేరు జలాశయాన్ని నిర్మించడంతోపాటు సోమశిల జలాశయం సామర్థ్యాన్ని పెంచిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుంది. ఈ రెండు జలాశయాల్లో దాదాపు 150 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఇంతటి అవకాశం మరే జిల్లాలోనూ లేదు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఈ రెండింటిలో నీటి నిల్వలు ఉంచుతాం. ఇప్పటికే కృష్ణపట్నం పోర్టు ఉండగా, మరోవైపు రామాయపట్నం పోర్టు నిర్మాణం జరుగుతోంది. త్వరలోనే దుగరాజపట్నం పోర్టు కూడా రాబోతోంది. అలానే చుట్టు పక్కల తిరుపతి, చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉండగా, త్వరలో దగదర్తి విమానాశ్రయం నిర్మాణం కాబోతోంది. ఓ వైపు జాతీయ రహదారుల కనెక్టివిటీ ఉండగా, మరోవైపు రైల్వే సౌకర్యం ఉంది. హైదరాబాద్-చెన్నై మధ్య బుల్లెట్ ట్రైన్ నిర్మాణానికి కేంద్రం సిద్ధమవుతోంది. రామాయపట్నంలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, సర్వేపల్లిలో క్రిబ్కో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు ఏర్పాటు కాబోతున్నాయి. ఇటువంటి నెల్లూరు జిల్లాలో విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నూకల ద్వారా బయో ఇథనాల్ తయారు చేసే ప్రక్రియలో రైతులకు మేలు చేయడమే కాక పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న చింతా శశిధర్‌ను ముఖ్యమంత్రి అభినందించారు.

● మూడు ప్రారంభోత్సవాలు

ఈదగాలి గ్రామంలో నందగోకులం లైఫ్ స్కూల్‌లోని నవనీతం బ్లాక్‌ను సీఎం ప్రారంభించి స్కూల్‌ను

- మిగతా 7లో..



విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, పాల్గొన్న ప్రముఖులు

విన్నపాలు వినవలె!

అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం సీఎంకు ప్రముఖుల అర్జీలు

8



ఊరిపోవద్దు!

ప్రమాదకరంగా మారుతున్న ఊబకాయం

అనేక వ్యాధులకు ఇది మరో కారణం

జిల్లా జనాభాలో 30 శాతం వీరే

నేడు ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినం

ఊబకాయం... అవసరానికి మించిన బరువు, అధిక కొవ్వు... ప్రసుతం ఎంతో మందిని వేధిస్తున్న సమస్య ఇది. చిన్న పిల్లలు మొదలు పెద్ద వారి వరకూ అందరూ భారీ కాయంతో అవస్థ పడుతున్నారు. కొందరు జన్యుపరమైన సమస్యలతో ఇలా మారుతున్నప్పటికీ ఎక్కువ మంది మాత్రం జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడి ఊబకాయాన్ని ఊబిలో కూరుకుపోతున్నారు. ఇతర ఎన్నో ఆరోగ్య సమస్యలకు ఇది హేతువై చిన్న వయసులోనే రోగగ్రస్తులుగా మారుస్తోంది. ఆహార నియమాలు, నియంత్రణ, వ్యాయామమే దీనికి పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు.

- సమగ్ర కథనం 8లో...

హౌసింగ్‌లో కదులుతున్న అక్రమార్కుల డొంక

తాజాగా తిరుపతి పీడీ దయాకర్ సస్పెన్షన్

హౌసింగ్ శాఖలో అక్రమాల పుట్ట బద్ధలవుతోంది. వైసీపీ హయాంలో సిమెంటు, స్టీలు పక్కదారి పట్టించడమేగాక ఇళ్లు స్టేజీ దాటకపోయినా కాంట్రాక్టర్లకు బిల్లులు కట్టబెట్టారు. ఈ వ్యవహారాల్లో ఇప్పటికే పలువురు ఏఈలు సస్పెండ్ అవగా తాజాగా ఓ ఉన్నతాధికారిపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుతం తిరుపతిలో ఇన్‌చార్జ్ హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న దయాకర్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- గతంలో నెల్లూరులో ఈఈగా పని చేసిన అధికారి
- నాడు రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- మరో 12 మంది కిందిస్థాయి అధికారులపై చర్యలకు సిఫార్సు

అమరావతి/నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా హౌసింగ్ హెడ్ (ఇన్‌చార్జి) పి.దయాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆయన గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో డిప్యూటీ ఈఈగా, ఈఈగా పనిచేసినప్పుడు కొండ్లపూడి, వెంకటేశ్వరపురం లే-అవుట్లలో అక్రమాలకు పాల్పడ్డారని, పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి స్టేట్ డీవియేషన్ల ద్వారా అదనపు చెల్లింపులకు సిఫార్సులు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడి, హౌసింగ్ కార్పొరేషన్ ఖజానాకు రూ.కోట్లలో నష్టం కల్గించారని, ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణలో కూడా విఫలమైనట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. దీంతో దయాకర్‌పై సస్పెండ్ చేస్తూ రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దయాకర్‌తోపాటు లే అవుట్లలో అవినీతి కార్యకలాపాల్లో భాగస్వాములైన అసిస్టెంట్ ఇంజినీరు పసుపులేటి సురేష్‌కుమార్ (రిటైర్డ్), గొల్లపూడి రామకృష్ణ (రాపూరు), ఎ.నాగరాజు (అప్పటి డివిజన్ హెడ్-రిటైర్డ్), ఎం.వెంకటమోహనరావు (ప్రస్తుత నెల్లూరు డివిజన్ హెడ్), పల్లా వెంకటదాసు (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్ - కర్నూలు జిల్లాలో పదవీ విరమణ చేశారు), పరవస్తు నరసింహం (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్-రిటైర్డ్), తోట వెంకటశేషయ్య (అప్పటి నెల్లూరు డివిజన్ హెడ్), మొహమ్మద్ జహీరుద్దీన్ అహ్మద్ (ప్రస్తుతం సర్వేపల్లి రూరల్ సబ్ డివిజన్ డీఈఈ), పఠాన్ అహ్మద్‌బాషా, (రిటైర్డ్ ఏఈ), తాళ్లూరు భాస్కరరావు (ప్రస్తుతం మనుబోలు మండల ఏఈ), ఎం.మధుసూదనరావు (అప్పటి ఏఈ-ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు), ఎం.కృష్ణారెడ్డి (రిటైర్డ్ ఏఈ)లపై శాఖాపరమైన విచారణ నిర్వహించి, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు వారి నుంచి అదనపు చెల్లింపుల మొత్తాన్ని తిరిగి రాబట్టడానికి చర్యలు తీసుకోవాలంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని ఆదేశిస్తూ లేఖ రాశారు.



● దయాకర్ లీలలు ఇవీ..

గతంలో దయాకర్ నెల్లూరులో డీఈగా పనిచేస్తూ ఇన్‌చార్జ్ ఈఈగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కొందరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారికి ఇష్టానుసారం బిల్లులు చెల్లించారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2022లోనే హౌసింగ్ విజిలెన్స్ విభాగం కొండ్లపూడి గోదాములో తనిఖీలు చేపట్టగా భారీగా సిమెంటు, స్టీలు పక్కదారి పట్టినట్లు గుర్తించింది. ఈ ఒక్క వ్యవహారంలోనే దయాకర్ మూలంగా రూ.150 కోట్ల వరకూ ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమైందని విజిలెన్స్ విభాగం నివేదిక ఇచ్చింది. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆ తర్వాత మరికొన్ని ఫిర్యాదులు కూడా రాష్ట్ర హౌసింగ్ కార్యాలయానికి అందినా అవన్నీ బుట్టదాఖలయ్యాయి. అయితే ఇటీవల ఈ ఫిర్యాదులపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. గత నెలలో రాష్ట్రస్థాయి అధికారులు విచారించి నివేదిక అందజేయడంతో దయాకర్‌పై వేటు వేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

రూపాయి చెల్లించకుండానే రూ.లక్షల్లో పరిహారం

● గ్యాస్ సిలిండర్ ప్రమాదం జరిగితే ఇంటిల్లిపాదికీ బీమా



నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒక్క రూపాయి చెల్లించకుండానే అనుకోని ప్రమాదం జరిగినప్పుడు గ్యాస్ వినియోగదారులు రూ.30 లక్షల వరకు పరిహారం పొందవచ్చు. అయితే, జిల్లా పౌరసరఫరాల శాఖ, గ్యాస్ కంపెనీల నిర్వాహకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవటంతో పరిహారం పొందలేక ఎందరో బాధితులు నష్టపోతున్నారు. వంట గ్యాస్ ప్రతి ఇంటా తప్పనిసరి అయ్యింది. అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగిన ఆస్తినష్టంతోపాటు ప్రాణాలూ కోల్పోవచ్చు. గ్యాస్ సిలిండర్ ప్రమాదాలు జరిగినప్పుడు ఆయిల్ కంపెనీలు తీసుకునే పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా బాధితులకు పరిహారం అందుతుంది. వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నప్పుడు పబ్లిక్ లయబిలిటీ ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా ఈ బీమా వర్తిస్తుంది.

● పరిహారం పొందాలంటే..

గ్యాస్ సిలిండర్ ప్రమాదం చోటు చేసుకున్న వెంటనే సమీప పోలీసు స్టేషన్, ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారం అందించాలి. వారు వచ్చి విచారిస్తారు. సిలిండర్ పేలడంతో ప్రమాదం సంభవించినట్లు నిర్ధారిస్తే సంబంధిత డిస్ట్రిబ్యూటర్ ఆయిల్ కంపెనీకి, బీమా సంస్థలకు విషయం తెలియచేస్తారు. పరిహారం పొందేందుకు మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం నివేదిక, వైద్య బిల్లులు, రశీదులు ఇవ్వాల్సి ఉంటుంది.

● పరిహారం ఇలా..

సిలిండర్ ప్రమాదం సంభవించి ఆస్తి నష్టం వాటిల్లితే రూ.2 లక్షల వరకు బీమా పొందవచ్చు. అలాగే, గాయపడిన ఒక్కో సభ్యుడికి రూ.2 లక్షలు, తక్షణ సాయం కింద రూ.25 వేలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.6 లక్షలు పరిహారంగా వస్తుంది. ఇలా కుటుంబ మొత్తానికి గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు బీమా వర్తిస్తుంది.

అక్రమ మ్యుటేషన్లపై ప్రభుత్వం సీరియస్

● పలువురు తహసీల్దార్లపై చార్జ్‌స్ ఫ్రేమ్

నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మ్యుటేషన్లు చేసిన వ్యవహారాలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. చేజర్ల మండలంలో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ మ్యుటేషన్లపై విచారణకు ఆదేశించింది. ఇందుకు బాధ్యులైన అప్పటి తహసీల్దార్లపై చార్జ్‌స్ ఫ్రేమ్ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 జూలై తర్వాత చేజర్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇష్టానుసారం మ్యుటేషన్లు జరిగాయి. కొందరు తహసీల్దార్లు ప్రభుత్వ భూములను కూడా మరొకరి పేర్లపైకి ఎక్కించి ధారాదత్తం చేశారు. పెళ్లూరు, నెర్నూరు, పాడేరు, చిత్తలూరు గ్రామాల్లో జరిగిన వ్యవహారాలపై అప్పట్లోనే ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక పంపారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం.. అక్రమ మ్యుటేషన్లు చేసిన అధికారులపై చర్యలకు పూనుకుంది. అప్పట్లో పనిచేసిన తహసీల్దార్లు ఎంవీకే సుధాకర్‌రావు (ప్రస్తుతం రిటైర్డ్), ఎం శ్యాంసుందరరాజ (ప్రస్తుతం రిటైర్డ్), బీ శివకృష్ణయ్య (ప్రస్తుతం పొదలకూరు తహసీల్దార్), ఎస్ చంద్రశేఖర్ (ప్రస్తుతం గూడూరు తహసీల్దార్)లతో పాటు వీఆర్వో కొమ్మి రాజాలపై ఆర్టికల్ ఆఫ్ చార్జ్‌స్ ఫ్రేమ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పది రోజుల్లో ఈ అధికారులు తమ సంజాయిషీను సమర్పించాలని, లేని పక్షంలో అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవితఖైదు

నెల్లూరు (లీగల్)/సూళ్లూరుపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో 2019 నాటి గ్యాంగ్ రేప్ కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ శుక్రవారం తీర్పు చెప్పారు. సూళ్లూరుపేట బొగ్గుల కాలనీకి చెందిన తిరువళ్లూరు నవీన్‌కుమార్, సాయి నగర్‌కు చెందిన కేకుల దేవకు జీవిత ఖైదుతో పాటు నగదు దోపిడీకి పాల్పడినందుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. శ్రీసిటీలోని ఒక పరిశ్రమంలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన యువతి, కాకినాడకు చెందిన యువకుడు ప్రేమించుకుంటున్నారు. 2019, ఫిబ్రవరి 3న రాత్రి 10:30 గంటల సమయంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ చివర్లో కూర్చొని పెళ్లి విషయమై మాట్లాడుకొంటున్నారు. అదే సమయంలో నలుగురు యువకులు అతడిపై దాడిచేసి నగదు లాక్కున్నారు. ఆ యువతిని కాస్త దూరం లాక్కెళ్లి గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. మళ్లీ ఆమెను తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేసి పరారయ్యారు. అప్పట్లో ఈ గ్యాంగ్‌రేప్ సూళ్లూరుపేటలో సంచలనం రేపింది. అప్పటి సీఐ కిషోర్ బాబు, పోలీసులు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుత సీఐ మురళీకృష్ణ, కోర్ట్ లైజన్ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కే.ఖాజాహుస్సేన్ సాక్ష్యాలను సరైన సమయంలో సమర్పించి నేరం రుజువ్వడానికి కృషి చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై అత్యాచారం, వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఫీ మాలిక్ వాదనలు వినిపించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	113
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 540

విత్తన తయారీ, ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీలు

కావలి రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని విత్తన తయారీ, ఎరువుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మండల వ్యవసాయాధికారిణి లలిత మాట్లాడుతూ రబీ సీజన్ ప్రారంభం అవుతున్నందున నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. 53 వరి విత్తన నమూనాలను సేకరించి నాణ్యతా ప్రమాణాల పరీక్షకు పంపించారు. సిరి సీడ్స్, నాగార్జున సీడ్స్ విత్తన తయారీ కేంద్రాల్లో రికార్డులు తనిఖీ చేశారు. సీఐ ఎస్‌కే సుభానీ, విజిలెన్స్ ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ

లింగసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం వైసీపీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరెడ్డి వైసీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, వీ వెంకటేశ్వర్లు, సర్పంచులు మల్లికార్జున, ఒంటేల శ్రీనివాసులు, మాజీ సర్పంచు సీహెచ్ శ్రీనివాసులు, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలిగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణ పరిధిలో శనివారం ఉదయం 9నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్, మరమ్మతుల దృష్ట్యా విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాఠశాలల తనిఖీ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈవో-1 రవికుమార్

కొండాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ ఆదర్శ ప్రాథమిక, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో-1 కే రవికుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల సమగ్ర వివరాలను రికార్డులలో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు.

సీజేఐపై దాడి యత్నం కేసులో రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

కావలి (టౌన్) అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి కేసులో రాష్ట్రపతి జోక్యం చేసుకుని మతోన్మాది రాకేశ్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్ళూరు మాల్యాద్రి మాట్లాడుతూ దేశంలో మతోన్మాదులు రాజ్యాంగాన్ని లెక్కచెయ్యడం లేదని, సుప్రీం కోర్టులో ఏకంగా ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడం మతోన్మాదానికి పరాకాష్ట అన్నారు. కార్యక్రమంలో నేతలు రాధాకృష్ణ, సాయిరామ్‌సింగ్, శ్రీనివాసులు, జాన్, మధు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నేతలు

బీసీ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

అల్లూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అల్లూరులోని మహాత్మ జ్యోతిబాఫూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను అల్లూరు ఎంపీడీవో రజనీకాంత్ శుక్రవారం తనిఖీ చేశారు. గత వారం రోజులుగా ఉపాధ్యాయురాలి తొలగింపు విషయమై నెలకొన్న వివాదం నేపథ్యం లో విద్యార్థులు నిరసనకు దిగే పరిస్థితి నెలకొనడంతో ఎంపీడీవో పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎల్ ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌డీవోగా పాండు రంగారావు

● ఖోఖో కోచ్‌గా ఆర్‌కే యతిరాజ్



పాండురంగారావు

నెల్లూరు(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో)గా ఫుట్‌బాల్ కోచ్ ఎం.పాండురంగా రావును నియమిస్తూ శాప్ ఎండీ ఎస్.భరణి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాల డీఎస్‌డీవోల బదిలీల్లో భాగంగా నెల్లూరు డీఎస్ఏలో సీనియర్ ఫుట్‌బాల్ కోచ్‌గా విధులు నిర్వహిస్తున్న పాండురంగారావుకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఎస్‌డీవోగా నియమించారు. ప్రస్తుతం డీఎస్‌డీవోగా పని చేస్తున్న ఆర్‌కే.యతిరాజ్ త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయనను నెల్లూరు డీఎస్ఏలోనే ఖోఖో కోచ్‌గా నియమించారు. గతంలో డీఎస్‌డీవోగా పనిచేసిన అనుభవంతోపాటు జిల్లాలో పాండు రంగారావు సీనియర్ కావడంతో ఆయనను జిల్లా అధికారిగా నియమించారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు!



కావలి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా రోడ్లపై గుంతలు ఉండకూడదని, ఎక్కడైనా ఉంటే మరమ్మతులు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల అధికారులను ఆదేశించారు. అయితే ఎక్కడో మారుమూల గ్రామాలలో ఉన్న గుంతలు సరే... కావలిపట్టణ నడిబొడ్డున ఉన్న గుంతల సంగతేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఆర్వోబీ వంతెనకు ఉత్తరం వైపున ఉన్న రోడ్డు గుంతలమయమైంది. ఏరియా వైద్యశాల నుంచి రైల్వేరోడ్డు మలుపు వరకు ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రంకు రోడ్డు నుంచి ప్రభుత్వ వైద్యశాల మధ్య వరకు సుమారు రూ.50 లక్షలతో విశాలంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే అక్కడ నుంచి మిగిలిన రోడ్డును పట్టించుకోక పోవటంతో గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహన చోదకులు, ప్రజలు భయపడుతున్నారు. దీంతో రోడ్డు ప్రారంభంలో వేసిన సీసీ రోడ్డు మాత్రం ఆటోలకు పార్కింగ్ ప్రదేశంగా మారింది. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో అత్యంత రద్దీగా ఉన్న ఈ రోడ్డులో సీసీ రోడ్డు వేయటం ఆలస్యమైనా కనీసం రోడ్డు మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవినీతి సహించం

● జలదంకి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు అప్పలనాయుడు

జలదంకి, అక్టోబర్ 10 (ఆంధ్ర జ్యోతి): ఆరుగాలం కష్టపడే రైతులకే ప్రభుత్వ మద్దతు ధర దక్కాలని, అలాకాకుండా దళారీలకు మేలు చేకూర్చేలా అవినీతికి పాల్పడితే సహించేది లేదని జలదంకి పీఏసీ ఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలనాయుడు సిబ్బందిని హెచ్చరించారు. జలదంకిలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో అప్పలనాయుడు మాట్లాడారు. బ్రాహ్మణక్రాక పీఏసీ కేంద్రంలో ధాన్యం గోతాలు మాయం చేసిన సొసైటీ సెక్రటరీ పంతగాని ప్రవీణ్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. మండలంలో ధాన్యం పండించిన రైతులకు రోజువారీ 5 వేల గోతాలు కేటాయిస్తే, వాటిని బోగోలు మండలం తాళ్ళూరు వీఏఏ ప్రతాప్‌నకు బ్రాహ్మణక్రాక పీఏసీ కేంద్రం నుండి ఎలా చేరవేస్తారని ఆయన ప్రశ్నించారు. రైతులకు అందాల్సిన గోతాలను పక్కదారి పట్టించడం మంచి పద్ధతి కాదన్నారు. మండలంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషితో జలదంకి, బ్రాహ్మణక్రాక గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు జలదంకి సొసైటీ తరపున ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. దళారుల ప్రమేయం లేకుండా ఈ రెండు కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు అప్పలనాయుడు

ముమ్మరంగా మంచినీటి పథకం మరమ్మతు పనులు



రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్

లింగసముద్రం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకానికి చెందిన పెంట్రాలలో ఉన్న ట్రీట్‌మెంటు ప్లాంటులో మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ మంచినీటి పథకం నుండి కలుషిత నీరు వస్తుండడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గత బుధవారం నుంచి మంచినీటి సరఫరా నిలిపి వేసి ప్లాంటులో మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ కారణంగా ఈనెల 13వ తేదీ వరకు మంచినీటి సరఫరాను 48 గ్రామాలకు నిలిపి వేశారు. శుక్రవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సీహెచ్ రాజశేఖర్ వాటర్ ప్లాంటులో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్‌కు చెందిన 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.10 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టినట్టు తెలిపారు. వీలైనంత వరకు ఈ మరమ్మతు పనులు ఈనెల 13కు పూర్తి చేసి 14వ తేదీన మంచినీటి సరఫరాను పునరుద్ధరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన చంద్రన్న

కావలి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేద, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కావలిలో ఆయన నివాసంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. తెలుగువారి గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేశాన్నారు. టెక్నాలజీకి పునాదులు వేసిన చంద్రబాబు సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా సేవలందిస్తుండడం అభినందనీయమన్నారు. దూరదృష్టి కలిగిన అగ్రశ్రేణి నాయకుడి సారథ్యంలో పనిచేయటం తనకెంతో గర్వంగా ఉందని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజల తరఫున ముఖ్యమంత్రికి ఆయన అభినందనలు తెలిపారు.

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన అవసరం

ఉలవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే రమాదేవి సూచించారు. శుక్రవారం రామాయపట్నం హైస్కూల్‌లో పోషణ్ మహాలో భాగంగా కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, బాల్య వివాహాలు, పోషక విలువలు, ఆరోగ్య భద్రత, ఉన్నత విద్యాభ్యాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీజి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు ప్రసన్న, లక్ష్మీ, మరియమ్మ, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

సోమశిలకు 12,319 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 13,319 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో 72.411 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పవర్ టన్నెల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 50, కండలేరుకు వరద కాలువ ద్వారా 3,800 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం (ఆంధ్రజ్యోతి) : సంగం బ్యారేజీ వద్ద శుక్రవారం నీటి ప్రవాహం తగ్గింది. దీంతో నీటిమట్టం 10 అడుగుల నుంచి 9.3 అడుగలకు తగ్గింది. ఇక్కడ నుంచి నెల్లూరు బ్యారేజీకి 12వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



సంగం బ్యారేజీ వద్ద దిగువకు పారుతున్న పెన్నా జలాలు

మత్స్యకారుల సహకారంతో తీరప్రాంత భద్రత పటిష్టం

● మెరైన్ సీఐ శివన్నారాయణ



తీరప్రాంత భద్రతపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ శివన్నారాయణ

ఉలవపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సహకారంతో తీర ప్రాంత గ్రామాల్లో భద్రత పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు రామాయపట్నం మెరైన్ సీఐ జీ శివన్నారాయణ అన్నారు. శుక్రవారం చాకిచర్ల చిన్నపట్టపుపాలెంలో సముద్ర తీరం భద్రతపై మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. సముద్ర మార్గాన మన దేశంలోకి ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా చేయడంలో, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంలో మత్స్యకారుల సహకారం అవసరమన్నారు. అలాగే తీరప్రాంతం వెంబడి తాటిచెట్లు పెంపకం, వాటివలన ఉపయోగాలు, ఆలివ్ రిడ్లీ తాబేళ్ల ప్రాముఖ్యత, వాటి సంసరక్షణపై అవగాహన కలిగించారు. అదేవిధంగా వేట సమయంలో సముద్రంలో కొత్తవ్యక్తులు, బోట్లు కనిపించిన వెంటనే కోస్టల్ సెక్యూరిటీ టోల్‌ఫ్రీ నెంబరు 1093కి, కోస్టుగార్డు టోల్‌ఫ్రీ నెంబరు 1554కి వెంటనే సమాచారం అందించాలన్నారు. కడలూరు బోట్ల సమస్య గురించి మత్స్యకారులు ఈ సందర్భంగా ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్సై ఈశ్వరయ్య, ఎఫ్‌డీవో లక్ష్మణ్ నాయక్, ఎఫ్ఎస్‌వో బ్రహ్మనాయుడు, ఆర్ఐ ప్రభావతి, రామాయపట్నం పోర్టు ఏఈఈ శ్యామ్ ప్రసాద్, వీఆర్వో మోహన్‌రావు, సచివాలయం సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఖతర్‌లో ముస్లిం యువతకు ఉద్యోగావకాశాలు : ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ ముస్లిం మైనారిటీ యువతకు రాష్ట్రప్రభుత్వం తరపున ఖతర్ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఏపీ ద్వారా దోహలో హోమ్‌కేర్‌నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. అర్హులైన యువతీ యువకులు రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యం లింక్ ద్వారా ఈనెల 12లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సకాలంలో రిజిస్టర్ చేసుకోలేనివారు 13న ఉదయం 10 గంటలకు విజయవాడలోని గవర్నమెంటు ఐటీఐ క్యాంపస్‌లో ఓఎంసీఏపీ కార్యాలయంలో హాజరైనా సరిపోతుందని ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు

కందుకూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపడమే గాక రైతుబిడ్డలను ఐటీ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా పదిహేనేళ్ల కాలాన్ని చంద్రబాబు నాయుడు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఎమ్మెల్యే ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రప్రజల అభ్యున్నతి, యువత భవిష్యత్తు కోసం ఆయన నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, విద్య, వ్యవసాయం అన్నిరంగాల్లో రాష్ట్రం ప్రగతిపథంలో పరుగులు తీయటానికి కారణమైన వ్యక్తి చంద్రబాబునాయుడు అని, ఆయన సాన్నిధ్యంలో పనిచేయటం గర్వకారణంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులిస్తున్న చంద్రబాబుకు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

పోలేరమ్మ ఆలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

బిట్రగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో పోలేరమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యుల సహకారంతో శుక్రవారం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని వ్యక్తులు ఇటీవల గ్రీస్ పూసిన సంఘటనపై కావలి రూరల్ సీఐ పాపారావు, ఎస్ఐ ప్రభాకర్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగానే ఆలయాల ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు స్థానికులను హెచ్చరిస్తున్నారు.

నేరాలకు కేరాఫ్ నెల్లూరు!

- బీహార్‌ను తలపించేలా ఘటనలు
- నగదు కోసం కిరాతకంగా హత్యలు
- రాత్రి ఏడు దాటితే రోడ్లపై తిరగాలంటే భయం
- పోలీసులకు సవాళ్లు విసురుతున్న పాత నేరస్థులు
- నిద్రపోతున్న నిఘా నేత్రాలు
- పాత నేరస్థులపై దృష్టి సారించే వారేరీ?
- వెలుగులోకి వస్తున్నవి కొన్నే.. చీకట్లో మరెన్నో..
- నెల రోజుల్లోనే మళ్లీ జంట హత్యలు



ఈ నెల 7న హత్యకు గురైన వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు జిల్లా కొన్నేళ్లుగా నేరాలకు అడ్డాగా మారింది. బీహార్ వంటి రాష్ట్రాలకు పరిమితమైన కత్తులతో బెదిరించి దోపిడీలు చేసే కల్చర్ నెల్లూరులో ప్రారంభమైంది. ఒంటరిగా వెళ్లే ప్రజలను లక్ష్యంగా చేసుకొని మార్గమధ్యలో అడ్డగించి దోపిడీలకు పాల్పడుతున్నారు. వారు నగదు ఇవ్వను అంటే విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేస్తున్నారు. నగరంలో వరుసగా జరుగుతున్న ఇలాంటి సంఘటనలు ప్రజలను భయాందోలనలకు గురి చేస్తున్నాయి. ఈనెల 6వ తేదీ రాత్రి పెన్నా బేరేజ్ సమీపంలో జరిగిన జంట హత్యలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. పలువురు యువకులు మత్తులో కత్తులను బైక్‌లలో, ఫ్యాంట్ జేబుల్లో, బొడ్డులో, వీపు వెనుక ఫ్యాంట్‌లో, దాచుకొని తిరుగుతూ ప్రజలకు వాటిని చూపి నగదు ఇవ్వాలంటూ బెదిరిస్తూ దోచుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లాలో లేడీ డాన్ అరుణ, రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించిన తర్వాత పోలీసులు రౌడీ మూకలపై లాఠీ ఝులిపించారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో రౌడీ షీటర్లు పలు కేసుల్లో జైలుకు పోవడం, నిరంతర తనిఖీలు చేయడంతో కొంత కాలం నేరాలు కట్టడిలోకి వచ్చాయి. అయితే నగరంలో నగదు కోసం జరిగిన జంట హత్యలు సంచలనంగా మారడంతో ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. మనం నెల్లూరులో ఉన్నామా... బీహార్ వంటి ప్రాంతాల్లో ఉన్నామా అని చర్చించుకుంటున్నారు. ఏడాది కాలంలో పలు కారణాల వల్ల పదుల సంఖ్యలో హత్యలు జరిగాయి. ప్రధానంగా నగరంలో గడిచిన ఏడు నెలల కాలవ్యవధిలో 20కి పైగా హత్యలు జరిగాయి. కత్తులను చూపించి బెదిరించడం ఫ్యాషన్‌గా మారిపోయింది. ప్రేమికులు, ఫూట్‌గా మద్యం సేవించిన వారు, ఎస్-2 రోడ్డులో హిజ్రాల వద్దకు వెళ్లేవారు, లాడ్జీల నుంచి బయటకు వచ్చే వారు, అర్ధరాత్రి మద్యం సేవించి వెళ్లే మందుబాబు లను మాత్రమే టార్గెట్ చేస్తూ కత్తులను చూపించి కొందరు దొరికిన వరకు దోచేస్తున్నారు. ఈ విషయాలను బాధితులు బయటకు చెప్పు కునేందుకు, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేస్తే పరువు పోతుందన్న భావనతో ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాకపోవడంతో అనేక సంఘటనలు చీకటిలోనే ఉండిపోతున్నాయి.

● కత్తులతో తిరగడం నగరంలో స్టైల్

ప్రస్తుతం నగరం నేరాలకు అడ్డాగా మారింది. ఈ క్రమంలోనే యు వత, నేర చరిత్ర కలిగిన వారు ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో తల్లిదండ్రులకు వెళ్లి వస్తామని చెప్తారో లేదో తెలియదు కాని తాము ఇష్టంగా కొనుగోలు చేసిన కత్తులను మాత్రం తమ వెంట తీసుకురావడం మరవడం లేదు. చిన్నచిన్న గొడవలకు కత్తులను బయటకు తీసి వేసేస్తా అంటూ బూతులు తిడుతూ తగ్గేదేలా అంటూ సినిమా డైలాగ్‌లు కొడుతున్నారు. ఇటీవల కాలంలో నగరంలో వరుసగా జరుగుతున్న సంఘటనలతో ప్రజలు ఒంటరిగా వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు.

● నిఘా నిద్రపోతుండటంతో..

పోలీసు నిఘా నిద్ర పోతుండటంతో వరుస నేరాలను జరుగుతు న్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు స్టేషన్‌లలో ఉన్న క్రైమ్ పార్టీలు ఆయా స్టేషన్‌లలో ఏళ్ల తరబడి పాతుకు పోవడంతో నేరస్థులకు అండగా ఉండటంతో పలుమార్లు నేరాలకు పాల్పడుతున్న పాత నేరస్థులపై నిఘా ఉంచడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణ లు ఉన్నాయి. ఇక రాత్రి పూట బీట్ సైరన్‌లకే పరిమితం అవుతోందని, నాయకుల సిఫార్సులతో నేరాలకు పాల్పడుతున్న వారిని పోలీసులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో హత్యలతో పాటు మోసాలు, స్కామ్‌లు, ఇలా చెప్పుకుంటూ పోతే నేరాలకు అడ్డా అన్న పేరు వచ్చేసింది. ఈ క్రమంలో నేరాల కట్టడికి కొత్తగా వచ్చిన ఎస్పీ ఇప్పటి వరకు ప్రత్యేక కార్యాచరణ చూపక పోవడం ప్రజలను భయాందోళలకు గురిచేస్తోంది.

త్వరలో మరిన్ని..

(5వ పేజీ తరువాయి)

సందర్శించారు. తొలుత సరస్వతీ దేవి విగ్రహం వద్ద విద్యార్థుల ప్రార్థనల్లో సీఎం పాల్గొన్నారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల కంప్యూటర్ నైపుణ్యాన్ని, విద్యార్థుల మ్యాథ్స్, సైన్స్ ప్రదర్శనలను స్వయంగా పరిశీలించి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా వారు సమాధానం చెప్పడంతో ఎక్సలెంట్ అంటూ పొగిడారు. ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని నడుచుకోవాలని సూచించారు. పిల్లల్లో మంచి ఆత్మవిశ్వాసాన్ని, ఒక నమ్మకాన్ని కల్పిస్తున్న చింతా శశిధర్ ఫౌండేషన్‌ను ఈ సందర్భంగా ప్రశంసించారు. విద్యార్థులందరికీ 'ఆల్ ద బెస్ట్' అని చెప్పి అక్కడ నుంచి బయలుదేరి పక్కనే ఉన్న నంది పవర్ ట్రెడ్ మిల్ మిషనరీని, గోశాలను ప్రారంభించారు.. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎడ్ల సంతతి, వాటి జాతుల గురించి నిర్వాహకులు సీఎంకు వివరించారు. ఎడ్ల నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్ (నంది పవర్ బుల్ ప్రాజెక్టు)ను ఆసక్తిగా సీఎం తిలకించారు. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించి సందర్శించారు. అక్కడి నుంచి సభ ప్రాంగణానికి చేరుకుని మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు చింతా శశిధర్ ఫౌండేషన్ చైర్మన్ చింతా శశిధర్ స్వయంగా జ్ఞాపికను అందజేశారు.



నందగోకులం లైఫ్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

నమ్మండి... ఇవి సిమెంట్ రోడ్లేనండి!



నాగుల బావివీధిలో కంకర తేలిన సిమెంట్ రోడ్డు

ఉదయగిరి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో కనిపిస్తున్నవి సిమెంట్ రోడ్లే !. ఉదయగిరి పట్టణంలో ఏ వీధి చూసినా ఇలా గుంతలుపడ్డ, కంకర తేలిన, కుంగిన, మట్టిలో కలిసిన సిమెంటు రోడ్లే దర్శనమిస్తున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు కావడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ రహదారులపై రాకపోకలు సాగించేందుకు పాదాచారులే కాదు.. వాహనదారులూ ఇబ్బందిపడుతున్నారు. దీనికితోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ రహదారులు మరింత ఛిద్రమై, వాటిపై రాకపోకలు సాగించలేక పట్టణ వాసులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. రోడ్ల దుస్థితి, ప్రజల బాధలను గమనించిన పాలకులు, అధికారులు పల్లెపండుగ-2 కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి పట్టణంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.1.75 కోట్లు మంజూరు చేశారు. అయితే పనులు ఇంకా ప్రారంభం కాలేదు. పల్లెపండుగ-1 కార్యక్రమానికి సంబంధించి 40 శాతం బిల్లులు పెండింగ్‌లో ఉండడం, మరలా రెండో విడత సిమెంట్ రోడ్లు మంజూరు కావడంతో పనులు చేస్తే బిల్లులు ఎప్పుడు వస్తాయోనన్న ఆలోచనతో కాంట్రాక్టర్లు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం.



సినిమా హాలు వీధిలోని ఈ రహదారిపై నడక నరకమే!

ఊరిపోవద్దు!

- ప్రమాదకరంగా మారుతున్న ఊబకాయం
- అనేక వ్యాధులకు ఇది మరో కారణం
- జిల్లా జనాభాలో 30 శాతం భారీ కాయులే!
- చిన్నారుల్లోనూ ఆందోళన కలిగిస్తున్న వైనం
- ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌ను దూరం పెట్టాలి

- నేడు ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినం


నెల్లూరు (వైద్యం), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితిలో ఊబకాయం ప్రమాదకరంగా మారుతోంది. ప్రాణాంతకమైన గుండె వ్యాధులకు సైతం ఇది కూడా కారణమవుతోంది. అధిక పొట్ట - రోగాల పుట్ట అన్న వైద్యుల మాట అక్షర సత్యాలవుతున్నాయి. ఆధునిక జీవన విధానంలో ఆహార అలవాట్లు మారుతుండటంతో ఊబకాయం (ఒబేసిటీ) సమస్య ఎంతో మందిని వేధిస్తోంది. శారీరక వ్యాయామం లేకపోవడం దీనికి మరో కారణం. పెద్దలతోపాటు చిన్నారులు కూడా ఊబకాయం బారి నపడుతుండటం ఆందోళన కలిగించే అంశం. దీనిని నిర్లక్ష్యం చేస్తే ఎన్నో వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా అక్టోబరు 11వ తేదీని ప్రపంచ ఊబకాయ వ్యతిరేక దినం జరుపుకోవాలని తీర్మానించింది. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చింది.

● జిల్లాలో 30 శాతం

జిల్లా జనాభా సుమారు 27 లక్షలుకాగా అందులో 30 శాతం ఊబకాయులు ఉన్నట్లు అంచనా. వీరిలోనూ 50 శాతం మంది ఉన్నత వర్గాలకు చెందిన మహిళలేనని అధ్యయనం చెబుతోంది. అలాగే, అన్ని వర్గాల పురుషులలో 30 శాతం, చిన్న పిల్లల్లోనూ 20 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. నెయ్యి, డాల్డా, నూనె కలిసిన ఆహార పదార్థాలు ఎక్కువగా తినటంతో రక్తంలో కొవ్వు శాతం పెరిగి ఊబకాయానికి దారితీస్తోంది. బాధితుల్లో 40 శాతం మంది గుండెపోటుకు గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు వీరిని పట్టిపీడిస్తున్నాయి. తక్షణం మేల్కొని జీవనశైలిని మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

● చిన్నారుల్లో సైతం...

గతంలో నారాయణ సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం, వైద్య కళాశాల విద్యార్థులు నెల్లూరు నగరంలోని పలు కార్పొరేట్ పాఠశాలల్లో 8 నుంచి 16 ఏళ్ల వయసున్న విద్యార్థులపై సర్వే చేశారు. ఈ సర్వేలో 850 మందిని పరిశీలించగా వారిలో 220 మంది అంటే 25 శాతం పిల్లలు ఊబకాయ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. జన్యుపరమైన సమస్యలు, థైరాయిడ్ సమస్యతో కొందరు ఊబకాయులుగా మారుతున్నప్పటికీ గత పదేళ్లలో మారుతున్న ఆహార అలవాట్లు, ఇతరత్రా కారణాల వల్ల ఎక్కువ మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. చదువులో పోటీతత్వం పెరగటం, వ్యాయామంపై శ్రద్ధ పెట్టకపోవడంతో బడి ఈడు పిల్లలు ఈ వ్యాధికి గురవుతున్నారు. జంక్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ ఫుడ్, హోటళ్లలో, రోడ్డు పక్కన లభించే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్య ఎదురవుతోందని వైద్యులు చెబుతున్నారు. ఆహార నియంత్రణ, నిత్యం వ్యాయామంతో దీనిని అదుపు చేయవచ్చని సూచిస్తున్నారు. అలాగే, ఒబేసిటీ సమస్య పరిష్కారానికి బేరియాట్రిక్ శస్త్ర చికిత్స, ఖరీదైన లైపోసెక్షన్ చికిత్స అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు.



ఆధునిక బేరియాట్రిక్ శస్త్రచికిత్స



ఆధునికి బేరియాట్రిక్ శస్త్రచికిత్స అందుబాటులో ఉంది. ఇది చేయించుకుంటే భవిష్యత్తులో ఊబకాయం సమస్య ఉండదు. పైగా గుండె జబ్బులు, మధుమేహం, పక్షవాతం వంటి వ్యాధుల నుంచి ఉపశమనం పొందే వీలుంటుంది. ఇప్పటికే అనేక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించాం. ప్రస్తుతం ఊబకాయం సమస్య తీవ్రంగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు వ్యాయామం చేయాలి.

\- డాక్టర్ శ్రీరామ్‌సతీష్, బేరియాట్రిక్ సర్జన్, అపోలో ఆసుపత్రి

ప్రతి ఒక్కరు అప్రమత్తతగా ఉండాలి



ఊబకాయం విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి. చిన్ననాటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. అశ్రద్ధ చేస్తే తీవ్ర అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. చిన్నారుల్లో 25 శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. వయసు పెరిగే కొద్దీ తృణధాన్యాలతోపాటు వరి అన్నం ఎంతో మంచిది. అలాగే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. ఇంట్లో అమ్మ చేసే చిరుతిండ్లు మంచివి, బయట దొరికే ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ జోలికి పోవద్దు.

\- డాక్టర్ గంగాధర్, ఫిజీషియన్, జీజీహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం



ముఖ్యమంత్రితో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి దంపతులు

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం ఈదగాలి హెలీప్యాడ్ వద్ద సీఎం నారా చంద్రబాబు నాయుడికి శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. నందగోకులం లైఫ్ స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు మధ్యాహ్నం 3.14 గంటలకు సీఎం చేరుకున్నారు. ముఖ్యమంత్రికి చింతా శశిధర్ ఫౌండేషన్ చైర్మన్ చింతా శశిధర్, అనిల్ యం డ్యూరి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, కందుకూరు, కావలి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, దగుమాటి కృష్ణారెడ్డి, పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజండ్ల, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు ఘనస్వాగతం పలికారు. వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవాల అనంతరం చంద్రబాబు సాయంత్రం 4.53 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి తిరుగు పయనమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎంకు ఘనంగా వీడ్కోలు పలికారు.





సీఎంతో ఎమ్మెల్యేలు ఇంటూరి, కావ్య కృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, జెడ్ శివప్రసాద్ తదితరులు

ఉదయగిరి కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించండి


- కలెక్టర్‌కు సీఎం సూచన



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయంగా పేరుగాంచిన ఉదయగిరి వుడ్ కట్లరీ కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి శుక్రవారం జిల్లాకు విచ్చేసిన సీఎంకు కలెక్టర్ హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉదయగిరి వుడ్ కట్లరీ సెట్‌ను ముఖ్యమంత్రికి బహూకరించారు. దానిని ఆసక్తిగా చూసిన సీఎం.. చాలా బాగుందంటూ కితాబిచ్చారు. జిల్లాలో హస్తకళలను, కళాకారులను ప్రోత్సహించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కలెక్టర్‌కు సూచించారు. ఉదయగిరి కళా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలన్నింటినీ ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

ఆర్‌వోబీని మంజూరు చేయండి


- నుడా చైర్మన్ కోటంరెడ్డి వినతి



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌వోబీ) మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వినతిపత్రం అందజేశారు. పది లక్షల జనాభా కలిగిన నగరంలో ప్రస్తుతం అయ్యప్పగుడి, వెంకటేశ్వరపురం వద్ద మాత్రమే ఫ్లైఓవర్లు ఉన్నాయని గుర్తు చేశారు. వర్షం కురిస్తే అండర్ బ్రిడ్జిల వద్ద రాకపోకలు నిలిచిపోతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నూతన ఆర్‌వోబీని మంజూరు చేయాలని సీఎంను కోరారు.

సర్వేపల్లి ఆధునికీకరణకు అనుమతులివ్వండి

- ఎమ్మెల్యే సోమిరెడ్డి విజ్ఞాపన



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. సర్వేపల్లి రిజర్వాయర్ ప్రమాదంలో ఉందని, దీని ఆధునికీకరణకు రూ.50.35 కోట్లు అవసరమని జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపిందని తెలియజేశారు. బండేపల్లి-డేగ పూడి కాలువ పనులు ప్రారంభానికి అవసరమైన రూ.43 కోట్ల నిధులను కూడా మంజూరు చేయాలని కోరారు. 4500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన కండలేరు ఎడమ కాలువ(18ఆర్) పనులకు అనుమతులివ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులివ్వాలని, ముత్తుకూరు పీహెచ్‌సీని 50 పడకల సీహెచ్‌సీగా స్థాయి పెంచాలని కోరారు.

రూరల్ అభివృద్ధి పుస్తకం అందజేత



నెల్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో ప్రత్యేకంగా తయారు చేయించిన బుక్ లెట్‌ను రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రికి అందజేశారు. నియోజకవర్గంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. త్రీఫేస్ విద్యుత్ లైన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని, ఈ పనులకు చంద్రన్న విద్యుత్ వెలుగులు గా నామకరణం చేసినట్లు చెప్పారు. కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణం కూడా జరుగుతోందని, వీటి ద్వారా 80 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని శ్రీధర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని సీఎం చంద్రబాబు అభినందించారు.

ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేని

పురుగు మందుల సీజ్

- విలువ రూ.12.4 లక్షలు



పురుగు మందుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కందుకూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు పురుగు మందుల దుకాణాలలో వ్యవసాయాధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరైన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేకుండా నిల్వ ఉంచిన రూ.12.4 లక్షల విలువైన పురుగు మందులను సీజ్ చేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాలతో ఉదయగిరి ఏడీఏ ముత్యాల శేషగిరిరావు నేతృత్వంలో వ్యవసాయాధికారులు కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడులో ఈ దాడులు నిర్వహించారు. కందుకూరులోని మన గ్రోమోర్ సెంటర్‌లో రూ.3.7లక్షలు విలువైన పురుగు మందులను, ఉలవపాడు మన గ్రోమోర్ సెంటర్‌లో రూ.8.2 లక్షల విలువైన సరుకును, గుడ్లూరులోని ఓ ప్రైవేటు డీలరు వద్ద రూ.50వేల విలువైన మందులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా కందుకూరు ఏవో అబ్దుల్ రహీం మాట్లాడుతూ సరైన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు లేకుండా విక్రయాలు సాగిస్తున్న పురుగు మందులలో నకిలీలు ఉండే అవకాశం ఉందని, అలాంటివి విని యోగిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు, ఉలవపాడు ఏవోలు బీ రవికుమార్, డీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో దొంగల హల్‌చల్

బిట్రగుంట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని బృందావనం, కుమ్మరవీధుల్లో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గత ఏడాది బృందావనంలో ఏకంగా ఐదు ఇళ్లలో దొంగలు జొరబడి రెండు ఇళ్లలో చోరీలు చేసిన సంఘటన తెలిసిందే. దీంతో అప్రమత్తంగా ఉన్నామని స్థానికులు తెలిపారు. అయితే కుమ్మరవీధి చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో బైక్ చోరీకి గురైందని, పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితుడు గుర్రంకొండ వంశీ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్‌లో ఓ వ్యక్తి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా వల్లూరుకు చెందిన బొమ్ము నరేష్‌కుమార్ (41) సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అయితే తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతానంటూ భార్యకు తరచూ చెప్పేవాడని, ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమార్తె గమనించి తల్లికి సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం మృతుడి భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ రామ్మోహన్



డాక్టర్ మస్తాన్ బాషా



డాక్టర్ రామ్మోహన్

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షుడుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మస్తాన్ బాషా, కార్యదర్శిగా డాక్టర్ రామ్మోహన్, కోశాధికారిగా డాక్టర్ కేఆర్ హర్షవర్ధన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే నెల్లూరు మెడికల్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ ప్రేమ్‌దీప్, కోశాధికారిగా డాక్టర్ వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. శుక్రవారం నగరంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి కే.రాహుల్‌బాబు, అసోసియేషన్ సభ్యులు వీరిని ఎన్నుకున్నారు. వీరు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

ఇబ్బందిపెట్టే అధికారులను వదలం

- మాజీ మంత్రి కాకాణి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం నిరంతరం కష్టపడే వారికే పదవులు అప్పగించడం జరుగుతుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విరువూరులో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారం చేపట్టడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేసిన అధికారులను భవిష్యత్తులో విడిచి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తొలుత గ్రామంలోని వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీ, నెల్లూరు పార్లమెంట్, నియోజకవర్గ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, కొడవలూరి ధనుంజయరెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం మహిళల

అంతర్ కళాశాలల క్రీడలు ప్రారంభం

- కబడ్డీ విన్నర్స్ శ్రీసాయి, రన్నర్స్ జేబీ కళాశాల



కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న శ్రీసాయి, జేబీ కళాశాలల జట్లు

కావలి (టౌన్), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం (వీఎస్‌యూ) మహిళల అంతర్ కళాశాలల క్రీడా పోటీలు శుక్రవారం కావలి పట్టణంలోని వర్సిటీ పీజీ కళాశాలలో జరిగాయి. వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ వెంకట్రాయులు ఆధ్వర్యంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన పోటీలు ప్రారంభమయ్యాయి. వెంకట్రాయులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం విద్యతోపాటు క్రీడలకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. అనంతరం కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. 13 కళాశాలల నుంచి 220 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు.

విజేతలు...

కబడ్డీ ఫైనల్స్ పోటీలో కావలికి చెందిన శ్రీసాయి డిగ్రీ కళాశాల కావలికే చెందిన జేబీ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. శ్రీసాయి జట్టు విజయం సాధించింది. షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో నెల్లూరు జెనెక్స్ కళాశాల క్రీడాకారిణి రాజేశ్వరి చాంపియన్‌గా, జేబీ కళాశాల విద్యార్థిని మేఘన రన్నర్‌గా నిలిచారు. డబుల్స్‌లో జెనెక్స్ కళాశాల నుంచి రాజేశ్వరి, ఓంకీర్తి విజయం సాధించగా, గూడూరు ఎస్ఆర్‌కే కళాశాల జట్టు రన్నర్‌గా నిలిచింది. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీజీ కళాశాల పీడీ మణికంఠ, పరిశీలకురాలిగా డాక్టర్ విజయకళ వ్యవహరించారు. కార్యక్రమంలో పీడీలు నారాయణరాజు, రవీంద్రబాబు, ప్రసాద్ రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న వెంకట్రాయులు